
బుధవారం 20 ఆగస్టు 2025

https://www.telugudesam.org



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



ఆదరణ 3లో
మత్స్యకారులకు ప్రాధాన్యం
- రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత


6



# పేదల పెన్నిధి.. కూటమి

- ప్రభుత్వ ప్రతి నిర్ణయమూ పేదల అభ్యున్నతికే
- సేవతో తృప్తి... సాయంతో మరింత సంతృప్తి
- సాయంతో పాటు... భరోసానూ మార్గదర్శులివ్వాలి
- చేయూతను బంగారు కుటుంబాలు సద్వినియోగం చేయాలి
- టీడీపీలోనే.. ఆడబిడ్డలకు అందలం
- ప్రజారోగ్య పరిరక్షణకు సంజీవని పేరిట పథకం
- నేనూ మార్గదర్శినే... దత్తత కుటుంబాలకు సమయం కేటాయిస్తా
- పీ-4 అమలు కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం
- అడాప్ట్ ట్రీని కుప్పంలోని బంగారు కుటుంబానికి అందించిన సీఎం
- సాయంచేసి జీవితాలు బాగు చేస్తున్నారంటూ బంగారు కుటుంబాల భావోద్వేగం

2



అమరావతి (చైతన్య రథం): కూటమి ప్రభుత్వం ప్రతి నిర్ణయమూ పేదలను దృష్టిలో పెట్టుకునే తీసుకుంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ-4 కార్యక్రమం అమలును మంగళవారం సీఎం చంద్రబాబు లాంఛనంగా ప్రారంభించారు. మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో జరిగిన కార్యక్రమంలో బంగారు కుటుంబాలు, మార్గదర్శులతో ముఖ్యమంత్రి ముఖాముఖి నిర్వహించారు. ఈ ఏడాది ఉగాదిన పీ-4 కార్యక్రమాన్ని ప్రారంభించగా.. అప్పటి నుంచి బంగారు కుటుంబాలు, మార్గదర్శుల ఎంపిక ప్రక్రియను ప్రభుత్వం చేపట్టింది. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 13,40,697 బంగారు కుటుంబాలను 1,41,977 మంది మార్గదర్శులు దత్తత తీసుకున్నారు.

## విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ జరగదు

4



- దుష్ప్రచారానికి తెరదించాలి
- నిధులు సాధించి ఊపిరిపోసిన సీఎం చంద్రబాబు
- వైసీపీ అనుబంధ సంఘాల ప్రచారం నిరాధారం
- తప్పుడు వార్తలపై చర్యలు తప్పవు
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ స్పష్టీకరణ

## ఒకేమాటపై ఐక్యంగా ఎన్డీఏ

- మంత్రి నారా లోకేష్



అమరావతి (చైతన్యరథం): ఉపరాష్ట్రపతి ఎన్నికలపై ఎన్డీఏలో ఎలాంటి ద్వైదీభావం, అస్పష్టతా లేదని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. ఆప్యాయత, పరస్పర గౌరవం, సంకల్పం ఎన్డీఏ మూలసూత్రాలన్నారు. ఒకేమాటపై ఎన్డీఏ ఐక్యంగా ఉందన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో మంత్రి లోకేష్ పోస్ట్ చేశారు. కూటమి ఎంపీలు, సీనియర్ నాయకులతో కలిసి ఢిల్లీలో ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌ను కలిసి అభినందనలు తెలిపిన వీడియోను ఈ పోస్ట్‌తో మంత్రి లోకేష్ షేర్ చేశారు.

## అమరావతిపై ఏడుపులు ఆపండి

- గుంతల్లోకి నీరు వస్తే మునిగినట్లేనా?
- పశ్చిమ బైపాస్‌పై బ్రిడ్జి దగ్గర మట్టి అడ్డుగా ఉండి నిలిచిన కొండవీటి వాగు వరద నీరు
- నోటికొచ్చినట్లు మాట్లాడితే ప్రజలు సహించరు
- వైసీపీ నేతలపై మంత్రి నారాయణ మండిపాటు

4



## జర్నలిస్టులకు అవకాశం

జర్నలిజంలో అనుభవం ఉండి.. సమకాలీన రాజకీయ అంశాలపై సమర్థ విశ్లేషణలు అందించగల అనుభవజ్ఞులకు ఆహ్వానం. తెలుగుదేశంపార్టీ కేంద్ర కార్యాలయంలో అనలిస్టులుగా పని చేయడానికి ఆసక్తికలిగిన అభ్యర్థులు.. తమ దరఖాస్తులను కింద పేర్కొన్న వాట్సాప్ నెంబర్‌కు పంపించవచ్చు. రాజకీయ, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహనతోపాటు.. సరళమైన తెలుగుపై పట్టు ఉండాలి. సంక్షిప్తరూపంలో భావ వ్యక్తీకరణ చేయగల సమర్థత ఉండాలి.

*తెలుగుదేశం పార్టీపట్ల నిబద్ధత, రాజకీయ అంశాలపై అవగాహన ఉన్న జర్నలిస్టులు, అనుభవజ్ఞులు దరఖాస్తు చేయవచ్చు.*

**దరఖాస్తులను 9440477221 మొబైల్ నెంబరుకు పీడీఎఫ్ ఫార్మాట్‌లో వాట్సాప్ చేయవచ్చు.**

**టీడీపీ నాలెడ్జ్ సెంటర్,**
**తెలుగుదేశం కేంద్ర కార్యాలయం, మంగళగిరి.**

## సోషల్ మీడియాలో.. తప్పుడు పోస్టులపై కఠిన చర్యలు

- రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రత్యేక చట్టం
- ఏపీ బ్రాండ్‌ను దెబ్బతీసేలా శాడిస్ట్ ప్రచారం
- వాస్తవాలను తెలియజేసేందుకు ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ
- రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత

5



## స్త్రీశక్తి.. భారం కాదు బాధ్యత

- అక్కసుతోనే వైసీపీ విష ప్రచారం
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

6



చైతన్యరథం

# పేదల పెన్నిధి.. కూటమి

- ప్రభుత్వ ప్రతి నిర్ణయమూ పేదల అభ్యున్నతికే
- సేవతో తృప్తి... సాయంతో మరింత సంతృప్తి
- సాయంతో పాటు... భరోసానూ మార్గదర్శులివ్వాలి
- చేయూతను బంగారు కుటుంబాలు సద్వినియోగం చేయాలి
- టీడీపీలోనే.. ఆడబిడ్డలకు అందలం
- ప్రజారోగ్య పరిరక్షణకు సంజీవని పేరిట పథకం
- నేనూ మార్గదర్శినే...దత్తత కుటుంబాలకు సమయం కేటాయిస్తా
- పీ-4 అమలు కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం
- అడాప్ట్ ట్రీని కుప్పంలోని బంగారు కుటుంబానికి అందించిన సీఎం
- సాయంచేసి జీవితాలు బాగు చేస్తున్నారంటూ బంగారు కుటుంబాల భావోద్వేగం




అమరావతి (చైతన్య రథం): కూటమి ప్రభుత్వం ప్రతి నిర్ణయమూ పేదలను దృష్టిలో పెట్టుకునే తీసుకుంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ-4 కార్యక్రమం అమలును మంగళవారం సీఎం చంద్రబాబు లాంఛనంగా ప్రారంభించారు. మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో జరిగిన కార్యక్రమంలో బంగారు కుటుంబాలు, మార్గదర్శులతో ముఖ్యమంత్రి ముఖాముఖి నిర్వహించారు. ఈ ఏడాది ఉగాదిన పీ-4 కార్యక్రమాన్ని ప్రారంభించగా.. అప్పటి నుంచి బంగారు కుటుంబాలు, మార్గదర్శుల ఎంపిక ప్రక్రియను ప్రభుత్వం చేపట్టింది. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 13,40,697 బంగారు కుటుంబాలను 1,41,977 మంది మార్గదర్శులు దత్తత తీసుకున్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "పేదరిక నిర్మూలన ఎన్టీఆర్ సిద్ధాంతం. సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లని భావించే సిద్ధాంతాన్ని బలంగా నమ్మి పరిపాలన చేస్తున్నాం. అందుకే ప్రతినిత్యం పేదల కోసమే ఆలోచన చేస్తున్నాం. పేదల అభ్యున్నతికే నిర్ణయాలు తీసుకుంటున్నాం. ఆర్థిక సంస్కరణలతో సంపద వచ్చింది. ఇప్పుడు సమాజంలో అసమానతలు తగ్గించాల్సిన అవసరం ఉంది. అందుకే పీ-4ను ప్రారంభించాం. రాష్ట్రవ్యాప్తంగా 1.69 కోట్ల కుటుంబాలున్నాయి. సాయం కోరే పేద కుటుంబాలు 21 లక్షలున్నాయి. మార్గదర్శుల ఎంపికలో ఎలాంటి బలవంతం లేకుండా.. పూర్తి స్వచ్ఛంధంగానే కార్యక్రమాన్ని చేపడతున్నాం.

సేవ చేయడానికి ఒక్కొక్కరు ఒక్కో మార్గాన్ని ఎంచుకుంటారు. ఇటీవలే ఓ అజ్ఞాత భక్తుడు తాను స్థాపించిన కంపెనీ ద్వారా వచ్చిన సంపాదన నుంచి రూ.140 కోట్ల విలువైన 121 కేజీల బంగారాన్ని తిరుమల వెంకన్నకు ఇచ్చారు. ఇంత భారీఎత్తున విరాళం ఇచ్చినా.. తన పేరు బయటకు తీసుకురావద్దని కోరారు. ఇలా కొంతమంది తమకు తోచిన రీతిలో సేవ కార్యక్రమాలు చేస్తూ ఉంటారు. ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా.. రాని తృప్తి, సంతృప్తి పేదలకు సేవ చేసినా, సాయం చేసినా కలుగుతుందని సీఎం చంద్రబాబు అన్నారు.


## చెప్పడమే కాదు... చేసి చూపిస్తున్నాను...

"నేను కూడా మార్గదర్శినే. కుప్పం నియోజకవర్గానికి చెందిన 250 కుటుంబాలను దత్తత తీసుకున్నాను. సీఎంగా, పార్టీ అధ్యక్షుడిగా ఎంత బిజీగా ఉన్నా... దత్తత తీసుకున్న కుటుంబాలకు సమయం కేటాయిస్తా. మార్గదర్శులు ఇచ్చే చేయూతను బంగారు కుటుంబాలు అందిపుచ్చుకోవాలి. అభివృద్ధి చెందాలి. సద్వినియోగం చేసుకోవాలి. అలాగే సమాజం ఇచ్చిన సహకారంతో ఎదిగిన వారు సమాజానికి తిరిగివ్వాలని మార్గదర్శులు కూడా ఆలోచించాలి. మార్గదర్శులు డబ్బులిచ్చి సాయం చేయడంతో సరిపెట్టకుండా... బంగారు కుటుంబాలకు భరోసాగా ఉండాలి. భూమి మీద ఎవరూ శాశ్వతం కాదు. వెళ్లేటప్పుడు ఏం తీసుకెళ్లలేరు. మానవత్వం ఉన్న మనుషులుగా బతకాలి. చనిపోయిన తర్వాత కూడా మనల్ని గుర్తు పెట్టుకునే పనులు చేయాలి. డొక్కా సీతమ్మ అంటే పేదల పెన్నిధి. అన్నదాతగా ఇప్పటికీ ప్రజల్లో గుర్తుండిపోయారు. మంచి కార్యక్రమం చేస్తే చరిత్ర గుర్తు పెట్టుకుంటుంది. అందుకే సమాజం కోసం పని చేయాలని కోరుతున్నాను. పీ-4 అమలు విషయంలో ఇకపై ప్రతి రోజూ మానిటరింగ్ ఉంటుంది. మూడు నెలలకోసారి సమీక్ష ఉంటుంది" అని సీఎం స్పష్టం చేశారు.



## ఆదాయం ఉండాలి... సేవ చేయాలనే తపన ఉండాలి

"పేదలకు సేవ చేయాలన్నా... సంక్షేమం అందించాలన్నా... సంపద సృష్టించాలి. ఆదాయాన్ని తీసుకురావాలి. పేదలకు మేలు చేయాలనే మనస్సుండాలి. అప్పుడే సంక్షేమం అందివ్వగలం. ఏ రాష్ట్రం అమలు చేయని విధంగా పెద్దఎత్తున సంక్షేమం అమలు చేస్తున్నాం. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా సంక్షేమం అందిస్తున్నాం. సంపద సృష్టికి కృషి చేస్తున్నాం. సంపద సృష్టించి.. ఆ సంపదను పేదలకు ఇచ్చే ప్రభుత్వం మాది. ఈ నెలలో అనేక సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాం. ప్రతి నెలా ఇచ్చే పెన్షన్లు ఇచ్చాం. అన్నదాత సుఖీభవ డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేశాం. తల్లికి వందనం పథకాన్ని ఈ నెలలోనే అమలు చేశాం. ఎంత మంది పిల్లలుంటే అంతమందికీ తల్లికి వందనం అమలు చేశాం. ఆడబిడ్డలకు ఉచిత ప్రయాణం అందుబాటులోకి తెచ్చాం. ఆడబిడ్డలకు ఆర్థిక స్వాతంత్ర్యం వచ్చేలా చేశాం. ఆడబిడ్డలతో సహా ప్రతి ఒక్కరూ ఏదోక పని చేయాలి. ఉద్యోగం,ఉపాధి పొందాలి.ఉపాధి నిమిత్తం వెళ్లే ఆడబిడ్డలకు స్త్రీశక్తి పథకం ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ధరలు పెరిగాయని మళ్లీ కొందరు కట్టెల పొయ్యి వాడారు.అందుకే మహిళల కోసం ఉచితంగా గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నాం. ఇలాంటి ఎన్నో పథకాలు పేదలకు అందించాలంటే దూరదృష్టి కావాలి. అందుకే స్వర్ణాంధ్ర 2047 విజన్ రూపొందించాం. విజన్ 2020 రూపొందిస్తే ఆనాడు అందరూ విమర్శించారు. కానీ ఆనాడు నేను చెప్పిన దానికంటే.. తెలంగాణ, హైదరాబాద్ ఎక్కువగా అభివృద్ధి చెందాయి. ఇప్పుడు విజన్ 2047 రూపొందించాం. 2047పెద్ద దూరంలేదు. 22ఏళ్లు మాత్రమే ఉంది.ఈ ప్రణాళికలు నిజం కావాలంటే...ప్రభుత్వాల్లో కంటిన్యూటి ఉండాలి. ప్రస్తుతం హెచ్‌సీఎల్ వంటి సంస్థ గన్నవరంలో 5 వేల మందికి ఉపాధి కల్పిస్తోంది. 2019లో ప్రభుత్వం కొనసాగిఉంటే... మరింత మందికి ఉద్యోగాలు ఇచ్చేది. ఉపాధి చూపించేది. అందుకే అభివృద్ధి వైకుంఠపాళి కాకూడదు" అని చంద్రబాబు ఉద్ఘాటించారు.



## ప్రజారోగ్య పరిరక్షణకు సంజీవని

"ఆరోగ్యం కోసం బెస్ట్ విధానం తీసుకురాబోతున్నాం. బిల్‌గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి ప్రజారోగ్య పరిరక్షణ చేపడతాం. సంజీవని పేరుతో ప్రజారోగ్య పరిరరక్షణ కార్యక్రమాన్ని చేపట్టనున్నాం. ప్రజలఆరోగ్యాన్ని కాపాడేందుకు సంజీవని తెస్తున్నాం. ఇప్పటికే కుప్పంలో బిల్‌గేట్స్ ఫౌండేషనుతో డీజీ నెర్వ్ సెంటర్ ఏర్పాటు చేశాం. త్వరలో చిత్తూరు జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తాం. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి తెస్తాం. పేద ప్రజల కోసం.. వారి ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని ముఖ్యమంత్రి అన్నారు. కార్యక్రమంలో విదేశాల్లో ఉన్న వారితో జూమ్ ద్వారా చంద్రబాబు ముఖాముఖి నిర్వహించారు. పేద కుటుంబాలను దత్తత తీసుకునేందుకు పలువురు సౌదీ ఆరేబియాకు చెందిన తెలుగువారు ముందుకువచ్చారు.వారితో నిర్వహించిన ముఖాముఖి సందర్భంగా పలువురు బంగారు కుటుంబాలకు చెందిన ప్రతినిధులు భావోద్వేగానికి గురయ్యారు. పీ4 ద్వారా హెచ్‌సీఎల్ కంపెనీలో ఉద్యోగం కల్పించటంతో కృష్ణా జిల్లావాసి పావని భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు. అలాగే కుప్పంలో తాను దత్తత తీసుకున్నదానికి సంకేతంగా అడాప్ట్ ట్రీని బంగారు కుటుంబాలకు ముఖ్యమంత్రి అందించారు. ఈ కార్యక్రమంలో పీ-4 ఫౌండేషన్ వైస్ ఛైర్మన్ కుటుంబరావు, ఎన్నార్టీ ఛైర్మన్ వేమూరి రవికుమార్, ప్రణాళిక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.





# ఆమె మరణం.. మాకు తీరని లోటు

- పద్మజ భౌతిక కాయం వద్ద సీఎం చంద్రబాబు నివాళి
- కుటుంబ అనుబంధాలను గుర్తు చేసుకున్న చంద్రబాబు

హైదరాబాద్ (చైతన్య రథం): నందమూరి పద్మజ భౌతికకాయానికి ఏపీ సీఎం చంద్రబాబు నివాళులర్పించారు. ఎన్టీఆర్ పెద్ద కుమారుడు నందమూరి జయకృష్ణ సతీమణి పద్మజ అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం ఉదయం కన్నుమూశారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లోని జయకృష్ణ నివాసానికి వెళ్లిన సీఎం చంద్రబాబు.. పద్మజ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. "మా పెళ్లి విషయంలో జయకృష్ణ, పద్మజ పెద్ద దిక్కుగా ఉండి అన్నీ చూసుకున్నారు. ఇంట్లో అందరూ యంగ్ స్టర్స్ ఉంటే మా అత్తగారి తర్వాత ఆవిడే కుటుంబ పెద్దగా అందరితో కలుపుగోలుగా ఉండేవారు. అనారోగ్యంతో ఆమె మృతి చెందడం చాలా బాధేస్తోంది. అందరికంటే జయకృష్ణకు తీరని లోటు. ఎన్టీఆర్ కుటుంబంలో మొదట నాకు పరిచయం జయకృష్ణతోనే. నేను సినిమాటోగ్రఫీ మంత్రిగా ఉన్నప్పుడు.. ఎగ్జిబిటర్‌గా ఆయన నా దగ్గరికి వచ్చే వారు. ఆ తర్వాత ఎన్టీఆర్‌ను కలవడం.. అవన్నీ జరిగాయి. అన్ని విషయాలు ముందుండి ఆలోచించింది జయకృష్ణ. ఆయన కుటుంబానికి అందరం అండగా ఉంటాం" అని చంద్రబాబు తెలిపారు. పద్మజ... దగ్గుబాటి వెంకటేశ్వరరావుకు సోదరి. పద్మజ భౌతికకాయానికి నటుడు నందమూరి బాలకృష్ణ నివాళి అర్పించారు. తనకు ఆమె తల్లి తర్వాత తల్లిలాంటివారని బాలకృష్ణ ఈ సందర్భంగా చెప్పారు.





## మా కుటుంబానికి తీరని లోటు

- నందమూరి జయకృష్ణ సతీమణి పద్మజ మృతి బాధాకరం
- మంత్రి లోకేష్ సంతాపం

అమరావతి (చైతన్యరథం): దివంగత ఎన్టీఆర్ తనయుడు నందమూరి జయకృష్ణ సతీమణి పద్మజ మృతిపట్ల విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ సంతాపం వ్యక్తం చేశారు. మామయ్య జయకృష్ణ సతీమణి, పద్మజ అత్త కన్ను మూశారన్న వార్త తనను తీవ్ర ఆవేదనకు గురిచేసిందన్నారు. అన్నివేళలా అండగా నిలిచే పద్మజ అత్త ఆకస్మిక మృతి తమ కుటుంబానికి తీరని లోటుగా పేర్కొన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నానన్నారు.



# పీ-4ను హేళన చేస్తే చరిత్రహీనులే!

## ఫౌండేషన్ వైస్ ఛైర్మన్ కుటుంబరావు వ్యాఖ్య - సామాజిక ఉద్యంగా పీ-4 అన్న పీయూష్ కుమార్

మంగళగిరి (చైతన్య రథం): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ-4 కార్యక్రమం అమలును మంగళవారం సీఎం చంద్రబాబు లాంఛనంగా ప్రారంభించారు. మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో జరిగిన కార్యక్రమంలో బంగారు కుటుంబాలు, మార్గదర్శులతో ముఖ్యమంత్రి ముఖాముఖి నిర్వహించారు. ఈ ఏడాది ఉగాదిన పీ-4 కార్యక్రమాన్ని ప్రారంభించగా.. అప్పటినుంచి బంగారు కుటుంబాలు, మార్గదర్శుల ఎంపిక ప్రక్రియను ప్రభుత్వం చేపట్టింది. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 13,40,697 బంగారు కుటుంబాలను 1,41,977 మంది మార్గదర్శులు దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్ వైస్ ఛైర్మన్ కుటుంబరావు, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ కుమార్, జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, ఏపీ ఎన్‌ఆర్టీ అధ్యక్షులు వేమూరి రవి, 20 సూత్రాల కార్యక్రమాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, మహమ్మద్ నసీర్ అహ్మద్, గల్లా మాధవి, రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ, రాష్ట్ర లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యాలరావు, సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ తేజ పాల్గొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పీ4 కార్యక్రమం ద్వారా లబ్ధి పొందిన బంగారు కుటుంబాల సభ్యులు, చేయుత అందించిన మార్గదర్శులతో మాట్లాడి వారు ఆర్థికంగా



ఎదుగుతున్న విధానం గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్వర్ణాంధ్ర పీ-4 ఫౌండేషన్ వైస్ ఛైర్మన్ కుటుంబరావు మాట్లాడుతూ సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగించటానికి అట్టడుగునున్న కుటుంబాలకు, ఉన్నత స్థాయిలో ఉన్న వారు దత్తత తీసుకొని అవసరమైన సహకారం అందించటమే ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజలు భాగస్వామ్యం పీ-4 కార్యక్రమం అన్నారు. ఇది పూర్తిగా స్వచ్ఛంధ కార్యక్రమమని, సమాజంలో ప్రజలకు తమవంతు సహకారం అందించాలని ఉన్నతస్థాయిలో ఉన్న వారు పేద కుటుంబాలను దత్తత తీసుకోవటం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో తలసరి ఆదాయం రూ. 2.7 లక్షలుందని, కానీ దీనిలో ఉన్నతస్థాయిలో పది శాతం మందిని మినహాయిస్తే రూ. 1.5 లక్షలు మాత్రమే ఉంటుందన్నారు. 20 శాతం మందిని మినహాయిస్తే 80 శాతంమంది తలసరి ఆదాయం దాదాపు లక్ష మాత్రమేనన్నారు. సమాజంలో అవకాశాలను అందిపుచ్చుకొని ఆర్థికంగా ఎదిగిన వ్యక్తులు తిరిగి సమాజానికి తమవంతు సహకారం అందించి పేద కుటుంబాలకు సహాయం చేయటం ద్వారా హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీని నిర్మించవచ్చన్నారు.

పీ-4లో కేవలం ఆర్థిక సాయం మాత్రమే కాకుండా.. నైపుణ్యాల అభివృద్ధికి, విద్యా, వైద్య, వృత్తి నైపుణ్యాల శిక్షణ అందించి బంగారు కుటుంబాల ఆర్థిక అభివృద్ధి సాధించేలా మార్గదర్శులు సహాయం అందించవచ్చన్నారు. గతంలో చంద్రబాబు చేపట్టిన జన్మభూమి తరహాలోనే పీ-4 సత్ఫలితాలు అందిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. అవగాహన లేకుండా పీ-4ను హేళన చేసిన వారు చరిత్రహీనులు అవుతారని, మద్దతిచ్చినవారు చరిత్ర సృష్టిస్తారని కుటుంబరావు వ్యాఖ్యానించారు.

రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ప్రారంభించిన పీ-4ను సామాజిక ఉద్యమంగా మరింత ముందుకు తీసుకెళ్తున్నట్టు చెప్పారు. స్వర్ణాంధ్ర-2047లో భాగంగా సీఎం నిర్దేశించిన పది సూత్రాల అమలుకు కృషి చేస్తున్నామన్నారు. అందులో ముఖ్యమైన జీరో పావర్టీ సాధనలో భాగంగా సమాజంలో అట్టడుగునున్న 20 శాతంమందిని ఉన్నతస్థానంలోవున్న 10 శాతంమంది ఆదుకోవడమే పీ-4 ముఖ్య ఉద్దేశ్యమన్నారు. పీ-4 ముఖ్య ఉద్దేశ్యం, లక్ష్యాలను పీయూష్ కుమార్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

# విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ జరగదు

- దుష్ప్రచారానికి తెరదించాలి
- నిధులు సాధించి ఊపిరి పోసిన సీఎం చంద్రబాబు
- వైసీపీ అనుబంధ సంఘాల ప్రచారం నిరాధారం
- తప్పుడు వార్తలపై చర్యలు తప్పవు
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ స్పష్టీకరణ

అమరావతి (చైతన్యరథం): విశాఖ ఉక్కు ప్లాంట్ ప్రైవేటీకరణపై దుష్ప్రచారానికి తెరదించాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ అన్నారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్లాంట్ ప్రైవేటీకరణ అవుతోందంటూ వైసీపీకి అనుబంధంగా ఉన్న కొంతమంది నాయకులు, కార్మిక సంఘాల నేతలు చేస్తున్న ప్రచారం పూర్తిగా నిరాధారమని స్పష్టం చేశారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో పోరాడిన ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. విశాఖ ఉక్కు ప్లాంట్ ప్రైవేటీకరణ ఎప్పటికీ జరగదు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్టీల్ ప్లాంట్ పరిరక్షణలో కీలకపాత్ర పోషించారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.11,440 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.2,600 కోట్లు సమకూర్చి మొత్తం రూ.14,000 కోట్లకు పైగా నిధులు తెచ్చి ప్లాంట్‌కి ఆర్థికంగా ఊపిరి పోసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ నిధులతో ముడిసరుకు, విద్యుత్, నీటి అవసరాలు తీర్చేలా భరోసా కల్పించారని స్పష్టం చేశారు. 1998లో అటల్ బిహారీ వాజ్ పేయి ప్రధాని ఉన్న సమయంలోనూ, విశాఖ ఉక్కు ప్లాంట్ కష్టాల్లో ఉన్నప్పుడు అప్పటి సీఎం చంద్రబాబు, నేతలు కలసి రూ.1,350 కోట్లు తెచ్చి కాపాడిన విషయాన్ని గుర్తు చేశారు. నేడు మళ్లీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎంపీ భరత్‌ల కృషితో కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వ సహకారంతో భారీ నిధులు సమకూర్చినందువల్లే ప్లాంట్ మళ్లీ లాభదాయక దిశగా పయనిస్తోందని వివరించారు. కొందరు కార్మిక సంఘ నేతలు ప్లాంట్ మొత్తం ప్రైవేటీకరణ అవుతోందంటూ వాస్తవ దూరమైన ప్రచారంతో అపోహలు సృష్టిస్తున్నారని స్పష్టం చేశారు. కొన్ని కాంట్రాక్ట్ వర్క్‌లను మెరుగైన సేవలు అందించేలా ప్రైవేట్ సంస్థలకు అప్పగించారని, ఇదేమీ కొత్త విషయం కాదన్నారు. గతంలో కూడా ఇదే విధానం కొనసాగిందని తెలిపారు. ప్రస్తుతం ప్లాంట్‌లో 15 వేల మందికి పైగా కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారని, వారి సహకారంతోనే ఉత్పత్తి కొనసాగుతోందని వివరించారు. ప్లాంట్‌లో మూడు బ్లాస్ట్ ఫర్నేసులు ఉన్నాయి. అందులో రెండు పూర్తిస్థాయి సామర్థ్యంతో నడిస్తేనే బ్రేక్‌ఈవెన్ సాధ్యమవుతుంది. ప్రస్తుతం పూర్తి సామర్థ్యంతో పని చేయడం వల్ల ప్లాంట్ లాభాల్లోకి



అడుగుపెడుతోందన్నారు. నెలకు రూ.240 కోట్ల జీతభత్యాల భారం ఉన్నప్పటికీ, పూర్తి స్థాయి ఉత్పత్తితోనే నెలకు రూ.100 నుండి రూ.200 కోట్లు లాభాలు సాధ్యమని వివరించారు. ఇక వైసీపీ పాలనలో ప్లాంట్ కేవలం 20-30 శాతం సామర్థ్యంతోనే నడిచిందని, ఒక్క బ్లాస్ట్ ఫర్నేస్ మాత్రమే రన్ చేయడం వల్ల నష్టాల్లో కూరుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాదు ఆ సమయంలో కొందరు కార్మిక నాయకులు కాంట్రాక్టు ఉద్యోగాల పేరుతో రూ.3 నుండి రూ.8 లక్షల వరకు వసూలు చేసి, వందలాది మంది "బ్రాస్ట్ వర్కర్స్" పేరుతో జీతాలు తీసుకునేలా చేసి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ అంశాలపై విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇకనైనా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు ఆపాలని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. విశాఖ ఉక్కు ప్లాంట్‌ను పూర్తి స్థాయిలో లాభాల్లోకి తీసుకెళ్లడం కూటమ ప్రభుత్వ లక్ష్యమని, అది ఎప్పటికీ ప్రభుత్వ రంగంలోనే కొనసాగుతుందని హామీ ఇచ్చారు. నిర్వాసిత కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించే దిశగా చర్యలు కొనసాగుతాయని, 8,000 మంది నిర్వాసితులకు న్యాయం జరిగేలా ఇప్పటికే కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చామని పేర్కొన్నారు. అదేవిధంగా, సోషల్ మీడియా ద్వారా తప్పుడు వార్తలు వ్యాప్తి చేయటం రాష్ట్రానికి ప్రమాదకరమని హెచ్చరించారు. అజ్ఞానం కన్నా తప్పుడు జ్ఞానం ప్రమాదకరం అని చెబుతూ, ఎవరైనా సమాచారాన్ని పంచే ముందు వాస్తవాలు తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అమరావతి వరద ముంపు, విశాఖ స్టీల్ ప్రైవేటైజేషన్ వంటి దుష్ప్రచారాలు వైసీపీకి అనుబంధమైన వ్యక్తుల వల్లనే జరుగుతున్నాయని, ఇటువంటి ప్రయత్నాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, యువనేత, మంత్రి నారా లోకేష్ పర్యవేక్షణలో విశాఖ స్టీల్ ప్లాంట్ అభివృద్ధి, పబ్లిక్ సెక్టార్ బలోపేతం, నిర్వాసితులకు న్యాయం, కార్మికుల సంక్షేమం అన్నీ సాధ్యమవుతాయని ఆయన స్పష్టం చేశారు. ప్లాంట్ ప్రైవేటీకరణ అవుతుందనే వార్తలకు ఎలాంటి ఆధారాలు లేవని, ఎవరైనా ఇలాంటి ప్రచారం చేస్తే కఠిన చర్యలు తప్పవని పల్లా హెచ్చరించారు.

# అమరావతిపై ఏడుపులు ఆపండి

- గుంతల్లోకి నీరు వస్తే ఐకానిక్ భవనాలు మునిగిపోయినట్లేనా?
- పశ్చిమ బైపాస్‌పై బ్రిడ్జి దగ్గర మట్టి అడ్డుగా ఉండి నిలిచిన కొండవీటి వాగు వరద నీరు
- కారణాలు తెలియకుండా నోటికొచ్చినట్లు మాట్లాడితే ప్రజలు సహించరు
- వైసీపీ నేతలపై మంత్రి నారాయణ మండిపాటు



అమరావతి (చైతన్యరథం): రాజధాని అమరావతి మునిగిపోయిందంటూ పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తోన్న వైసీపీ నాయకులపై మంత్రి నారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. అమరావతిపై ఏడుపులు ఇకనైనా ఆపాలని వైసీపీ నాయకులకు హితవు పలికారు. అమరావతిలో కొండవీటి వాగు నీటి ప్రవాహానికి ఆటంకం కలగడంతో వరద నీరు నిలిచిపోయిన ప్రాంతాలను మంత్రి నారాయణ మంగళవారం పరిశీలించారు. అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఎండీ లక్ష్మీ పార్థసారథితో కలిసి ఆయా ప్రాంతాల్లో మంత్రి పర్యటించారు. విజయవాడ పశ్చిమ బైపాస్ పై ఈ - 11 రోడ్డు వద్ద కొండవీటి వాగుపై నేషనల్ హైవేస్ అధికారులు ఓ వంతెన నిర్మించారు. ఈ వంతెన నిర్మాణ సమయంలో అక్కడ మట్టిని అలాగే వదిలేయడంతో అక్కడే కొండవీటి వాగు ప్రవాహానికి ఆటంకం ఏర్పడింది. దీంతో వంతెన దిగువ నుంచి నీరు వెళ్లే మార్గం లేక నీరుకొండ పరిసర ప్రాంతాల్లో పొలాల్లో వరద నీరు నిలిచిపోయింది. ఈ వాస్తవాలను పరిశీలించిన మంత్రి నారాయణ అక్కడికక్కడే అధికారులకు పలు ఆదేశాలు జారీ చేసారు. పొక్లెయిన్‌లతో మట్టి తొలగించడంతో పాటు జాతీయ రహదారి పై కూడా స్వల్పంగా గండి కొట్టి నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఆ తర్వాత మీడియాతో మంత్రి నారాయణ మాట్టడుతూ వైసీపీపై తీవ్రంగా మండిపడ్డారు.

అమరావతిపై ఇకనైనా ఏడుపులు ఆపకపోతే వైసీపీకి ఈసారి ఆ 11 సీట్లు కూడా రావన్నారు. ఎక్కడైనా నిర్మాణాలు జరిగేటప్పుడు వర్షం వస్తే పునాదుల గుంతల్లోకి నీళ్లు రావా? గుంతల్లోకి నీరు వస్తే ఐకానిక్ భవనాలు మునిగిపోయినట్లేనా అని వైసీపీ నాయకులను ప్రశ్నించారు. అమరావతిపై దుష్ప్రచారం చేస్తే ప్రజలు సహించబోరన్నారు. పశ్చిమ బైపాస్‌పై బ్రిడ్జి నిర్మించిన దగ్గర మట్టి అడ్డుగా ఉండటంతో నీరు నిలిచిపోయిందన్నారు. అది కూడా కేవలం రెండు గ్రామాల పరిధిలో మాత్రమే పొలాల్లో నీరు నిలిచిందన్నారు. మిగతా గ్రామాల్లో వర్షం పడిన కొన్ని గంటల్లోనే నీరు బయటికి వెళ్లిపోయిందన్నారు. ప్రస్తుతం కొండవీటి వాగు ప్రవాహానికి అడ్డుగా ఉన్న మట్టిని తొలగించే పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఎవరెంతగా ఏడ్చిఇనా అమరావతి పనులు జరిగిపోతూనే ఉంటా యన్నారు. వచ్చే మార్చి నాటికి అధికారులు, ఉద్యోగుల క్వార్టర్లు సిద్ధం చేస్తున్నామన్నారు. రాజధాని మునిగిపోయిందని ప్రచారం చేస్తున్న వారు అమరావతికి వచ్చి పరిస్థితి చూడాలని మంత్రి సూచించారు.



## అన్నక్యాంటీన్‌లో మంత్రి భోజనం

- కూలి డబ్బులు మిగులుతున్నాయి
- రూ.5తో కడుపు నింపుతున్నారు
- పేదలు, రోజువారీ కార్మికుల హర్షం
- సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు

(అమరావతి/విజయవాడ(చైతన్యరథం): గన్నవరం ఎయిర్‌పో ర్టు నుంచి తాడేపల్లి క్యాంపు కార్యాలయానికి వెళుతున్న బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత మార్గమధ్యంలో విజయవాడ రాణిగారితోట బాలాజీనగర్‌లో ఉన్న అన్న క్యాంటీన్‌ను సందర్శించారు. సామాన్యు రాలిలా తాను కూడా లైన్‌లో నిలుచుని రూ.5 టోకెన్ తీసుకుని భోజనం చేశారు. తనతోపాటు భోజనం చేస్తున్నవారిని పేరు పేరునా అప్యా యంగా పలుకరించారు. భోజనం ఎలా ఉందని అడిగారు. అన్న క్యాంటీన్‌లో భోజనం బాగుంది.. చంద్రబాబు వల్ల కడుపు నిండా భోజనం చేస్తున్నాం..చిన్నచిన్న షాపులో పనిచేస్తున్న తమకు రూ.5లకే భోజనం దొరుకుతుండడంతో డబ్బు ఆదా అవుతున్నాయని పేదలు, కార్మికులు, రోజువారీ కూలీలు హర్షం వ్యక్తంచేశారు. సీఎం చంద్ర బాబుకు, డిప్యూటీ సీఎం పవన్‌కు, మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పాలనలో సీఎం చంద్రబాబే నెంబర్ వన్ అని ప్రశంసిం చారు. కూలి పనిచేసుకుంటున్న తమకు డబ్బులు మిగులుతున్నాయని ఆనందం వ్యక్తంచేశారు. తల్లికి వందనం, ఉచిత గ్యాస్ పథకాలు అందాయా.. ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం వినియోగించుకున్నారా? అని అడుగగా ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం వల్ల ఛార్జీలు మిగు లుతున్నాయని మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం మంత్రి సవిత అన్నక్యాంటీన్ పరిసరాలను, పాత్రలు శుభ్రం చేసే గదిని పరిశీలించారు. ఎప్పటికప్పుడు ఆహార పదార్థాల పాత్రలు, ప్లేట్లను శుభ్రం చేస్తున్న సిబ్బందిని అభినందించారు.

## వరదపై తప్పుడు ప్రచారం

### వైసీపీ నేత అంబటి మురళిపై కేసు

గుంటూరు (చైతన్యరథం): పొన్నూరు వైసీపీ ఇన్‌చార్జి అంబటి మురళిపై గుంటూరు జిల్లా చేబ్రోలు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అమరావతి మునుగుతుం దనే భయంతో కొండవీటి వాగు వరదను కాలువలోకి మళ్లించటం వల్లే పొన్నూరు నియోజకవర్గంలో పొలాలు మునిగాయని అంబటి మురళి అసత్య ప్రచారం చేశారని అప్పాపురం కాలువ ఏఈఈ ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు చేబ్రోలు పీఎస్‌లో కేసు నమోదైంది. విపత్తుల పేరుతో రైతులను భయభ్రాంతులకు గురిచేశారని ఏఈఈ ఫిర్యాదులో పేర్కొన్నారు. అంబటి మురళితోపాటు వార్తను ప్రసారం చేసిన సాక్షి ఛానల్‌పైనా కేసు నమోదు చేశారు.

# బీసీ హాస్టళ్ల పనితీరుకు మార్కులు

- విభాగాల వారీగా కేటాయింపు
- మరింత మెరుగ్గా నిర్వహణకు చర్యలు
- ఉత్తమ ఫలితాలు సాధించిన వార్డెన్లకు
- బదిలీలు, పదోన్నతుల్లో ప్రాధాన్యం
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత






అమరావతి(చైతన్యరథం): కార్పొరేట్ విద్యాసంస్థల హాస్టళ్లకు ధీటుగా సౌకర్యాలతో బీసీ బిడ్డలకు ఆరోగ్య భద్రతతో కూడిన నాణ్యమైన విద్యను అందించేలా బీసీ హాస్టళ్ల నిర్వహణకు కూట మి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత తెలిపారు. నిధులు, పరికరాలు అందించడమే కాకుండా పనితీరు కనబరిచే హాస్టళ్లకు మార్కులు కేటాయించనున్నట్లు చెప్పారు. అత్యధిక మార్కులు సాధించిన హాస్టళ్ల వార్డెన్లకు బదిలీలు, పదోన్నతుల్లో ప్రాముఖ్యతనిచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేసిన ట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,110 బీసీ హాస్టళ్లు ఉండగా వాటిలో 747 ప్రీ మెట్రిక్ హాస్టళ్లు, 363 పోస్టు మెట్రిక్ హాస్టళ్లు ఉన్నాయి. 660 వసతిగృహాలు ప్రభుత్వ భవనాల్లో ఉండగా,. మిగిలిన 450 హాస్టళ్లు అద్దె భవనాల్లో కొనసాగుతు న్నాయి. అధికారంలోకి కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి బీసీ హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి సారించింది. 104 బీసీ సంక్షేమ హాస్టళ్లలో ఎస్ఆర్ శంకరన్ రిసోర్సు సెంటర్లను ఏర్పాటు చేసిం ది. గత ప్రభుత్వం చెల్లించకుండా మిగిల్చిన రూ.76.38 కోట్ల డైట్ ఛార్జీలను కూటమి ప్రభుత్వం చెల్లించింది. వసతి గృహాల్లో ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్.ఆర్.ఎస్.) అటెండెన్స్ విధానా న్ని ప్రవేశ పెట్టి పారదర్శకతకు పెద్దపీట వేసింది. వసతి గృహాల భవనాల్లో మరమ్మతులకు రూ.13.10 కోట్లు మంజూరు చేసింది. డీఎంఎఫ్, సీఎస్ఆర్ ఫండ్స్, ఇతర వనరుల ద్వారా రూ.20 కోట్లకు పైగా జిల్లా కలెక్టర్ల ద్వారా సమీకరించి వసతిగృహాల్లో మరమ్మతులు, విద్యార్థులకు కావాల్సిన సౌకర్యాలను కల్పించిం ది. వసతిగృహాలకు అవసరమైన వంట పాత్రలతో పాటు విద్యా ర్థులకు అవసరమైన సామగ్రి కొనుగోలుకు రూ.18 కోట్లు అం దజేసింది. వసతిగృహ పిల్లలకు సన్నబియ్యంతో నాణ్యమైన, రుచికరమైన భోజనం అందిస్తోందని తెలిపారు. క్రీడల్లో ప్రోత్సా హంలో భాగంగా వసతిగృహాల విద్యార్థులకు త్వరలో స్పోర్ట్స్ మెటీరియల్ అందజేయనున్నట్లు చెప్పారు. అన్ని వసతిగృహాల్లో నూ విద్యార్థుల రక్షణ, సౌకర్యార్థం సీసీ కెమెరాలు, ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టింది. కూటమి ప్రభుత్వానికి చెందిన పలువురు ఎమ్మెల్యేలు తమ నిధులతో తమ నియోజకవర్గాల్లో ఉన్న బీసీ హాస్టళ్లలో అభివృద్ధి పనులు చేపట్టారు. ఎంపీలు బస్తిపాటి నాగరాజు, కలిశెట్టి అప్పలనా యుడు తమ ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి కోటి రూపాయల చొప్పున బీసీ హాస్టళ్ల అభివృద్ధికి కేటాయించినట్లు వివరించారు.

### హాస్టళ్ల నిర్వహణకు మార్కులు

విమర్శలకు తావివ్వకుండా పారదర్శకతతో బీసీ హాస్టళ్ల నిర్వ హణకు కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగా, బాగా పనిచేసే హాస్టళ్లకు 100 మార్కులు ఇవ్వనుంది. మార్కుల ను ప్రతి ఏటా యాన్యువల్ కాన్ఫిడెన్షియల్ రిపోర్టు(ఏసీఆర్) ద్వారా వార్డెన్ల పనితీరును రాష్ట్ర కార్యాలయానికి అందజేయను న్నారు. విధుల్లో చిత్తశుద్ధితో పనిచేసే వార్డెన్లకు కూడా ప్రోత్స హించేలా ప్రణాళికలు రూపొందించింది. అత్యధిక మార్కులు సాధించిన వార్డెన్లకు బదిలీలు, పదోన్నతుల్లో ప్రాధాన్యమిచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

### మార్కులు కేటాయింపు ఇలా..

బీసీ హాస్టళ్ల పనితీరు మెరుగుపరిచే ప్రణాళికల్లో భాగంగా 100 మార్కులు కేటాయిస్తారు. విద్యార్థుల హాజరుకు 10 మార్కులు, పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభకు 20 మార్కులు, ఉత్తీర్ణతా శాతం ఆధారంగా మరో 20 ఇవ్వనున్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మెనూ అమలు చేస్తే 10 మార్కు లు, హాస్టళ్లలో ఎటువంటి ఘటనలూ చోటుచేసుకోకపోతే మరో 5 మార్కులు ఇవ్వనున్నారు. హాస్టళ్ల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం పెంపుదలకు 5 మార్కులు, పేరెంట్స్ మీటింగ్స్ కు 4 మార్కులు, ఎప్పటికప్పుడు హాస్టళ్లలో వైద్య శిబిరాల ఏర్పా టుకు 4 మార్కులు, రికార్డుల నిర్వహణ, సకాలంలో బిల్లుల అందజేతకు 4 మార్కులు, సాంకేతిక విద్య అమలు, విద్యార్థులతో చేయించే నూతన ఆవిష్కరణలకు 4 మార్కులు, పీ-4 మోడల్ అమ లుకు 6 మార్కులు, హాస్టళ్ల నిర్వహణపై విమర్శలు రాకుండా మెరుగైన పనితీరు కనబర్చే వార్డెన్లకు 2 మార్కులు ఇవ్వనున్నట్లు చెప్పారు. హాస్టళ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేశాం. హాస్టల్ విద్యార్థులకు తల్లికి వందనంతో పాటు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర కిట్లు అందజేశాం. కంప్యూటర్ విద్యకు ప్రాధాన్యమిస్తున్నామని చెప్పారు.

# సోషల్ మీడియాలో..

# తప్పుడు పోస్టులపై కఠిన చర్యలు

- రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రత్యేక చట్టం
- ప్రజల్లో భయాందోళనలు రేకెత్తించేలా దుష్ప్రచారం
- వాస్తవాలను తెలియజేసేందుకు ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ
- ఏపీ బ్రాండ్‌ను దెబ్బతీసేలా శాడిస్ట్ ప్రచారం
- రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత




అమరావతి(చైతన్యరథం): సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించి అభద్రతా భావానికి గురిచేసే వారిపై ఇకపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోనుందని, దీనిపైవచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ప్రత్యేక చట్టాన్ని కూడా తీసుకురానున్నట్లు రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖామంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక సోషల్ మీడియాలో విషం చిమ్ముతూ వాస్తవాలను అవాస్తవాలుగా చిత్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించడమే గాక అభద్రతా భావానికి గురి చేస్తు న్నారని, ఇకపై అలాంటి దుష్ప్రచారాలు చేసే వారిపై కఠినచర్యలు తీసుకునే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టనుందని స్పష్టం చేశారు. అంతేగాక ప్రత్యేకంగా ఒక ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీని కూడా ప్రభుత్వం ఏర్పాటుచేసి వాస్తవాలేమిటో ఎప్పటిక ప్పుడు ప్రజలకు తెలియజేస్తుందన్నారు.అమరావతి మునిగిపోయిందని, విజయవాడ ప్రకాశం బ్యారేజి గేట్లు పనిచేయడం లేదని, పలు అసత్యప్రచారా లను సోషల్ మీడియాలో ఇష్టా రీతిన అబద్ధాలు ప్రచారం చేస్తూ ప్రభుత్వంపై మూకుమ్మడి దాడి చేస్తున్నారని తప్పుబట్టారు.ఇకపై అలాంటి తప్పుడు ప్రచారాలను సమర్థవంతంగా తిప్పకొట్టడంతో పాటు అందుకు కారకులపై చట్టప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు మంత్రి అనిత స్పష్టం చేశారు.

కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలన్నీ విజయవంతంగా అమలు చేయడంతో ప్రతిపక్షపార్టీ తట్టులేక పోతోందని అందుకే సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారాన్ని దిగిందని హోం మంత్రి అనిత విమర్శించారు. ఇది ఆ పార్టీకి వారసత్వంగా వచ్చిన సమస్యగా ఉందని ఆమె ఎద్దేవా చేశారు. ఒక్క ఆగస్టు నెలలోనే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, నేతన్నలకు, నాయి బ్రాహ్మణులకు 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ పథకాలు అమలు చేయటంతో పాటు, స్త్రీశక్తి పథకం కింద మహిళలందరికీ ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించినట్లు చెప్పారు. నాలుగు రోజుల్లో సుమారు 20 లక్షల మందికి పైగా మహిళలు ఉచిత బస్సుల్లో ప్రయాణించి సుమారు 20 కోట్ల రూపాయల వరకూ లబ్ధి పొందారని తెలిపారు. అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళుగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుంటే ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసే విధంగా ప్రతిపక్ష వైసీపీ, దాని అనుబంధ మీడియా, సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి అనిత పేర్కొన్నారు. రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్ గురించి మాట్లాడాలంటే ముందుగా గుర్తువచ్చేది సీఎం చంద్రబాబు నాయుడేనని, అలాంటి ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేయడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతిపై లేనిపోని రాతలు రాసేవారిపై కేసులు పెడతామని స్పష్టం చేశారు. వైసీపీ హయాంలో నాడు రఘురామ కృష్ణరాజుపై దేశద్రోహం కేసు పెట్టారకి గుర్తు చేస్తూ.. వాస్తవానికి ఇప్పుడు వైసీపీ అనుకూల సోషల్ మీడియా పెడుతున్న తప్పుడు పోస్టులపై రాజద్రోహం కేసులు పెట్టాలన్నారు. ఇకపై ఇలాంటి తప్పుడు పోస్టులు పెట్టేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారని తెలిపారు. అసాంఘిక శక్తులను ఎలా అరికట్టాలో చంద్రబాబుకు బాగా తెలుసని అలాంటి శక్తులపై ఉక్కుపాదం మోపుతామని, శాంతిభద్రతల విషయంలో రాజీలేదు హోం మంత్రి అనిత స్పష్టం చేశారు.

### శ్రీకాంత్ పెరోల్ రద్దు చేశాం

నెల్లూరు జైలులో శిక్ష అనుభవిస్తున్న శ్రీకాంత్‌కు పెరోల్ రావడం వెనుక ఏం జరిగింది, ఎవరున్నారనే దానిపై పూర్తిగా విచారణ జరుపుతున్నామని, ఇందులో ఎవరున్నా వారిపై చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హోంమంత్రి అనిత స్పష్టం చేశారు. శ్రీకాంత్ విషయంలో ఎస్కార్ట్ సిబ్బందిపై కూడా తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. క్రిమినల్ రికార్డు ఉన్న వ్యక్తికి పెరోల్ వచ్చిందని జైలు అధికారి చెప్పారని, వెంటనే అతని పెరోల్ రద్దు చేసి తిరిగి జైలుకు పంపామన్నారు. ఈ ఘటనలో పోలీస్ అధికారులు ఎవరున్నా వారిపై కూడా విచారణ అనంతరం తగిన చర్యలు తీసుకుంటా మని స్పష్టం చేశారు. అరుణ అనే మహిళ దిశా ఫౌండేషన్‌కు సెల్ఫ్ డిక్లేర్డ్ సెక్రటరీ అని, ఆమె నుంచి హోంశాఖ పేషీకి ఫోన్ వచ్చిందని, దానిపై కూడా దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఆమె గురించి, ఆమె వెనుకున్న వారి గురించి ఆరా తీస్తున్నామని తెలిపారు.

# ఆదరణ 3లో మత్స్యకారులకు ప్రాధాన్యం

## - రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో మత్స్యకారులను అన్ని విధాలా అభివృద్ధే చేయడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత తెలిపారు. మత్స్యకారులకు ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని తెలిపారు. ఆదరణ 3.0 పథకం అమలులో కూడా మత్స్యకారులకు ప్రాధాన్యమిస్తామని, ఆధునిక పరికరాలు అందజేస్తామని వెల్లడించారు. మంత్రి సవితను తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. చైర్మన్‌గా అవకాశమిచ్చినందుకు సీఎం చంద్రబాబుకు, మంత్రి సవితకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, మత్స్యకారులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు నెరవేరుస్తున్నారన్నారు. ఇప్పటికే వేట విరామ సమయంలో ఇచ్చే ఆర్థిక సాయాన్ని రెట్టింపు చేస్తూ రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచి అందజేశామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో మత్స్యకారులకు రూ.10వేల చొప్పున మాత్రమే అందజేశారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆర్థిక సాయాన్ని రెట్టింపు చేస్తూ కూటమి ప్రభుత్వం రూ.20 వేలు అందజేసిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.29 లక్షలకు పైగా మత్స్యకారులకు రూ.259 కోట్లను వారి ఖాతాల్లో జమ చేసిందన్నారు. వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 217 ను రద్దు చేసిన ఘనత కూడా కూటమి ప్రభుత్వానిదేనన్నారు. చేపల వేట నిషేధకాలంలో మత్స్యకారులకు భృతి ఇవ్వాలని నిర్ణయించిన ఘనత కూడా సీఎం చంద్రబాబునాయుడిదేనన్నారు. 2014లో తొలిసారిగా వేట నిషేధ సమయంలో భృతి అందజేశారన్నారు. 2014-19 మధ్య అయిదేళ్లో రూ.788 కోట్లు మత్స్యకారులకు భృతి రూపంలో అందజేశామన్నారు. మత్స్యకారులకు 50 ఏళ్లకే ఫించన్లు అందజేసిన ఘనత కూడా టీడీపీదేనన్నారు.లీటర్ డీజిల్ పై రూ.9ల రాయితీ అందజేస్తున్నామన్నారు. వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందిన మత్స్యకారుని కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం అందజేస్తున్నామన్నారు.

### ఆదరణ 3.0లో ప్రాధాన్యం

త్వరలో ప్రారంభించనున్న ఆదరణ 3.0 పథకంలోనూ మత్స్యకారులకు ప్రాధాన్యమివ్వనున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు. వేటకు కావాల్సిన ఆధునిక పరికరాలు అందజేసేందుకు యోచిస్తున్నట్లు తెలిపారు. మత్స్యకారులను అన్ని విధాలా ఆదుకోవడమే సీఎం చంద్రబాబునాయుడు లక్ష్యమన్నారు. అంతకుముందు మంత్రి సవితను కలిసిన రాష్ట్ర మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు.. సీఎం చంద్రబాబు తనపై పెట్టిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా కృషి చేస్తానని తెలిపారు. దీనిపై మంత్రి సవిత స్పందిస్తూ, మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులకు అందేలా కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు మత్స్యకార సంఘ నాయకులు పాల్గొన్నారు.

# జైలుయాత్రలతో జగన్‌రెడ్డి చరిత్ర

- కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలు తీశారు
- మృతుల కుటుంబాలను పరామర్శించాలి
- మాజీ మంత్రి నక్కా ఆనందబాబు



మంగళగిరి(చైతన్యరథం): అవినీతి, అక్రమ మద్యం వ్యాపారం, హత్యలు, కిడ్నాప్ వంటి కేసులలో అరెస్టయిన వైసీపీ నేతలను జగన్‌రెడ్డి పరామర్శించడంపై మాజీ మంత్రి నక్కా ఆనందబాబు తీవ్రంగా విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయాల్లో సాధారణంగా దండయాత్రలు, జైత్రయాత్రలు, విజయ యాత్రలు చూశామని, అయితే జగన్‌రెడ్డి తన తండ్రి మరణాన్ని అడ్డం పెట్టు కుని 'ఓదార్పు యాత్ర' చేశారని, ఇప్పుడు అధికారం కోల్పోయిన తర్వాత 'జైలు యాత్రలు' మొదలుపెట్టారని విమర్శించారు. స్వాతం త్ర్య దినోత్సవం రోజున జాతీయ జెండా ఎగురవేయడానికి సమయం కేటాయించలేని జగన్‌రెడ్డి తమ పార్టీ నాయకులు జైల్లో ఉంటే ప్రత్యేక విమానాలు, హెలికాప్టర్లు వేసుకుని వెళ్లి పరామర్శి స్తున్నారు. రాబోయే రోజుల్లో రాజమండ్రి జైలు వైసీపీకి ప్రధాన కార్యాలయంగా మారే అవకాశం ఉంది. జగన్ రెడ్డికే పరామర్శ యాత్ర అవసరం వస్తుందన్నారు. వైసీపీ నాయకుల ధనదాహానికి నాసిరకం, కల్తీ మద్యం తాగి 30వేల మంది చనిపోయారు, లక్షలాది మంది దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నారు. జగన్‌రెడ్డి దశలవారీగా మద్యపాన నిషేధం చేస్తానని హామీ ఇచ్చి అడ్డగోలుగా ఆదాయాన్ని పెంచుకుని ప్రజల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించారని ధ్వజమెత్తారు. మద్యం కుంభకోణంలో ఉన్న మిధున్‌రెడ్డి, ఈవీఎం ధ్వంసం కేసులో ఉన్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మహిళ హత్య కేసులో ఉన్న నందిగం సురేష్, కిడ్నాప్ కేసులో ఉన్న వల్లభనేని వంశీ, అక్రమ మైనింగ్ కేసులో ఉన్న కాకాని వంటి వారిని పరామర్శించారు. మద్యం పాలసీ రూపకల్పన నుంచి ముడుపుల వసూళ్ల వరకు ఎంపీ మిధున్‌రెడ్డి కీలక పాత్ర పోషించారు. ప్రతినెలా రూ.5-6 కోట్లు ఆయన ఖాతాలకు చేరాయని ఈ డబ్బులు ఎన్నికల్లో ఖర్చు పెట్టారనడానికి స్పష్టమైన ఆధారాలు ఉన్నాయన్నారు. జగన్‌రెడ్డి పులివెందుల ఎమ్మెల్యేగా గెలిచినా తమ ప్రాంతానికి రావడంలేదని, ప్రజల సమస్యలపై పోరాడడానికి అసెంబ్లీకి రాకుండా బాయ్‌కాట్ చేయడం పిరికి పంద లక్షణమన్నారు. గతంలో జగన్‌రెడ్డి తండ్రి అధికారంలో ఉన్నప్పుడు లక్షల కోట్ల అవినీతికి పాల్పడ్డారని, ఆ కేసుల్లో ఆయన 16 నెలలు జైలులో ఉన్నారు. క్విడ్ ప్రోకో, షెల్ కంపెనీలు వంటి పదాలు ప్రజలకు ఆయన ద్వారానే తెలిశాయని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో తాము జైలుయాత్రలు చేయడం కాదు, నాయకులు తమకు 'పరామర్శ యాత్రలు' పెట్టే పరిస్థితి వస్తుందన్నారు. కల్తీ మద్యం తాగి జంగారెడ్డిగూడెంలో చనిపోయిన 26 మంది కుటుంబాలను జగన్‌రెడ్డి పరామర్శించాలని డిమాండ్ చేశారు..

# స్త్రీశక్తి.. భారం కాదు బాధ్యత

- అక్కసుతోనే వైసీపీ విష ప్రచారం
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



అమరావతి (చైతన్యరథం): మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్న స్త్రీశక్తి పథకం ప్రభుత్వానికి భారం కాదు, బాధ్యత అని రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి స్పష్టం చేశారు. అమరావతిలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రజలకు సంతోషం కలిగించే ప్రతీ పథకాన్ని అవహేళన చేయటం, దుష్ప్రచారం చేయటమే వైసీపీ పనిగా పెట్టుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దిగ్విజయంగా అమలవుతున్న స్త్రీ శక్తి పథకాన్ని చూసి కడుపుమంటతో ఓర్వలేకపోతోందన్నారు. ఆధార్, పాన్, ఓటర్ కార్డుల లాంటివి జిరాక్సులు, సాఫ్ట్ కాపీలు కూడా అనుమతిస్తున్నామని తెలిపారు. ఘాట్ రోడ్లలోనూ మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామన్నారు. స్త్రీ శక్తి పథకం దిగ్విజయంగా అమలు కావడం వైసీపీ వారికి మింగుడు పడటం లేదని ధ్వజమెత్తారు. లక్షలాది మంది అక్క, చెల్లెమ్మలకు ఈ పథకం ద్వారా నేరుగా లబ్ధి చేకూరుతోందన్నారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న పథకాల అమలులో అవసరమైతే నాయకులు సలహాలు, సూచనలు ఇవ్వాలి కానీ, అక్కసుతో వ్యతిరేక ప్రచారం చేయటాన్ని ప్రజలు హర్షించబోరన్నారు.

# సునీత, ఆమె భర్తపై కేసులు కొట్టేస్తాం

- సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- నిందితుల బెయిల్ రద్దు చేయాలని కోరిన సునీత, సీబీఐ తరపు న్యాయవాదులు
- తదుపరి విచారణ వచ్చే 9కు వాయిదా

న్యూఢిల్లీ:వైఎస్ వివేకానందరెడ్డి దారుణ హత్యకేసులో ఆయనకుమార్తె డాక్టర్ నర్రెడ్డి సునీతకు భారీ ఊరట లభించింది. సునీత సహా ఆమె భర్త రాజశేఖర్‌రెడ్డి, అప్పట్లో ఈ కేసునువిచారించిన సీబీఐఏఎస్పీ రాంసింగ్ లపై అప్పట్లో కడప పోలీసులు నమోదు చేసిన కేసులను సుప్రీంకోర్టు కొట్టేసింది. సాక్షులనుబెదిరిస్తున్నందున ఎంపీ అవినాష్ రెడ్డి సహా,నిందితుల బెయిల్స్‌రద్దు చేయాలని, తమపై పెట్టిన అక్రమ కేసులను కొట్టేయాలని వైఎస్ సునీత దాఖలుచేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టులో మంగళవారం విచారణ జరిగింది. జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ఎన్‌కే సింగ్ ధర్మాసనం విచారణ చేపట్టింది.వివేకా కుమార్తె సునీతతోపాటు, అల్లుడు నర్రెడ్డి రాజశేఖర్రెడ్డి, అప్పటి సీబీఐ విచారణాధికారి రాంసింగ్‌పై పెట్టిన కేసులను క్వాష్‌చేస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. చట్టాన్ని దుర్వినియోగం చేయడానికే వారిపై కేసు పెట్టారని ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది.

వివేకా కుమార్తె సునీత తరపున న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు.అవినాష్ సహాప్రధాననిందితుల బెయిల్ రద్దు చేయాలనికోరారు. సుప్రీంకోర్టు గడువు వల్లే దర్యాప్తు ముగించినట్లు సీబీఐ చెబుతోందని లూథ్రా వివరించారు. వివేకా హత్య కేసులో మరింత లోతుగా దర్యాప్తు అవసరం ఉందని పేర్కొన్నారు. అసలు సూత్రధారులు,పాత్రధారులు ఎవరో బయటకు రావాల్సి ఉందన్నారు. సాక్షులను బెదిరించడంతోపాటు, సాక్ష్యాలను నాశనం చేయాలని ప్రయత్నిస్తున్నారని లూథ్రా కోర్టుకు వెల్లడించారు.సునీత దంపతులతో పాటు రాంసింగ్‌పైనా కుట్రపూరితంగా కేసులు నమోదు చేశారని వివరించారు. దీంతో ఆ కేసులను సుప్రీంకోర్టు క్వాష్ చేసింది.సీబీఐ తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదనలు వినిపించారు. నిందితుల బెయిల్ రద్దు చేయాలని సుప్రీంను కోరారు. హత్య తీరు చూస్తే నిందితులకు 2, 5ఏళ్ల జైలు శిక్ష చాలా తక్కువే అనిపిస్తోంది. ఆధారాలు చెరిపేయడం, సాక్ష్యాధారాలు లేకుండా చేశారని నిరూపితమైంది.ముందుగుండెపోటు అని.. తర్వాత రక్తపు వాంతులని ప్రచారం చేశారు. హత్య అని తెలియకుండా ఆధారాలను చెరిపేసేందుకు అన్నివిధాలా ప్రయత్నం చేశారు. అన్ని వివరాలు దర్యాప్తులో పూర్తిగా బయటపడ్డాయని ఎస్వీ రాజు కోర్టుకు వివరించారు.

ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది హుజేఫా అహ్మదీ వాదనలు వినిపిస్తూ.. నిందితుడు శివశంకర్‌రెడ్డి కొడుకు చైతన్యరెడ్డి మెడికల్ క్యాంప్ పేరుతో కడప జైలుకు వెళ్లారు. ఇందుకు సంబంధించి అన్ని ఆధారాలు ఫొటోలతో సహా ఉన్నాయి. జైలుకెళ్లి అప్రూవర్ దస్తగిరిని బెదిరించినట్లు సాక్ష్యాలున్నాయని పేర్కొన్నారు. ఇక ఈ కేసులో కోర్టు మరణశిక్ష విధించే అవకాశం కూడా ఉందని సీబీఐ తరపు న్యాయవాది పేర్కొన్నారు.

వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఎంత మంది నిందితుల బెయిల్ రద్దు చేయాలో చెప్పాలని సీబీఐని సుప్రీంకోర్టు ఆదేశించింది. అలాగే తదుపరి దర్యాప్తు అవసరమో లేదో చెప్పాలని కూడా సీబీఐకి నిర్దేశించింది. ఈ మేరకు సుప్రీం ధర్మాసనం తదుపరి విచారణను వచ్చే నెల 9కి వాయిదా వేసింది.

### తప్పుడు కేసులు

వివేకానందరెడ్డి దారుణ హత్య కేసులో కొందరిని బలవంతంగా అరెస్టు చేస్తున్నారని, వారిని ఈ కేసును ఒప్పుకోవాలంటూ ఒత్తిడి చేస్తున్నారని పేర్కొంటూ అప్పట్లో ఎంపీ అవినాష్‌రెడ్డి అనుచరులు పులివెందుల పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీబీఐ ఏఎస్పీ రాంసింగ్‌పై కేసులు నమోదు చేయడంతోపాటు నోటీసులు కూడా ఇచ్చారు. ఇక సునీత దంపతుల ప్రమేయంతోనే ఈ హత్య జరిగిందని మరో కేసు నమోదైంది. ఆస్తి వివాదాల కారణంగానే హత్యకు ప్రేరేపించారని, తమను బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. దీనిపైనా కేసు నమోదైంది. ఈ కేసులను తాజాగా సుప్రీంకోర్టు కొట్టి వేసింది.

# రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు

- పరిశ్రమలకు అనుమతుల్లో జాప్యం వద్దు
- ప్రాజెక్టుల గ్రౌండింగ్‌కు చర్యలు తీసుకోవాలి
- పారిశ్రామిక పార్కుల్లో సమస్యలు పరిష్కరించాలి
- ఏపీఐఐసీ సమీక్షలో పరిశ్రమల మంత్రి టి.జి.భరత్



మంగళగిరి(చైతన్యరథం): ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ఎంతో ఆసక్తి చూపుతున్నారని పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్ అన్నారు. మంగళగిరి ఏపీఐఐసీ కార్యాలయంలో జెడ్ఎంలు, జీఎంలతో మంగళవారం ఆయన సమీక్షించారు. పరిశ్రమల శాఖ కమిషనర్, ఏపీఐఐసీ ఎండీ అభిషిక్త్ కిషోర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గత ఎస్ఐపీబీ సమావేశాల్లో ఆమోదించిన పెట్టుబడులకు చెందిన ప్రాజెక్టులపై చర్చించారు. జిల్లాల వారీగా ప్రాజెక్టుల ప్రస్తుత స్థితి పై చర్చించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లా డుతూ సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రానికి భారీగా పెట్టు బడులు వస్తున్నాయని తెలిపారు. పరిశ్రమలు పెట్టేందుకు అనుమ తులు ఇచ్చే విషయంలో ఎలాంటి ఆలస్యం ఉండకూడద న్నారు. ప్రతి కంపెనీ ప్రతినిధులతో నిరంతరం మాట్లాడి గ్రౌండ్ అయ్యే విధంగా పనిచేయాలన్నారు. ఇందుకు తమ తరపున పూర్తి సహకా రం ఉంటుందని తెలిపారు. ఇండస్ట్రియల్ పార్కుల్లో సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రతి జిల్లాలో తప్పనిసరిగా డి.ఐ.పి.సి సమా వేశాలు నిర్వహించా లని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు ఏమైనా ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాల న్నారు. ఇప్పటి కే ల్యాండ్ కేటాయించి ఇంకా మొదలుపెట్టని ప్రాజెక్టులపై ఒకటికి రెండుసార్లు మాట్లాడాలన్నారు. అప్పటికీ ప్రాజెక్టు విషయంలో కదలిక లేకపోతే ల్యాండ్ క్యాన్సిల్ చేయాలని చెప్పారు. పరిశ్రమల కోసం తీసుకున్న భూముల్లో ఇతర కార్యకలా పాలు జరగకుండా చూడాలన్నారు. ఏపీఐఐసీ భూములకు సంబంధించి పూర్తి వివరా లు అందజేయాలని ఆదేశించారు. కోర్టు కేసులపై కూడా మంత్రి ఆరా తీశారు. న్యాయ వివాదాలు తలెత్తితే తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు.

# జాతీయ క్రీడా దినోత్సవంపై సమీక్ష



- ఆగస్టు 29 నుంచి 31 వరకు వేడుకలు
- ప్రతి రాష్ట్రంలో కార్యక్రమాలు నిర్వహించాలి
- వీడియో కాన్ఫరెన్స్ కేంద్ర మంత్రి మనసుఖ్
- పాల్గొన్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

అమరావతి(చైతన్యరథం): దేశవ్యాప్తంగా జాతీయ క్రీడా దినో త్సవ వేడుకలు ఆగస్టు 29 నుంచి 31 వరకు దేశవ్యాప్తంగా నిర్వ హించేందుకు క్రీడా శాఖ విస్తృత ప్రణాళికలు రూపొందించింది. కేంద్ర క్రీడాశాఖ మంత్రి మనసుఖ్ మాండవీయ అధ్యక్షతన మంగ ళవారం వీడియో కాన్ఫరెన్స్ జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సచివాలయంలోని ఛాంబర్ నుంచి పాల్గొన్నారు. ప్రజల్లో క్రీడలపై ఆసక్తి పెంపొందించేలా, ఆరోగ్యం..ఫిట్‌నెస్‌పై అవగాహ న కల్పించేలా ప్రతి రాష్ట్రం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని కేంద్ర మంత్రి సూచనలు చేశారు. ఆగస్టు 29న ఉద్యోగుల మధ్య వినోదాత్మక పోటీ ఆటలు, 30న మాజీ ఛాంపియన్లతో సదస్సులు, సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 31న సైక్లింగ్ ర్యాలీ లు జరిపి ఆరోగ్యకరమైన జీవనశైలిపై సందేశం ఇవ్వాలని నిర్ణ యించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ముఖ్యంగా విద్యాసంస్థలు, ప్రభుత్వ శాఖలు, యువజన సంఘాలు, క్రీడా సంస్థలు చురుకుగా పాల్గొనే లా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నామని వివరిం చారు.

# బందరు హార్బర్‌కు నడికుదిటి పేరు

- టీడీపీకి కంచుకోటగా మార్చారు
- నరసింహారావును గౌరవించుకుంటాం
- అభివృద్ధిలో ఆయనే మాకు స్ఫూర్తి ప్రదాత
- ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం(చైతన్యరథం): శ్రమను నమ్ముకున్న నాయకుడు నడకుదిటి నరసింహారావు అని గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఈ మేరకు మచిలీ పట్నం టీడీపీ కార్యాలయం వద్ద మాజీ మంత్రి నడకుదిటి నరసిం హారావు 74వ జయంతి కార్యక్రమాలు నిర్వహిం చారు. పుష్పాంజలి ఘటించి నివాళు లర్పించారు. నడకుదిటి నరసింహారావు శ్రమ ను నమ్ముకున్నారు. నీతి నిజాయితీలతో జీవితాంతం బతికారు. వారి జీవితం తెరచిన పుస్తకం లాంటిది. బందరు నియోజక వర్గాన్ని టీడీపీకి కంచుకోటగా మార్చిన ఘనత నరసింహారావుకే దక్కుతుంది. ఎలాంటి రోడ్డు రవాణా సదుపాయాలు, కమ్యూ నికేషన్ సదుపాయాలు లేని రోజుల్లోనే ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యల పరిష్కారం కోసం పరితపించారు. గరాల దిబ్బకు బ్రిడ్జి నిర్మాణం, రోడ్ల నిర్మాణం, పల్లెతుమ్మలపాలెం పోలాటితిప్పలో ఉప్పు పరిశ్రమ ఏర్పాటుతో స్థానికులకు ఉపాధి కల్పించారు. బందరు ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది కూడా ఆయనే. అందుకే ఆయన కష్టానికి గుర్తుగా బందరు హార్బర్‌ను వీలైనంత త్వరగా పూర్తి చేసి హార్బర్‌కు ఆయన పేరు పెట్టుకుని గౌరవించుకుంటామని తెలిపారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా బీసీలకు చేసిన కృషికి చిహ్నంగా బందరులో బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మించబోతున్నామని చెప్పారు. ఎన్ని కష్టాలొచ్చినా నరసింహారావు చూపిన అడుగు జాడల్లోనే నడుస్తాం.. ప్రజా సమస్యల పరిష్కారం లో ఆయనే మాకు స్ఫూర్తి ప్రదాత అని పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, కొనకళ్ల జగన్నాథ రావు, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, తదితర నాయకులు పాల్గొన్నారు.

# కృష్ణా లంక గ్రామాల్లో అప్రమత్తం

- కరకట్ట పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి
- అధికారులకు రెవెన్యూ మంత్రి అనగాని ఆదేశం

అమరావతి (చైతన్యరథం): ప్రకాశం బ్యారేజ్‌కి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో కృష్ణానది పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ సూచించారు. రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లో కరకట్టకు అనుకుని ఉన్న లంక గ్రామాల ప్రజలను అధికారులు నిరంతరం అప్రమత్తం చేయాలని ఆదేశించారు. కృష్ణానది కరకట్ట వెంబడి పరిస్థితిని అధికారులు ఎప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. అవసరమైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని రెవిన్యూ, పోలీసు అధికారులను ఆదేశించారు. రెవెన్యూ అధికారులకు సెలవులు రద్దు చేశామని స్పష్టం చేశారు. కరకట్ట ప్రాంతంలో గండి పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. వాయుగుండం దృష్ట్యా మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లో వేటకు వెళ్ళవద్దని హెచ్చరించారు. కృష్ణానది పొంగిపొర్లుతున్న నేపథ్యంలో ప్రజలు నదిని, కాలువలు దాటే ప్రయత్నం చేయవద్దన్నారు. సోషల్ మీడియాలో



వచ్చే వదంతులను నమ్మి ప్రజలెవరూ ఆందోళనకు గురికావొద్దని భరోసా ఇచ్చారు. ఎటువంటి విపత్తునైనా ఎదుర్కొనేందుకు రాష్ట ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు.

# అర్చకుల సమస్యల పరిష్కారానికి చర్యలు

- త్వరలో జీవో 76 అమలు చేస్తాం
- గత ప్రభుత్వం అర్చకులను మోసగించింది
- ఆ జీవోను రద్దు చేసి కొత్త జీవో తెచ్చింది
- బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్



మంగళగిరి(చైతన్యరథం): రాష్ట్రంలో ఉన్న అర్చకుల సమస్యల ను ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసు కెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని టీడీపీ ఏపీ బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్ తెలిపారు. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాల యంలో నిర్వహించిన టీడీపీ ఏపీ బ్రాహ్మణ సాధికార సమితి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో బ్రాహ్మణులకు ఇచ్చిన హామీల ను అమలు చేయకుండా మోసం చేసిందని మండిపడ్డారు. బ్రాహ్మణ సంక్షేమం కోసం గత టీడీపీ ప్రభుత్వం రూపొందించిన జీవో 76ను రద్దు చేసి 439 జీవో తీసుకొచ్చిన జగన్ సర్కార్... అమలు చేయకుండా నిర్లక్ష్యం వహించినట్లు చెప్పారు. కార్పొరేషన్ కు సరైన నిధులు కేటాయించకుండా బ్రాహ్మణుల సంక్షేమాన్ని విస్మరించింది. త్వరలో జీవో 76ను అమలు చేసేలా చర్యలు తీసు కుంటామని హామీ ఇచ్చారు. దేశంలోనే మొట్టమొదటి సారి బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత టీడీపీకే దక్కిందన్నా రు. 12 రాష్ట్రాల్లో బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేశారంటే అది ముఖ్యమంత్రి చంద్రబాబు ముందు చూపునకు నిదర్శనమన్నారు.

### హామీల అమలుకు చర్యలు

రాష్ట్రంలో 27 వేల ఆలయాల్లో 90 వేల అర్చక కుటుంబాలు పౌరోహిత్యం నిర్వహిస్తున్నాయి. ప్రతి కుటుంబానికి న్యాయం జరిగే విధంగా బ్రాహ్మణ కార్పొరేషన్ చర్యలు తీసుకుంటుంది. బ్రాహ్మణ వృత్తిని కుల వృత్తిగా గుర్తించే అంశాన్ని పరిశీలించమని సీఎంను కోరతామని తెలిపారు. నెల్లూరు జిల్లాలో యువగళం పాదయాత్ర సమయంలో వేద విద్యను అభ్యసించిన బ్రాహ్మణ యువతకు నిరుద్యోగ భృతి అమలు చేసే అంశాన్ని పరిశీలించా లని నారా లోకేష్‌ను కోరగా హామీ ఇచ్చారు. చెప్పినట్టే అధికారం లోకి వచ్చిన రెండు నెలల్లోనే దాదాపు 900 మంది వేద విద్యను అభ్యసించిన నిరుద్యోగులకు రూ.3 వేల చొప్పున ఏడాది పాటు అందజేశామని తెలిపారు. టీడీపీ మేనిఫెస్టోలో 11 అంశాలను బ్రాహ్మణ సంక్షేమం కోసం అమలు చేయాలని సూచించాం. ఆల యాల వైదిక, ఆగమ అంశాల్లో అధికారుల జోక్యం లేకుండా, దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసిందని తెలిపారు. దేవాలయాల ట్రస్ట్ బోర్డుల్లో అదనంగా మరో ఇద్దరికి అవకాశం కల్పించామని వివరించారు. రాష్ట్రంలోని రూ.50 వేలకుపైగా వార్షికాదాయం ఉన్న ఆలయాల్లోని అర్చకుల కు కనీస వేతనాన్ని రూ.15 వేలకు పెంచిన విషయాన్ని గుర్తుచేశారు.

### అర్చకులకు వసతి సౌకర్యాన్ని పరిశీలిస్తాం

అర్చకులకు ఆలయాల సమీపంలోనే వసతి సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటే పూర్తిసహకారం అందిస్తామని గుంటూరు వెస్ట్ ఎమ్మెల్యే గల్లా మాధవి ప్రకటించారు. ఆ విషయా న్ని కూడా పరిశీలిస్తామని రాంప్రసాద్ తెలిపారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లో బ్రాహ్మణ సంక్షేమం కోసం అమలు చేస్తున్న సంక్షేమా కార్యక్రమాలపై సమాలోచన చేసి మన రాష్ట్రంలో కూడా అమలు అయ్యేలా చర్యలు తీసుకుంటామని వివరించారు.

బ్రాహ్మ ణ సాధికార సమితి ఆధ్వర్యంలో అర్చకుల సమస్యల పరిష్కారానికి దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, సీఎం చంద్రబాబును కలిసి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఏం కావాలో చెబితే అమలు చేసేందుకు చర్యలు తీసు కుంటానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో బ్రాహ్మణ సాధికార సమితి అధి కార ప్రతినిధి ఈమని సూర్యనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఏవీ రమణ, జేఏసీ అధ్యక్షుడు జంధ్యాల వెంకట రామలింగేశ్వర శర్మ, జేఏసీ జనరల్ సెక్రటరి ఎంవీ శేషాచారి, ప్రధాన అర్చకులు, సాధికార సమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# రీ సర్వేలో భూమి తగ్గించి చూపారు

- ప్రజావినతుల్లో బాధితురాలి ఫిర్యాదు
- టీటీడీ ఉద్యోగి, సోదరుడి భూకబ్జా
- న్యాయం చేయాలని వేడుకోలు



మంగళగిరి(చైతన్యరథం): గత ప్రభుత్వంలో భూముల రీ సర్వేలో తనకు ఉన్న దానికంటే భూమిని తగ్గించి చూపారని ఎన్టీఆర్‌జిల్లా కంచికచర్ల మండలం చెవిటికల్లు గ్రామానికి చెందిన రాయపాటి రంగమ్మ ఆవేదన వ్యక్తంచేసింది. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో వినతిపత్రం ఇచ్చి సమస్యను పరిష్కరించాలని కోరింది. తమ గ్రామంలో సర్వే నెం.210లో తనకు 0.85సెంట్లు భూమి ఉండగా రీ సర్వేలో జరిగిన లోపాల వల్ల ఆన్‌లైన్‌లో కేవలం 0.55సెంట్లు మాత్రమే చూపిస్తుందని వివరించింది. తమ భూమిని ఆన్‌లైన్‌లో మొత్తం 0.85 సెంట్లు నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరింది. ఏపీ ఉమెన్స్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీతల సుజాత, ఏపీ ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొ రేషన్ చైర్మన్ డూండి రాకేష్ అర్జీలు స్వీకరించారు.

### చంపుతామని బెదిరిస్తున్నారు

తన భర్త అనారోగ్యం కారణంగా చిన్న టీ స్టాల్ పెట్టి కుటుం బాన్ని పోషిస్తున్న తాను వైద్య ఖర్చుల కోసం మహేంద్ర, యము నా, మీనా, షహనస, మనోహరి అనే వారి దగ్గర అప్పు తీసుకోగా ఇచ్చిన డబ్బులకు రెండింతలు వసూలు చేసి కూడా వేధిస్తున్నట్లు నంద్యాల పట్టణానికి చెందిన ముంగర విజయసుందరి ఆవేదన వ్యక్తం చేసింది. వడ్డీలు ఇచ్చిన వారి అనుచరులు నందవరంలోని ఒక ఇంట్లో తనను బంధించి ప్రాంసరీ నోట్లు బలవంతంగా రాయించుకుని చంపేస్తామని బెదిరించారని వివరించింది. స్థానిక పెద్దమనిషి సుబ్బరాయుడు మధ్యవర్తిత్వం చేయగా అతని ద్వారా రూ.32 లక్షలకు బాండ్ రాయించుకున్న తరువాత విడిచిపెట్టా రని తెలిపింది. తర్వాత తనను కిడ్నాప్ చేసి నంద్యాలలో బం ధించగా, పోలీసులు జోక్యం చేసుకుని విడిపించినట్లు చెప్పారు. తన కుటుంబానికి ప్రాణహాని ఉందని సమస్యను పరిష్కరించాలని కోరారు.

### టీటీడీ ఉద్యోగి భూ కబ్జా

తమ గ్రామంలోని సర్వే నంబర్లు 192/20, 192/21, 192/23 పరిధిలో ఉన్న తమ ఇళ్లు డోర్ నెంబరు.9-41/1లో 25 సెంట్ల స్థలంలో 15 సెంట్ల భూమిని తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో ఉద్యోగం చేస్తున్న ఎస్.మునిరత్నంరెడ్డి ఆక్రమించారని తిరుపతి జిల్లా తిరుపతి రూరల్ మండలం దామినీడు గ్రామానికి చెందిన దీపారెడ్డి తెలిపారు. 192/20లో 38 సెంట్లలో 10 సెంట్ల భూమిని అతని తమ్ముడు కబ్జా చేశాడని వివరించా రు. ఈ భూమిని తమ తండ్రి జి.వేమారెడ్డి వివాహ సమయంలో తనకు బహుమతిగా ఇచ్చారు. వారిపై చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని అభ్యర్థించారు.

### కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇవ్వాలి

ముదినేపల్లి మండలం జానకీగూడెం ఎంపీపీఎస్ స్కూల్‌లో తన భార్య దాసరి పద్మలత ఎస్జీటీ టీచర్‌గా పనిచేస్తూ 03-02-2020న మరణించిందని కృష్ణా జిల్లా ముదినేపల్లి మండలానికి చెందిన బలే రమేష్‌బాబు తెలిపారు. కారుణ్య నియామకం కింద తన కుమారుడు బలే విజయబాబుకు ఉద్యోగం కల్పించాలని కోరారు. తాను బైపాస్ సర్జరీ చేయించుకున్నందున తన కుమా రుడికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇప్పించాలని కోరాడు.





# భారీ వర్షాలకు పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు

## •లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు, పలు ప్రాంతాల్లో ముంపునకు గురైన పంట పొలాలు



విశాఖపట్నం (చైతన్యరథం): వాయుగుండం బలహీనపడింది. ఒడిశా సమీపంలో తీరందాటినా తర్వాత అల్పపీడనంగా మారింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు చోట్ల భారీ వర్షాలు పడ్డాయి. అలానే పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వర్షాల దాటికి వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి, బూర్జ, పొందూరు మండలాల్లోని నదులు, వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. వరద ఉద్ధృతికి 5వేల ఎకరాల్లో పంటపొలాలు నీటమునిగాయి. నాగావళి నది ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో పరివాహక ప్రజలు భయందోళనకు గురవుతున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని వర్ష ప్రభావ ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ పర్యటించారు. మక్కువ మండలంలో పర్యటించి పంట, ఆస్తి నష్టాలపై ఆరా తీశారు. దుగ్గేరు, అడారుగెడ్డ, పుట్టురు, సాకిరి గెడ్డ పరిసర ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశాలు జారీ చేశారు. పొంగి

**ప్రవహిస్తున్న వాగులు, వంకలు:**

గోదావరిలో వరద ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. రాజమహేంద్రవరం, కొవ్వూరు వద్ద వరద ఉద్ధృతి పెరిగింది. ఎగువ ప్రాంతం నుంచి వరద నీటి చేరికతో రాజమహేంద్రవరానికి వరద పోటెత్తెంది. అల్లూరి జిల్లా దేవీపట్నం మండలంలో గండిపోచమ్మ ఆలయం నీటమునిగిపోయింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం, అయినవిల్లి, ముమ్మిడివరం, రాజోలు మండలాల్లో వరద ఉద్ధృతి కొనసాగుతోంది. పి.గన్నవరం వద్ద అక్విడెక్ట్‌ను వైనతేయ గోదావరి తాకుతూ ప్రవహిస్తోంది. చాకలిపాలెం సమీపంలో ఉన్న పశ్చిమగోదావరి జిల్లా కనకాయలంక కాజ్‌వే ముంపు బారిన పడింది. నదీపాయలు జోరుగా ప్రవహిస్తుడడంతో లంకగ్రామాల ప్రజలు, విద్యార్థులు మరపడవలలో రాకపోకలు సాగిస్తున్నారు. కేంద్రపాలిత యానాంలో బాలయోగి వారధి వద్ద వరద పోటెత్తి ప్రవహిస్తోంది. పలు కాలనీల్లోకి వరద నీరు చేరడంతో అధికారులు మోటార్లతో బయటకు తోడుతున్నారు. అనకాపల్లి జిల్లా మాడుగుల నియోజకవర్గంలో వరద ఉద్ధృతి కొనసాగుతోంది. బొడ్డేరు నది ఉగ్రరూపం దాల్చింది.

**అప్రమత్తం చేసిన అధికారులు:**

నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అల్లూరి జిల్లాలో భారీగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో గిరిజనులు ఇబ్బందిపడుతున్నారు. అరకులోయ మండలంలోని కాజ్ వే కొట్టుకోవడంతో సుమారు 20 గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. డుంబ్రిగూడ మండలంలోని చంపపట్టి, కితలంగి కాజ్ వే దెబ్బతినటంతో 30 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. విశాఖ బీచ్‌లోని జీవీఎంసీ బీచ్ రక్షణగోడ కూలిపోయింది. సముద్ర అలల ఉధృతికి ఐదు అడుగులు మేరకు స్థలం కుంగిపోయింది. ఆ ప్రాంతానికి సందర్శకులు వెళ్లకుండా జీవీఎంసీ సిబ్బంది సూచికలు ఏర్పాటు చేశారు.

ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా చిరు జల్లులతో కూడిన వర్షం కురుస్తోంది. జిల్లాలోని లోతట్టు ప్రాంతాల ప్రజలను ఇప్పటికే రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు అప్రమత్తం చేశారు. విజయవాడ-గుంటూరు వారధి వద్ద భవానీ ఆలయం జలదిగ్బంధంలో చిక్కుకుంది. కంచికచర్ల మండలంలో ఎడతెరిపి లేని వర్షాలకు తోడు కృష్ణా నదికి ఎగువ నుంచి భారీగా వరద వస్తుండడంతో పలు గ్రామాల ప్రజలు ముంపు బారిన పడతామని ఆందోళనకు గురవుతున్నారు. వర్షాలకు పత్తి, పెసర చేలల్లోకి నీరు చేరింది.

**ముంపునకు గురైన పంట పొలాలు:**

కృష్ణా నదికి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో దివిసీమ రైతులు ఆందోళన చెందుతున్నారు. 5 లక్షల క్యూసెక్కుల నీరు దాటితే తమ పంటపొలాలు మునిగిపోతాయని చెబుతున్నారు. వరద పరిస్థితిని తెలుసుకునేందుకు పులిగడ్డ అక్విడెక్ట్‌కు రైతులు క్యూ కడుతున్నారు. ఎగువ నుంచి వస్తున్న వరదతో బాపట్ల జిల్లా కొల్లూరు మండలం, భట్టిప్రోలు మండలాలలోని పలు లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. కొన్ని చోట్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొన్నిచోట్ల పొలాలు, ఉద్యానవన పంటలు దెబ్బతిన్నాయి.

నంద్యాల జిల్లా ఆత్మకూరు, కొత్తపల్లి మండలాల్లో వాగులు ఉప్పొంగుతున్నాయి. భవనాశి, పెద్దవాగులు ఉద్ధృతంగా ప్రవహించడంతో 40 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. ఆత్మకూరు తహశీల్దార్ రత్నరాధిక, సీఐ రాము భవనాశి వాగును పరిశీలించారు. ప్రవాహ ఉద్ధృతి తగ్గేవరకు ప్రజలు వాగులు దాటే సాహసం చేయవద్దని సూచించారు. పెన్నా నది ఉధృతంగా ప్రవహిస్తుడడంతో దిగువ ప్రాంతంలోని వంతెన పూర్తిగా నిండిపోయింది. పెన్నా నది రెండు వైపులా కొండలను నానుకొని నీరు ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల నుంచి వర్షం నీరు వస్తుండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఉధృతి పెరిగితే నది పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసేందుకు సిద్ధంగా ఉన్నారు.

# వైసీపీ నేతలపై పరువునష్టం దావా వేస్తాం : కూన రవికుమార్



ఆమదాలవలస (చైతన్యరథం): తనపై చేసిన లైంగిక ఆరోపణను ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ తీవ్రంగా ఖండించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తనపై కేజీబీవీ ప్రిన్సిపాల్ సౌమ్య అసత్య ఆరోపణలు చేశారన్నారు. ఆమె చేసిన ఆరోపణలు సభ్య సమాజం తలదించుకునే విధంగా ఉన్నాయని తెలిపారు. తాను జెడ్పీటీసీ నుంచి ఎమ్మెల్యేగా వివిధ పదవులు నిర్వహించానని, తనపై లైంగిక వేధింపుల ఆరోపణలు చేయటం దారుణమని చెప్పారు. వైసీపీ తోక నాయకులే ఇదంతా చేస్తున్నారని మండిపడ్డారు. తాను శారీరకంగా , మానసికంగా హింసించినట్టు ఆధారాలు చూపించాలని డిమాండ్ చేశారు. తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు వస్తే ఎమ్మెల్యేగా ఎవరితోనైనా మాట్లాడతానని స్పష్టం చేశారు. తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. తప్పు చేసి ఉంటే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని చెప్పారు. తాను అందరి ప్రిన్సిపల్స్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించానని, సాక్షి మీడియా చెత్త రాతలు రాస్తోందన్నారు. అడ్మిషన్స్ విషయంలో తల్లిదండ్రుల కోరిక మేరకు ఆమెతో మాట్లాడానని గుర్తు చేశారు. ఎమ్మెల్యేతో వీడియో కాన్ఫరెన్స్‌కు ఆమె ఏ విధంగా హాజరైందో చూస్తే అర్థమవుతుందని చెప్పారు. జూన్ 2న స్కూల్ తెరవకుండా 12న ఓపెన్ చేశారన్నారు. ఆమెపై వచ్చిన ఫిర్యాదుల మేరకు చర్యలు తీసుకోమని జిల్లా అధికారులు కోరినట్లు తెలిపారు. బదిలీ చేస్తే వేధింపులు ఎలా అవుతాయని ప్రశ్నించారు. పొందూరు కేజీబీవీలో జాయినింగ్‌కి వచ్చిన కొత్త ప్రిన్సిపల్‌ను సౌమ్య బెదిరించారని ఆరోపించారు. అక్కడ విధుల్లో జాయిన్ అవ్వవద్దు అంటూ కొత్త ప్రిన్సిపల్‌ను బ్లాక్ మెయిల్ చేశారని చెప్పారు. తనపై నిరాధార ఆరోపణలు చేసిన సౌమ్యతో పాటు వైసీపీ నేతలపై పరువునష్టం దావా వేయనున్నట్లు ఎమ్మెల్యే రవికుమార్ పేర్కొన్నారు. అలాగే అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు చేస్తానన్నారు. తన కుటుంబ సభ్యులపై వైసీపీ నేతలు ఆరోపణలు చేస్తున్నారని.. కుటుంబ సభ్యుల జోలికి వస్తే తాట తీస్తానని హెచ్చరించారు. తన నీడ కూడా తాకలేని గల్లీ వైసీపీ నాయకులు.. తనపై ఆరోపణలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. తనపై ఆరోపణలు చేస్తున్న మహిళ.. కులం పేరితో బ్లాక్ మెయిల్ చేయటంలో సిద్ధహస్తురాలని చెప్పారు. ఇలాంటి కుట్రలు తనను ఏమీ చేయలేవని తెలిపారు. తాను 30 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నా.. ఏనాడూ నీచ రాజకేయాలు చేయలేదని గుర్తు చేశారు. తనపై నిరాధార ఆరోపణలు చేసిన వారు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్యే రవికుమార్ డిమాండ్ చేశారు.

# వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారాలు మానుకోవాలి

## ● హెచ్చరించిన టెక్కలి నియోజకవర్గ టీడీపీ నేతలు




టెక్కలి (చైతన్యరథం): వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారాలు చేయడం మానుకోవాలని నియోజకవర్గ టీడీపీ నాయకులు హెచ్చరించారు. మంగళవారం వారు మీడియాతో మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వంలో వంశధార కాలువలో తట్టమట్టి కూడా తీయని వారు మాపై ఆరోణలు చేయడం విడ్డూరంగా ఉందని, వంశధార కాలువ శివారు ప్రాంత భూములకు సైతం మంత్రి అచ్చెన్నాయుడు ప్రత్యేక చొరవతో నీటిని అందిస్తున్నామని అన్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా రైతులకు సకాలంలో మా ప్రభుత్వం ఎరువులు అందిస్తుందని, రెండో విడత ఎరువులు అందించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. అన్నదాత సుఖీభవ కింద నియోజకవర్గంలోని రైతులందరికి రూ.7వేలు నగదు జమ చేయడం జరిగిందని, కూటమి ప్రభుత్వం రైతులకు అందుబాటులో ఉంటుందన్నారు. రైతులకు మేలు చేసేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు కృషి చేస్తున్నారని, అయినా కొంతమంది వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో గంజాయిని పెంచి పోషించిన వైసీపీ నాయకులు... ఇప్పుడు గంజాయిని అరికట్టాలని మాట్లాడటం వింతగా ఉందన్నారు. గంజాయిని ఏపీకి అడ్డాగా మార్చిన ఘనత వైసీపీది కాదా?అని నిలదీశారు. కూటమి పాలన అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే గంజాయిపై ఉక్కు పాదం మోపిందని, గంజాయిని అరికట్టడమే లక్ష్యంగా మా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ వైసీపీ నాయకులు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని లేదంటే అందుకు తగిన గుణపాఠం చెల్లించుకోక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా పార్లమెంటరి ఉపాధ్యక్షులు హనుమంతు రామకృష్ణ, పోలాకి చంద్రశేఖర్, పోలాకి షణ్ముఖ రావు, దల్లి ప్రసాద్ రెడ్డి, రెయ్యి ప్రీతీష్ చంద్ర, ప్రఫుల్ల పరిడ, సోడిముడి కిరణ్, మహేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## •ప్రతి గ్రామానికి రహదారి మార్గం కల్పిస్తాం : ఎమ్మెల్యే బోనెల



పార్వతీపురం (చైతన్యరథం): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, అందులో భాగంగానే రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తుందని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. పార్వతీపురం మండలం అడ్డాపుశీల నుంచి పిన్నింటి రామినాయుడువలస వరకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం విధులు 75 లక్షలతో నిర్మాణం చేపట్టిన బీటీ రోడ్డును మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో గ్రామీణ ప్రాంతాలకు రోడ్లు వేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని, కూటమి ప్రభుత్వం రోడ్లు వేయడానికి శ్రీకారం చుట్టిందన్నారు. గ్రామీణ ప్రాంతంలో రోడ్ల అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేసారు. గత ప్రభుత్వం రోడ్లను పట్టించుకోకపోవడంతో పల్లె ప్రజలు తీవ్ర ఇబ్బంది పడేవారని ఆవేదన వెలిబుచ్చారు. ఇదిలా ఉండగా అడ్డాపుశిల నుండి పిన్నింటి రామునాయుడు వలస వరకు తారు రోడ్డు ఏర్పాటు చేయడం పట్ల ఆ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ కష్టాలు నెరవేర్చిన ఎమ్మెల్యే విజయ్ చంద్రకు వారు క్రుతజ్ఞతలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# చీడికాడలో 320 కేజీల గంజాయి స్వాధీనం



చీడికాడ (చైతన్యరథం): అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన 16 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 320 కేజీల గంజాయి, ఒక ఆటో, మూడు బైకులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. అనకాపల్లి జిల్లా మాడుగుల మండలం బొడ్డరేవు శివారు ప్రాంతంలో రూ.16 లక్షల విలువైన గంజాయిని తరలిస్తున్న 16 మంది నిందితులను మాడుగుల పోలీసులు అరెస్టు చేశారు. గంజాయి తరలిస్తూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటాం అని అనకాపల్లి డీఎస్పీ శ్రావణి హెచ్చరించారు. వీరిని పట్టుకున్న మాడుగుల ఎస్సై నారాయణరావుతో పాటు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

## బందరులో మంత్రి కొల్లు రవీంద్ర బిజీ బిజీ

- గిలకలదిండిలో ఓవర్ హెడ్ ట్యాంకు, ఐస్ క్రషింగ్ ఫ్యాక్టరీ ప్రారంభం
- ఆర్టీసీ బస్టాండు వద్ద 'స్త్రీ శక్తి-ఉచిత బస్సు'పై ప్రచారం
- మచిలీపట్నం అభివృద్ధికి అలుపెరుగక కృషి చేస్తానన్న మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం (చైతన్యరథం): నియోజకవర్గంలో రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర సుడిగాలి పర్యటన చేశారు. ప్రారంభోత్సవాలు, పథకాలపై ప్రచారం, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ నిర్వహించారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం తన ముందున్న తక్షణ కర్తవ్యమని పేర్కొన్నారు. నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో 55 మంది లబ్ధిదారులకు రూ.31,28,233 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను, రూ.10లక్షల విలువైన ఒక ఎల్ఓసీని పంపిణీ చేశారు. ఇప్పటి వరకు 267 మంది లబ్ధిదారులకు రూ.3.58 కోట్ల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందించినట్లు తెలిపారు. పేదల ఆరోగ్య భరోసాకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరమని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు. మాజీ మంత్రి నడకుదిటి నరసింహారావు 74వ జయంతి సందర్భంగా బందరుకోట ప్రజానీకం దాహార్తి తీర్చేలా 'సుజలం ఉచిత తాగునీటి ప్లాంట్'ను ప్రారంభించారు. ఈ ప్రాంత ప్రజలు తాగునీటి కోసం పడుతున్న అవస్థల్ని కళ్లారా చూశానని, వాటిని పరిష్కరించడమే లక్ష్యంగా ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. గిలకలదిండిలో ఏర్పాటు చేసిన ఓవర్ హెడ్ ట్యాంకుని పున:ప్రారంభించారు. తాగునీరు అనేది ప్రజల కనీస అవసరమని, దాన్ని పరిష్కరించేందుకు 2014-19లోనే రూ.1.61 కోట్లతో నిర్మాణం చేపట్టి ప్రారంభించాం. తర్వాత వచ్చిన పాలకులు నిరుపయోగంగా మార్చడంతో ప్రజలకు తాగునీటి అవస్థలు మొదలయ్యాయి. గతంలో ఇక్కడి ప్రజలు తాగునీటి కోసం ఎక్కడెక్కడికో వెళ్లాల్సి వచ్చేది. జగన్ రెడ్డి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా మరో రూ.20 లక్షల వ్యయం చేసి పున:ప్రారంభించుకోవడం సంతోషంగా ఉంది. డైరెక్ట్ పంపింగ్‌తో పాటుగా.. రిజర్వాయర్ నుండి కూడా నీరందించే అవకాశం కలిగిందని మంత్రి కొల్లు రవంద్ర పేర్కొన్నారు. మచిలీపట్నం ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద మహిళలతో ముచ్చటించారు. స్త్రీ శక్తి-ఉచిత బస్సు పథకం అమలుపై మహిళల నుండి అభిప్రాయాలు తెలుసుకున్నారు. మహిళలకు ఇచ్చిన ఉచిత బస్సు హామీని అమలు చేసుకున్నందుకు సంతోషంగా ఉందన్నారు. బస్సులో ప్రయాణిస్తున్న మహిళలతో ముచ్చటించారు. వారికి టికెట్లు అందించారు. మహిళలంటే మహాశక్తి స్వరూపిణులని, వారిని సంతోషంగా చూసుకోవడం మా బాధ్యత అని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, కొనకళ్ల జగన్నాథరావు, డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ, మున్సిపల్ మాజీ ఛైర్మన్ బాబా ప్రసాద్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో ఆసుపత్రుల ఏర్పాటుకు సహకరించండి

- కేంద్ర మంత్రులకు ప్రతిపాదనలు అందజేసిన టీడీపీ ఎంపీలు



ఢిల్లీ / అమరావతి (చైతన్యరథం): కేంద్ర క్రీడలు, యువజన సేవల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయతో టీడీపీ ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, సానా సతీష్ భేటీ అయ్యారు. రాష్ట్రంలో క్రీడా మౌలిక సదుపాయల కల్పన, అభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరారు. ఈ సందర్భంగా పలు ప్రతిపాదనలను కేంద్రమంత్రికి అందించారు. రాష్ట్రంలో నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (ఎన్‌సీఓఈ) ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఖేలో ఇండియా పథకం కింద కొనసాగుతున్న ప్రాజెక్టులను పూర్తి చేయడానికి గ్రాంట్ విడుదల చేయాలని కోరారు. క్రీడా మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఉన్న వాటిని అప్‌గ్రేడ్ చేసేందుకు అనుమతివ్వాలన్నారు. ప్రతి జిల్లాలో అదనపు ఖేలో ఇండియా కేంద్రాలు మంజూరు చేయడంతో పాటు, రాయలసీమ ప్రాంతంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా శిక్షణా కేంద్రం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అందజేసినట్లు తెలిపారు. ఏపీలో కార్మిక శాఖ తరపున ఆరోగ్య మౌలిక వసతుల కల్పనకు సహకారం అందించాలన్నారు. అమరావతిలో 650 పడకల ఆసుపత్రితో మెడికల్ కాలేజీ, పల్నాడు, గుంటూరు, శ్రీసిటీల్లో 100 పడకల ఆసుపత్రులు, కర్నూలులో 30 పడకల ఆసుపత్రిని ఈఎస్ఐ ద్వారా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. భీమవరం, ఒంగోలు, కడప, అనంతపురం, చిత్తూరు, ఏలూరు, హిందూపురంలో 30 పడకల ఈఎస్ఐ ఆసుపత్రులతో పాటు, రాష్ట్రం అంతటా కొత్తగా 30 ఈఎస్ఐ డిస్పెన్సరీల స్థాపనకు దృష్టిసారించాలన్నారు. కాకినాడ ఈఎస్ఐ ఆసుపత్రిలో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన అన్ని అనుమతులు వెంటనే మంజూరు చేయాలని టీడీపీ ఎంపీలు కోరారు.

## అమరావతిపై జగన్ మీడియా అసత్య ప్రచారం : కొలికపూడి



తిరువూరు (చైతన్యరథం): అమరావతిపై విషపు రాతలు రాస్తూ వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పైశాచిక ఆనందం పొందుతున్నారని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతిపై చర్చకు తాను సిద్ధమని.. జగన్ మోహన్‌రెడ్డి సిద్ధమా, లేకపోతే వైసీపీ నుంచి ఎవరు వచ్చినా తాను చర్చించడానికి సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. గత వారం రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయని తెలిపారు. చిన్నపాటి వర్షానికే అమరావతి మునిగిందని జగన్ తన మీడియా ద్వారా అసత్య ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. 2014లో ఆంధ్రప్రదేశ్‌కు అమరావతి రాజధాని అని చెప్పి చంద్రబాబు అధికారంలోకి వచ్చారని తెలిపారు. అమరావతికి అప్పటి మిత్రపక్షమైన బీజేపీ మద్దతు పలకగా బయట నుంచి జనసేన మద్దతు పలికిందని.. అసెంబ్లీలో వైసీపీ కూడా మద్దతు పలికిందని గుర్తుచేశారు. జగన్ తన సొంత ఇంటిని తాడేపల్లిలో కట్టుకున్నాడని.. తాడేపల్లిలో జగన్ ఇల్లు మునిగిందా అని సూటిగా ప్రశ్నించారు. 400 ఏళ్ల చరిత్ర గల హైదరాబాదే చిన్నపాటి వర్షానికి అతలాకుతలం అవుతుంటే.. సముద్ర మట్టానికి అత్యంత దగ్గరగా ఉండే అమరావతిలో చిన్నపాటి వర్షం కురిస్తే.. ఆ వర్షానికే అమరావతి మునిగిందని జగన్ చెప్పటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. చంద్రబాబు దూర దృష్టితో ఆలోచించి కొండవీటి వాగు నిర్మాణాన్ని చేపట్టి ఆ వాగు ద్వారా వరద నీటిని నదిలోకి మరలించటం జగన్‌కి తెలియదా అని నిలదీశారు. 2019లో వైసీపీ ప్రభుత్వంలో అప్పటి మంత్రి బొత్స సత్యనారాయణ రాయపూడిలో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కట్టింది నిజం కాదా అని ప్రశ్నించారు. ప్రకృతి కన్నెర్ర చేస్తే ప్రళయాలు తప్పవని ముంబై, జమ్మూ కాశ్మీర్‌లలో సంభవించిన వరదలే సాక్ష్యమని చెప్పుకొచ్చారు. ఇప్పుడే పుట్టిన అమరావతి పసికూనను జగన్ నాశనం చేయాలనుకుంటే అమరావతి రైతులు ఉద్యమం చేపట్టి జగన్‌ను పాతాళ లోకానికి తొక్కేస్తారని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.

### స్త్రీ శక్తి ఉచిత బస్సులో ప్రయాణించిన ఎమ్మెల్యే కొలికపూడి

మరోవైపు.. తిరువూరు బస్టాండ్ నుంచి విజయవాడకు వెళ్లే ఆర్టీసీ బస్సులో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు కొంత దూరం ప్రయాణం చేశారు. స్త్రీ శక్తి ఆర్టీసీ ఉచిత బస్సు పథకం ద్వారా కూటమి ప్రభుత్వం మహిళలకు అందిస్తున్నప్రయాణాన్ని పరిశీలించారు. తిరువూరు నుంచి విజయవాడ వరకు ఉచితంగా బస్సు ప్రయాణంతో మహిళలకు ఎంత సొమ్ము ఆదాయం అవుతుందని మహిళ ప్రయాణికులను ఎమ్మెల్యే కొలికపూడి అడిగి తెలుసుకున్నారు. గతంలో తిరువూరు నుంచి విజయవాడకు వెళ్లి రావాలంటే రూ.240లు ఖర్చు అవుతుందని మహిళలు తెలిపారు. వైద్యం కోసం నెలకు పలుమార్లు విజయవాడకు వెళ్లే వారికి, కాలేజీ చదువుల కోసం బస్సుల్లో తిరిగే వారికి ఉచిత ప్రయాణంతో చాలా లబ్ధి చేకూరుతుందని మహిళలు తెలిపారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ



కొవ్వూరు (చైతన్యరథం): ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉందని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు వ్యాఖ్యానించారు. మంగళవారం నియోజకవర్గంలో కొవ్వూరు మండలానికి చెందిన ఆరికిరేవుల, కాపవరం, ధర్మవరం, పెనకనమెట్ట, కుమారదేవం, ఐ పంగిడి, మద్దూరు, మద్దూరులంక, నందమూరు, చిడిపి గ్రామాలకు చెందిన 18 మంది లబ్ధిదారులకు రూ. 5,83,343 విలువగల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రమాదకర స్థాయిలో జలాశయాల నీటిమట్టం



మాడుగుల (చైతన్యరథం): అనకాపల్లి జిల్లా మాడుగుల నియోజకవర్గంలోని జలాశయాల నీటిమట్టం ప్రమాదకర స్థాయికి చేరుకుంది. దీంతో అదనపు నీటిని దిగువ నదుల్లోకి విడిచిపెట్టినట్లు అధికారులు తెలిపారు. దేవరాపల్లి మండలం రైవాడ జలాశయం నీటిమట్టం ప్రమాద స్థాయికి చేరుకోవడంతో దిగువ శారదా నదిలోకి ముందస్తుగా ఏడో నంబర్ గేటు ఎత్తి 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. చీడికాడ మండలం కోనాం జలాశయం నుంచి దిగువకు 850 క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేస్తున్నారు. మాడుగుల మండలం పెద్దేరు జలాశయం నుంచి 500 క్యూసెక్కుల నీటిని దిగువ నదుల్లోకి విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయం నుంచి దిగువ నదుల్లోకి వరద నీటి విడుదల కొనసాగుతోంది. నదీపరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## ఏలూరు జిల్లాలో కల్తీ మద్యం గుట్టురట్టు... ఇద్దరు అరెస్టు



ఏపీలో కల్తీ మద్యం సరఫరాపై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఎప్పటికప్పుడూ తనిఖీలు నిర్వహిస్తూ వీటి గుట్టును రట్టు చేస్తున్నారు. తాజాగా తక్కువ ధర కలిగిన మద్యాన్ని కొనుగోలు చేసి వాటిని ఎక్కువ రేటు ఉన్న సీసాలోకి పోసి విక్రయాలు జరుపుతున్నారు ఇద్దరు వ్యక్తులు. అంతేకాక మందుబాబులకు ఏమాత్రం అనుమానం రాకుండా మూతలకు సీల్ వేసి మరి విక్రయిస్తున్నారు. ఇలా ఓ ఇంట్లో గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్న కల్తీ మద్యం స్థావరంపై ఎక్సైజ్ అధికారులు దాడులు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన ఏలూరు జిల్లాలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎక్సైజ్ సూపరింటెంట్ అజయ్‌కుమార్ సింగ్ తెలిపిన వివరాల ప్రకారం జంగారెడ్డిగూడెం మండలం పుట్లగట్లగూడెం గ్రామం వద్ద సిబ్బంది వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో వేగవరం గ్రామానికి చెందిన నూతి మధు అనే యువకుడు వద్ద మద్యం సీసాలు గుర్తించి అతడిని అదుపులోకి తీసుకున్నారు. అవి ఎక్కడివనే కోణంలో దర్యాప్తు చేయడంతో నకిలీ మద్యం రాకెట్ గుట్టు బయటపడింది.

# అసత్యప్రచారాలకు కేరాఫ్‌గా జగన్‌రెడ్డి

**●మెగా కిసాన్ మేళా ప్రారంభంలో అచ్చెన్నాయుడు, జీవీ, కన్నా ధ్వజం**

**●వినుకొండలో మెగా కిసాన్ మేళాలను ప్రారంభించిన అచ్చెన్నాయుడు, జీవీ**



వినుకొండ (చైతన్యరథం): రైతుల సాగు మెళకువలు తెలియజేసేందుకు ఏర్పాటు చేసిన మెగా కిసాన్ మేళా వేదికగా వైకాపా విమర్శలనూ గట్టిగా తిప్పికొట్టారు కూటమి ప్రభుత్వం ప్రముఖులు. ప్రజలు 151 నుంచి 11 స్థానాలకు పడేసినా బుద్ధి తెచ్చుకోకుండా అంతులేని అబద్దాలు, అసత్య ప్రచారాలకు జగన్, వైసీపీ కేరాఫ్‌గా మారారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, జూలకంటి బ్రహ్మారెడ్డి మండిపడ్డారు. ఫేక్ వీడియోలు, తప్పుడు సమాచారంతో రాజధాని అమరావతిపై ఇకనైనా విషం చిమ్మడం మానక పోతే రాష్ట్ర ద్రోహులుగా మిగిలిపోతారని హెచ్చరించారు. వినుకొండ మార్కెట్ యార్డులో మంగళవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో మెగా కిసాన్ మేళా జరిగింది. చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులతో కలిసి మంత్రి అచ్చెన్నాయుడు ఈ మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, డ్రోన్లు, డ్రిప్ ఇరిగేషన్, ట్రాక్టర్లు, స్ప్రేయర్లు, పశుసంవర్ధక, పట్టుపరిశ్రమ, ఉద్యానశాఖ, మత్స్యశాఖ, బ్యాంకింగ్ సేవలు తదితర రంగాలకు చెందిన 150 స్టాళ్లు ఏర్పాటు చేశారు. శాస్త్రవేత్తలు రైతులకు పంటల రక్షణ, అధిక దిగుబడి కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఉద్యాన పంటల పెంపకం, డెయిరీ, ఫౌల్ట్రీ, చేపలు, గొర్రెల పెంపకం వంటి అనుబంధ రంగాల్లో లాభాలు సాధించే మార్గాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన వ్యవసాయ శాఖమంత్రి అచ్చెన్నాయుడు... తెలుగుదేశం పార్టీ 43 ఏళ్ల చరిత్రలో అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ఎల్లప్పుడూ ప్రజల కోసం పని చేసిందన్నారు. కానీ 2019లో ఒక దుర్మార్గుడు తప్పుడు హామీలిచ్చి సీఎం అయ్యాక టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని జగన్ నాటి అరాచక పాలనపై చురకలు వేశారు. గతేడాది ఎన్నికల్లో చంద్రబాబు, పవన్ కల్యాణ్, ప్రధాని మోదీ పిలుపు మేరకు కూటమి గెలిచి 164 సీట్లు సాధించిందన్న ఆయన ఈ విజయం కార్యకర్తల త్యాగ ఫలితమని కొనియాడారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్రానికి ఊహించలేనంత సాయం అందిస్తోందన్న అచ్చెన్న అబద్దాల మీద పుట్టిన పార్టీ, అబద్దాల నాయకుడు జగన్ ఇప్పుడు కూడా అదే దుష్ప్రచారాలు కొనసాగిస్తు ఉండడం విచారకరమన్నారు. ఇకనైనా బుద్ధి మార్చుకోకపోతే త్వరలో ప్రజలే సరైన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

**చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ...** రాష్ట్ర రైతులు ఆర్థిక ప్రగతిలో నెంబర్‌వన్‌గా ముందుకు వెళ్లాలన్నదే సీఎం చంద్రబాబు ఆశయమన్నారు. అందుకే ఉద్యాన పంటలకు పెద్దఎత్తున రాయితీలు ఇస్తున్నామని తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుకు ఎకరానికి రూ.57 వేల రాయితీ, పండ్ల తోటలకు ఎకరానికి లక్ష వరకు రాయితీ ఇస్తూ రైతుల ఆదాయాన్ని పెంచే ప్రయత్నం చేస్తున్నామన్నారు. వైసీపీ పెట్టిన బకాయిలను చెల్లించడంతో పాటు ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే చెల్లింపులు చేస్తున్నారన్నారు. ఇందుకు పూర్తి విరుద్ధంగా ఐదేళ్లు పాలించి ఇప్పుడు మొసలి కన్నీళ్లు కార్చుతున్న జగన్‌రెడ్డి నిజానికి రైతు ద్రోహి, శత్రువని మండిపడ్డారు. వైసీపీ ఐదేళ్ల రాక్షస పాలనలో రైతుల ఆత్మహత్యలు పెరిగాయని, జగన్ పాలనలో రైతుల ఆత్మహత్యల్లో రాష్ట్రం రెండోస్థానంలో నిలిచిందన్నారు. రైతులకు కనీసం పంటల బీమా చెల్లించలేని అసమర్థుడు జగన్ అని ధ్వజమెత్తారు. వినుకొండ, పల్నాడు ప్రాంతంలో పశు సంపద ఎక్కువగా ఉందన్న చీఫ్‌విప్ జీవీ ఈ ప్రాంత అవసరాల కోసం వెటర్నరీ కాలేజీ ఇవ్వాలని మంత్రి అచ్చెన్నాయుడిని కోరారు. వినుకొండ ప్రాంతంలో చేపల పెంపకాన్ని కూడా ప్రోత్సహిస్తున్నారని, రొయ్యల చెరువులు కూడా ఉన్నాయని, వారందరికీ విద్యుత్ రాయితీలు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ ఏడాది 14 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని, వారందరికీ రాయితీలు వచ్చేలా చూడాలని కోరారు.


**మాజీమంత్రి, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ...** చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఈ మేళాను విజయవంతంగా నిర్వహించినందుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఐదేళ్లు జగన్ పాలనలో ప్రజలు రాక్షసపాలన అనుభవించారన్న ఆయన ఇప్పుడు రాష్ట్రం డబుల్ ఇంజిన్ సర్కార్ కింద శాంతి భద్రతలతో పాటు అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమాంతరంగా పొందుతోందన్నారు. రాష్ట్రంలో 2014-19 మధ్యలో ఇచ్చిన సంక్షేమం ఏ పార్టీ ఏ ప్రభుత్వం ఇవ్వలేదన్న ఆయన 2019లో ఓటమి కారణం చేసిన అభివృద్ధిని ప్రజల ముందు చెప్పకపోవడమే. వైసీపీ చేసే అసత్య ప్రచారాన్ని తిప్పి కొట్టకపోవడమే ప్రధాన కారణం అన్నారు. ఇప్పటికీ జగన్, అతని సోషల్ మీడియా బృందం అదే అసత్యాలు ప్రచారం చేస్తూనే ఉన్నారని వాటిని ఎక్కడికక్కడ ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్య యుతంగా పాలించే కూటమి పాలనకు ప్రజలందరి ఆశీస్సులు ఉండాలని కోరారు.

**ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ...** ప్రశాంతంగా ఉన్న ప్రజల మధ్య జగన వైకాపా కుంపటి పెట్టాలని చూస్తున్నారని, రేపో మాపో ఆయన జైలుకు పోతే వీళ్లందరూ రోడ్డెక్కి పెట్రోల్ పోయించుకున్నట్లు నటించాలని, వారే అగ్గిపుల్ల గీస్తారని హెచ్చరించారు. వైసీపీ కార్యకర్తలకు విజ్ఞప్తి చేస్తున్నామని, పెట్రోల్ మీరు పోసుకుంటే అగ్గిపుల్ల జగన్‌రెడ్డి గీయిస్తాడని, మీ కుటుంబాల కోసం అందరూ జాగ్రత్తగా ఉండాలన్నారు.

**ట్రాక్టర్ల ప్రదర్శన**

మెగా కిసాన్ మేళా సందర్భంగా నియోజకవర్గంలోని రైతులు, కార్యకర్తలు, కూటమి నాయకులు కలిసి 350 ట్రాక్టర్లతో నిర్వహించిన భారీ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మంత్రి అచ్చెన్నాయుడు స్వయంగా ట్రాక్టర్ నడపగా, ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, కన్నా లక్ష్మీనారాయణ పక్కన కూర్చుని రైతులతో కలిసి ఊరేగింపులో పాల్గొన్నారు.

## మండలి వెంకటకృష్ణారావు సామాజిక సేవలు ఆదర్శనీయం



ఘంటసాల (చైతన్యరథం): దివంగత మండలి వెంకటకృష్ణారావు సామాజిక సేవలు ఆదర్శనీయమని ఎన్ఆర్ఐ గొర్రెపాటి రంగనాథ బాబు అన్నారు. మంగళవారం రాత్రి వెంకటకృష్ణారావు శతజయంతి మహోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ను ఘంటసాల వారసత్వ సంపద జ్ఞాపికను అందజేశారు. ఈ మహోత్సవ కార్యక్రమానికి జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకట రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ను ఎన్ఆర్ఐ గొర్రెపాటి రంగనాథ బాబు కూటమి నాయకులతో కలిసి ఘనంగా సత్కరించారు. ప్రవాస భారతీయుడు గొర్రెపాటి రంగనాథ బాబు మాట్లాడుతూ... దివి సీమను దివ్యసీమ చేసేందుకు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టటం ద్వారా దివిసీమ ప్రజల హృదయాల్లో మండలి వెంకటకృష్ణారావు చెరగని ముద్ర వేశారని పేర్కొన్నారు. 1972లో వెంకటకృష్ణారావు అమెరికా వచ్చినప్పుడు తొలిసారిగా ఆయనను అమెరికాలో కలిశానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గొర్రెపాటి విద్యా ట్రస్ట్ ప్రతినిధి కొండపల్లి రామకృష్ణ, సర్పంచి బి. వెంకటేశ్వరమ్మ, కూటమి నాయకులు మండలి వెంకట్రామ్(రాజా), బండి పరాత్పరరావు, అయినపూడి భాను ప్రకాష్, గొర్రెపాటి సురేష్, కాకుమాని రంగారావు, గొర్రెపాటి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## బీసీ డీ కుల ధ్రువీకరణతో నగరాలకు ఎంతో మేలు

**●రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో నగరాల అభివృద్ధికి సీఎం చంద్రబాబు కట్టుబడి ఉన్నారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టం చేశారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితను నగరాల సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ మరుపిళ్ల తిరుమలేశ్, ఆ సామాజిక వర్గ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల్లో ముందు ఇచ్చిన హామీని నెరవేర్చినందుకు సీఎం చంద్రబాబుకు, మంత్రి లోకేశ్‌కు, మంత్రి సవితకు కృతజ్ఞతలు తెలియజేశారు. నగరాలందరికీ ఒకేలా బీసీ-డీ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం వల్ల ప్రభుత్వ పథకాలు అందుకునే అవకాశం కలిగిందన్నారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ... నగరాలను అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి సీఎం చంద్రబాబు కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నగరాలకు బీసీ-డీ ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## పీ-4 అమలుతో ఆర్థిక, సామాజిక అసమానతలకు స్వస్తి : ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

**●మాటలు తప్ప చేతలకు పనికిరానే వారే పీ-4ను తప్పుపడుతున్నారు**



చిలకలూరిపేట (చైతన్యరథం): ప్రజారంజక పాలనతో కూటమిప్రభుత్వం ఏడాదిలోనే ప్రజల మనసులు గెలిచింది. సూపర్ -6 అమలుతో అన్నివర్గాల ఆదరాభిమానాలు పొందిన ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజల మద్దతుతో రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి పనులు పరుగులు పెట్టిస్తున్నారు. పరిశ్రమల స్థాపన, పెట్టుబడుల ఆకర్షణతో పాటు మరోపక్క పేద కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్న లక్ష్యంతో ఆయన ఆలోచనలు వేగంగా అమల్లోకి వస్తున్నాయి. దానిలో భాగంగానే పీ-4 కార్యాచరణ దిశగా ముఖ్యమంత్రి సన్నద్ధమయ్యారు.

**రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం**

రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా, ముఖ్యమంత్రి చంద్రబాబు సదుద్దేశంతో, గొప్ప ఆశయంతో చేపట్టిన పథకమే పీ-4. ఈ పథకం అమలుతో రాష్ట్రంలో ఉన్న పేదరికాన్ని దశలవారీగా రూపుమాపాలన్నదే ప్రభుత్వ ఆలోచన. రాష్ట్రంలో అట్టడుగున ఉన్న 20 శాతం పేద కుటుంబాలను ఆర్థికంగా ఎదిగేలా చేయాలన్న సంకల్పం దిశగా ప్రభుత్వం సాగుతోంది. సంపన్నుల్ని పేదల్ని ఒకతాటిపైకి తీసుకొచ్చి, వారిమధ్య ప్రభుత్వం వారధిగా ఉండి.. పేదకుటుంబాలకు అవసరమైన ఆర్థిక, ఇతర సహాయ సహకారాలు అందించి, ఆయా కుటుంబాల్లోని వారికి అన్నివిధాలా చేయూతనిచ్చి, వారికి అండగా నిలవడమే ఈ పీ-4 ప్రధాన లక్ష్యం. అధికాదాయం ఉన్న సంపన్నవర్గాలు తమకు తోచినవిధంగా పేదలకు సాయం చేయడం ద్వారా, ఆర్థిక అసమానతలు తగ్గించి పరోక్షంగా రాష్ట్రాభివృద్ధికి సహకరించినవారు అవుతారు. పథకం అమలుతో 2029 నాటికి రాష్ట్రంలో పేదరిక నిర్మూలన, 2047 నాటికి దేశ ఆర్థికాభివృద్ధిలో ఏపీ కీలకభూమిక పోషించాలన్నదే చంద్రబాబు ప్రధాన లక్ష్యం. అసాధ్యాలను ఆచరణ సాధ్యం చేసిన చంద్రబాబు అనుభవంతో ఆయన ఆశయం నెరవేరి.. పేదల జీవితాల్లో గొప్ప మార్పులు రావాలని ఆకాంక్షిస్తూ..... పీ-4 అమల్లో మనమూ భాగస్వాములవుదాం." అని మాజీమంత్రి ప్రత్తిపాటి ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

## బీసీలకు పుట్టినిల్లు తెలుగుదేశం పార్టీ : ఎమ్మెల్యే గళ్ళా మాధవి




గుంటూరు (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ బీసీలకు పుట్టినిల్లు అని, బీసీలను రాజకీయంగా ప్రోత్సహించి, చట్ట సభల్లో అడుగు పెట్టటానికి కృషి చేసింది అన్న ఎన్టీఆర్ అని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. మంగళవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో యాదవ నేతల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అనంతరం బీసీ నేతలు ఎమ్మెల్యే గళ్ళా మాధవిని ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో బీసీల అభివృద్ధి కోసం నేను ఎల్లప్పుడూ కృషి చేస్తాను. రాజకీయంగా ఎదగడానికి, సామాజికంగా ఎదగటానికి బీసీలకు అన్ని విధాల సహకారం అందిస్తాను" అని తెలిపారు. గతంలోనే బీసీ సంక్షేమం కోసం అసెంబ్లీలో పలు మార్లు బలంగా మాట్లాడానని, ముఖ్యంగా బీసీ భవన్ నిర్మాణం కోసం అసెంబ్లీలో తన వంతు కృషి చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్ళ వెంకటేశ్ యాదవ్, అడకా శ్రీనివాస్, తేలుకుట్ల హనుమాయమ్మ, అడకా పద్మావతి, గాలం వెంకటేశ్వర్లు, తెల్లగొర్ల అప్పారావు యాదవ్, తుమ్మల నాగేశ్వరరావు, ఉప్పుటూరి పేరయ్య, గ్యాలం హనుమంతరావు, యర్రకుల శ్రీనివాస్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ సిక్స్... సూపర్ సక్సెస్...

## మా విజయోత్సవ ర్యాలీ డబుల్ సక్సెస్

●అన్నదాత సుఖీభవతో రైతుల్లో రెట్టింపు సంతోషం

●తల్లికి వందనంతో ఇంటింటా ఆనందం

●మహిళల్లో ఊహించని స్థాయిలో సంతోషాన్ని నింపుతున్న స్త్రీశక్తి : సోమిరెడ్డి



సర్వేపల్లి (చైతన్యరథం): సూపర్ సిక్స్... సూపర్ సక్సెస్ అయ్యాయని, మా విజయోత్సవ ర్యాలీ డబుల్ సక్సెస్ అయిందని మాజీ మంత్రి, నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మంగళవారం వెంకటాచలంలో నిర్వహించిన అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ విజయోత్సవ ర్యాలీలో సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పాల్గొన్నారు. 900 ట్రాక్టర్లతో రికార్డు స్థాయిలో విజయోత్స ర్యాలీ నిర్వహించారు. వందలాది రైతు రథాలు(ట్రాక్టర్లు), రైతులతో కలిసి వెంకటాచలం ఇసుక డంపింగ్ యార్డు నుంచి ఎర్రగుంట సమీపంలోని కమ్యూనిటీ హాలు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... అన్నదాత సుఖీభవ విజయోత్సవ ర్యాలీ ఊహించని స్థాయిలో స్థాయిలో జరగడం సంతోషంగా ఉందని, 250 ట్రాక్టర్లు వస్తాయని భావించామని, 800 నుంచి 900 ట్రాక్టర్లు రావడం ఆనందదాయకంగా ఉందన్నారు. ప్రతి గ్రామం నుంచి రైతు రథాలు తరలిరావడంతో విజయోత్సవ ర్యాలీ సూపర్ సక్సెస్ అయిందన్నారు. పీఎం కిసాన్ పథకంతో కేంద్రం రైతులకు రూ.6 వేలు ఇస్తుంటే, అన్నదాత సుఖీభవ పథకం ద్వారా చంద్రబాబు నాయుడు మరో రూ.14 వేలు కలిపి అందిస్తున్నారని, వైసీపీ ప్రభుత్వంలో రూ.7500 కలిపి రూ.13,500 వేలు ఇస్తే, కూటమి ప్రభుత్వం ఏకంగా రూ.20 వేలకు పెంచిందన్నారు. అన్నదాత సుఖీభవ పథకంతో రైతుల సంతోషం రెట్టింపయిందని, అన్నదాతల్లో ఆనందం నింపే ఈ పథకం కోసం రాష్ట్రంలో రూ.9300 కోట్లను కూటమి ప్రభుత్వం ఖర్చు చేస్తోందన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక వ్యవసాయ శాఖకు పూర్వవైభవం వస్తోంది.. నామరూపాలు కోల్పోయిన వ్యవసాయ శాఖ తిరిగి కొత్తకళను సంతరించుకుందన్నారు. తల్లికి వందనం పథకంతోనూ ప్రతి ఇంటా ఆనందమేనని, గత ప్రభుత్వం ఇంటికి ఒక్క బిడ్డకే అమ్మఒడి ఇస్తే, మా కూటమి ప్రభుత్వం తల్లికి వందనం ఇంట్లో ఎంత మంది పిల్లలున్నా అందరికీ లబ్ధి చేకూరుస్తోందన్నారు. ఆడపడుచులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కోసం అమలు చేస్తున్న స్త్రీశక్తి పథకానికి విశేష స్పందన లభిస్తోంది. కేవలం నాలుగు రోజుల్లో 19 లక్షల మంది ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారు. స్త్రీశక్తి పథకంతో రాష్ట్రంలోని మహిళలకు ఏడాదికి రూ.1800 కోట్ల మేర లబ్ధి జరుగుతుంది. దీపం పథకం ద్వారా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేస్తున్నాం. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం ఒక్క బ్లూమీడియాకు మాత్రమే కనిపించడం లేదు. వాస్తవాలకు దూరంగా ప్రతి అంశాన్ని వక్రీకరించడమే పనిగా పెట్టుకున్నారు. స్త్రీశక్తి పథకంపైనా అబద్ధాలను వండి వారుస్తున్నారని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పులువు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భారీగా మిగిలిపోయిన ఇంజినీరింగ్ సీట్లు !

● 2025 - 26 విద్యా సంవత్సరానికి భర్తీకానీ నాలుగో వంతు సీట్లు

●కన్వీనర్ కోటాలోనూ విద్యార్థుల కంటే సీట్లే అధికం



రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇంజినీరింగ్ కాలేజీల్లో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి నాలుగో వంతు సీట్లు మిగిలిపోయాయి. కన్వీనర్ కోటాలోనూ విద్యార్థుల కంటే సీట్లే అధికంగా ఉన్నాయి. దీంతో ఈ ఏడాది దాదాపు 34,298 సీట్లు మిగిలిపోయాయి. యూనివర్సిటీల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తుంది. వీటిల్లో మొత్తం 1361 సీట్లు మిగిలాయి. ఇక యాజమాన్య కోటా సీట్లు కూడా కలిపితే వీటి సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వ కన్వీనర్ కోటా సీట్లకు ఈ ఏడాది రెండు విడతలుగా కౌన్సెలింగ్ జరిగింది. ఈ రెండు విడతలు పూర్తయిన తర్వాత ప్రైవేట్ కాలేజీల్లో ఏకంగా 31,811 సీట్లు మిగిలిపోయాయి. ప్రైవేటు యూనివర్సిటీల్లోనూ 1,126 సీట్లు మిగిలాయి.

ఈఏపీసెట్‌లో రాష్ట్రంలో మొత్తం 1,84,248 మంది విద్యార్థులు అర్హత సాధించగా.. ఇందులో 1,29,012 మంది కన్వీనర్ కోటాలో చేరేందుకు రిజిస్టర్ చేసుకున్నారు. వీరిలో 1,28,712 మంది విద్యార్థులు ప్రవేశాలకు అర్హత సాధించారు. అయితే అన్ని ప్రైవేటు వర్సిటీలు, ప్రభుత్వ యూనివర్సిటీలు, కాలేజీల్లో కలిపి కన్వీనర్ కోటా కింద 1,53,964 సీట్లు అందుబాటులో ఉన్నాయి. కౌన్సెలింగ్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న అందరికీ సీట్లు కేటాయించినా.. దాదాపు 25 వేలకు పైగా మిగిలే పరిస్థితి నెలకొంది. కొంత మందికి కోరుకున్న కాలేజీల్లో సీట్లు దక్కకపోవడంతో ఈ సీట్లు కూడా మిగిలిపోయాయి.

ప్రైవేటు కాలేజీల్లో కన్వీనర్ కోటా కింద 70 శాతం, యాజమాన్య కోటా కింద 30 శాతం సీట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రైవేట్ యూనివర్సిటీల్లో 35 శాతం, 65 శాతంగా ఉంది. యాజమాన్య కోటా సీట్లలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (సీఎస్‌ఈ) మినహా మిగతా అన్ని బ్రాంచిల్లో సీట్లు భారీగా మిగిలిపోయాయి. డీమ్డ్ వర్సిటీల్లో వంద శాతం సీట్లను యాజమాన్యమే భర్తీ చేస్తుంది. అయితే ఏఐసీటీఈ డీమ్డ్ టు బీ వర్సిటీలకు కొత్త అనుమతులు ఇస్తోంది. చాలామంది వీటిల్లోనూ ప్రవేశాలు పొందుతున్నారు. ఆయా వర్సిటీలు ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించుకుని ప్రవేశాలు కల్పిస్తున్నాయి. సీఎస్‌ఈ బ్రాంచికి డిమాండ్ ఉండడంతో ఇప్పుడు అన్ని విద్యా సంస్థల్లోనూ ఈ సీట్లే అధికంగా ఉన్నాయి. మరోవైపు ఈఏపీసెట్‌లో టాప్ ర్యాంకులు సాధించిన విద్యార్థులు స్థానికంగా ప్రవేశాలు పొందడానికి బదులు ఎన్‌ఐటీ, ఐఐటీ, ట్రిపుల్‌ఐటీలతోపాటు ఇతర రాష్ట్రాల్లో చేరుతున్నారు. ఈ ఏడాది ఈఏపీసెట్‌లో 200లోపు ర్యాంకుల్లో ఇద్దరు, టాప్ 500 ర్యాంకుల్లో కేవలం 12 మంది మాత్రమే కౌన్సెలింగ్‌లో పాల్గొనడం ఈ పరిస్థితి అద్దం పడుతోంది.

# ప్రజల ఆరోగ్య పరిరక్షనకు అధిక ప్రాధాన్యం : గొట్టిపాటి లక్ష్మీ

దర్శి (చైతన్యరథం): ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రజాప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని 85మంది లబ్ధిదారులకు రూ.50లక్షల 42వేల 669 చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల అనారోగ్యానికి గురై సరైన వైద్యం చేయించకునే శక్తిలేక ఇబ్బందిపడుతున్న తరుణంలో సీఎం చంద్రబాబునాయుడు దయాగల హృదయంతో ఆర్థిక సహాయం అందజేస్తున్నారని చెప్పారు. దీంతో ప్రజలం దరికి ఆరోగ్య భరోసా కలుగు తుందన్నారు. కార్యక్రమంలో దర్శి, తాళ్ళూరు, ముండ్లమూరు, దొనకొండ మండలాల టీడీపి అధ్యక్షులు మారెళ్ళ వెంకటేశ్వర్లు, మేడగం వెంక టేశ్వరరెడ్డి, కూరపాటి శ్రీనివాసరావు, మోడి ఆంజనేయులు, దర్శి పట్టణ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా, తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్న నాయకుడు చంద్రబాబు

●తీర ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక: ఎమ్మెల్యే ఇంటూరి



కందుకూరు (చైతన్యరథం): అప్పుల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్న నాయకుడు చంద్రబాబునాయుడు అని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. నియోజకవర్గంలోని తీర ప్రాంత అభివృద్ధికి పక్కా ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఉలవపాడు మండలం, కరేడు పంచాయతీలో నాబార్డ్ నిధులు రూ.2.45 కోట్లతో నిర్మించనున్న కరేడు ర్యాంపు నుండి రామాయపట్నం వరకు నూతన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై భూమిపూజ చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో ఒక్క కొత్త ఆర్ అండ్ బి రోడ్డు గానీ, పంచాయతీ రోడ్డు గానీ నిర్మించిన దాఖలాలు లేవని రోడ్లపై ప్రయాణించాలంటే ప్రజలు నరకయాతన అనుభవించారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ప్రజల ప్రయాణ సౌకర్యార్థం రోడ్ల నిర్మాణానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నాం అని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గత ప్రభుత్వం చిన్నాభిన్నం చేసినప్పటికీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన అనుభవంతో రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమంలో ప్రథమ స్థానంలో నిలపడానికి నిరంతరం శ్రమిస్తున్నారని కొనియాడారు. మేనిఫెస్టోలో చెప్పిన హామీలన్నీ నెరవేరుస్తున్నామని, మహిళలకు సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, రైతుల కోసం అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి సంక్షేమ పథకాలను ఇప్పటికే అమలు చేస్తున్నామని గుర్తుచేశారు.

# రాజకీయంగా ఎదుర్కోలేక రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీస్తున్న వైసీపీ

●సొంత మీడియాతో అమరావతి రాజధానిపై నిత్యం విషప్రచారం

●ప్రజలు ఛీ కొట్టినా తీరు మార్చుకోని జగన్ అండ్ కో

●ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహన్ కృష్ణ మండిపాటు



గుంటూరు (చైతన్యరథం): ఎన్నికల్లో ప్రజలు ఛీ కొట్టినా వైసీపీ నాయకులు, ఆ పార్టీ అనుబంధ మీడియా సంస్థలు, సాక్షి మీడియా, వైసీపీ సోషల్ మీడియా నడుపుతున్న వ్యక్తులు ఏమాత్రం సిగ్గు, శరం, లజ్జ, మానం లాంటివి వదిలేసి బరితెగించి అబద్ధాలు, దుష్ప్రచారాలు ప్రచారం చేస్తూ ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం గుంటూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో మన్నవ మోహనకృష్ణ మాట్లాడుతూ... అమరావతిలో రూ.52 వేల కోట్లతో జరుగుతున్న నిర్మాణాలను చూసి ఓర్వలేక వైసీపీ నేతలు ఫేక్ న్యూస్ ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎక్కడో వాగులు పొంగిన దృశ్యాలను అమరావతితో కలిపి బ్లూ మీడియా తప్పుడు కథనాలు ప్రసారం చేస్తోందని మండిపడ్డారు. అవాస్తవాలను వాస్తవాలుగా చిత్రీకరించేందుకు వైసీపీ నాయకులు పడరాని పాట్లు పడుతున్నారని, సొంత మీడియాతో అమరావతి రాజధానిపై నిత్యం విషం చిమ్ముతున్నారని, అదిగో పులి అంటే ఇదిగో తోక అన్నట్లు... జగన్ తెరవెనుకుండి వరద భయాన్ని ప్రజలపై రుద్దుతున్నారని అన్నారు. విజయవాడ, పొన్నూరు మునిగిపోయిందని బులుగు మీడియా ప్రచారం చేస్తుందని, ప్రకాశం బ్యారేజ్‌లో ఒక్క గేటుకు చిన్న రిపేర్ వస్తే దానిపై రాద్ధాంతం చేస్తున్నారని, బ్యారేజ్‌లో 69 గేట్లు బాగానే పనిచేస్తున్నాయని అన్నారు. 400 ఏళ్ల చరిత్ర గల హైదరాబాదే చిన్నపాటి వర్షానికి అతలాకుతలం అవుతుంటే... సముద్ర మట్టానికి అత్యంత దగ్గరగా ఉండే అమరావతిలో చిన్నపాటి వర్షం కురిస్తే.. ఆ వర్షానికే అమరావతి మునిగిందని జగన్ చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. జగన్ తన సొంత ఇంటిని తాడేపల్లిలో కట్టుకున్నాడని.. తాడేపల్లిలో జగన్ ఇల్లు మునిగిందా అని సూటిగా ప్రశ్నించారు. ధైర్యం ఉంటే అమరావతి వచ్చి సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు, ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ చూసి వెళ్లాలని జగన్ అండ్ కోకు సవాల్ విసిరారు. ఏపీవ్యాప్తంగా విశేష ఆదరణ పొందుతున్న అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, స్త్రీ శక్తి, దీపం 2 పథకాలతో పాటు విద్య పథకాల ద్వారా కూటమి ప్రభుత్వానికి వస్తున్న ఆదరణే జగన్ అసహనానికి కారణమని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ఇలాంటి సంక్షేమ పథకాలను చూసి జగన్ అండ్ కో ఓర్వలేక పోతున్నారని, సూపర్ సిక్స్‌లోని హామీలు అద్భుతంగా అమలౌతున్నాయని మోహనకృష్ణ పేర్కొన్నారు. కడప 'మా అడ్డా' అని చెప్పుకునే జగన్ కు ఎదురు దెబ్బ తిగిలింది. పులివెందుల వారి జాగీరనుకున్నారు.. జడ్పీటీసీ ఎన్నికల్లో పులివెందుల ప్రజలు వైసీపీకి తగిన బుద్ధి చెప్పారు. పులివెందుల ప్రజానీకం వైసీసీ అభ్యర్థులకు డిపాజిట్లు కూడా దక్కకుండా చేశారు. జగన్ కు ప్రజలపట్ల ఏమాత్రం గౌరవం లేదు, దేశం పట్ల భక్తి భావాలు లేవు. ఆయనకు ఎప్పుడు చూసినా స్వార్థం, కుట్రలు–కుతంత్రాలు, విధ్వంసకాండ మాత్రమే కావాలి. కూటమి ప్రభుత్వానికి రోజురోజుకీ జనాల్లో పెరుగుతున్న ఆదరణ... చూసి తట్టుకోలేకపోతున్నారని, రాజకీయంగా ఎదుర్కోలేక రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసేందుకు యత్నిస్తున్నారని, ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వారిపై రాజద్రోహం కేసులు నమోదు చేయాలని మోహనకృష్ణ డిమాండ్ చేశారు.

# శ్రీశైలం జలాశయం 10 స్పిల్ వే గేట్లు ఎత్తి నీటి విడుదల



శ్రీశైలం (చైతన్యరథం): శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి 3,38,218 క్యూసెక్కులు చేరుతోంది. దీంతో శ్రీశైలం జలాశయం 10 స్పిల్ వే గేట్లు ఎత్తి 3,04,690 క్యూసెక్కులు నాగార్జునసాగర్కు విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ నుంచి 30,000 క్యూసెక్కులు, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 30,153 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 881.70 అడుగులకు చేరింది. నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా ప్రస్తుతం 197.46 టీఎంసీలుగా కొనసాగుతోంది.

## శాంతియుతంగా వినాయకచవితి నిర్వహించుకోవాలి : బీవీ



ఎమ్మిగనూరు (చైతన్యరథం): ఎమ్మిగనూరులో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి సమావేశం నిర్వహించారు. వినాయక చవితి ఉత్సవాల నిర్వహణలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వినాయక విగ్రహాలు నిమజ్జనం చేసే ఘాట్ను ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్రెడ్డి సందర్శించారు. ఘాట్ వద్ద లైటింగ్స్, క్రేన్లు తదితర ఏర్పాట్లను పరిశీలించారు. ఉత్సవాల్లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. వేడుకల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుమతులపై చర్చించారు. ఎలాంటి ఘర్షణలకు తావివ్వకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. శాంతియుతంగా వినాయక చవితి వేడుకలు జరుపుకోవాలని గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, తెదేపా నాయకులు, కార్యకర్తలు, పోలీసులు, అగ్నిమాపక దళ సభ్యులు, మున్సిపల్ కమిషనర్, సిబ్బంది పాల్గొన్నారు.

## ధర్మవరం, ముదిగుబ్బ మండలాల వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు

- లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన పరిటాల శ్రీరామ్



ధర్మవరం (చైతన్యరథం): నియోజకవర్గంలో పలువురు లబ్ధిదారులకు తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ముదిగుబ్బ, ధర్మవరం మండలం, ధర్మవరం పట్టణానికి చెందిన అనారోగ్యంతో ఆరోగ్య శ్రీ వర్తించక ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సలు పొందిన వారికి సీఎంఆర్ఎఫ్ కింద సాయం అందింది. మొత్తం 12మందికి రూ. 10.36లక్షలు మంజూరైంది. ధర్మవరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఈ చెక్కులను శ్రీరామ్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు శ్రీరామ్కు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. పేదల ఆరోగ్యానికి ఈ ప్రభుత్వం ఎప్పటికీ అండగా ఉంటుందని.. పరిటాల శ్రీరామ్ అన్నారు. ఇప్పటికే విద్య, వైద్యం కోసం ఎంతో ఖర్చు చేస్తోందన్నారు. ధర్మవరం నియోజకవర్గంలో గతంలో ఎప్పుడూ లేని విధంగా సీఎంఆర్ఎఫ్ కింద సాయం అందిందన్నారు. ఇంత పెద్ద ఎత్తున సాయం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు చెప్పారు.

## ఆదోనిని రెండో ముంబైగా మార్చుతాం : ఎమ్మెల్సీ బీటీ నాయుడు



ఆదోని (చైతన్యరథం): పట్టణాన్ని రెండో ముంబైగా మారుస్తామని ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. మున్సిపల్ ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పించారు. టీడీపీ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, ఎమ్మెల్యే పార్థసారథి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మీనాక్షినాయుడు మాట్లాడుతూ కార్యకర్తగా ఉంటూ, రెండోసారి ఎమ్మెల్సీగా ఎన్నికైన బీటీ నాయుడు ఆదోని మున్సిపల్ ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ప్రమాణం చేయడం హర్షణీయమన్నారు. పార్టీలకతీ తంగా పనిచేస్తేనే ఆదోని అభివృద్ధి చెందుతుందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అనుభ వజ్ఞుడైన మీనాక్షి నాయుడు సహకారంతో తాను కూటమి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యా న్నారు. తాను నిధులు తెస్తే 36 మంది వైసీపీ కౌన్సిలర్లు అడ్డుకుంటే పట్టణం ఎలా అభివృద్ధి చెందుతుంది ప్రశ్నిం చారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ తాను పుట్టి పెరిగిన పట్టణాన్ని అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ అవకాశం ఇచ్చారన్నారు. పాత ఓవర్ బ్రిడ్జి స్థానంలో నూతన వంతెన నిర్మాణం, తాగు నీటి సమస్య, బసాపురం ఎస్ఎస్ ట్యాంకు, రోడ్లు, డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం పార్టీ నాయకులు, గజమాలతో సన్మానించారు. కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి, జనసేన ఇన్చార్జి మల్లప్ప, గుడిసె కృష్ణమ్మ, ఇన్చార్జి వీరభద్రగౌడ్, భాస్కర్రెడ్డి, రంగస్వామి నాయుడు, భూపాల్చౌదరి, విట్టా రమేష్ పాల్గొన్నారు.

## మోపాడు ఆధునికీకరణ పనులు పూర్తి చేయాలి

కనిగిరి (చైతన్యరథం): జైకా నిధులతో చేపట్టిన మోపాడు ఆధునికీకరణ పనులను వేగవంతం గా పూర్తి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్లో సోమవారం ఇరిగేషన్ అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మోపాడు ప్రాజెక్టు ఆధునికీకరణ పనులు పూర్తిచేసి ఆయకట్టు రైతులకు నిరంతరాయంగా నీటి సరఫరా జరిగేలా చూడాలని అధికారులకు సూచించా రు. ప్రస్తుతం వర్షాకాలం మొదలవుతున్నందున రైతుల కు సాగు నీరు అందించటం ఎంతో అవసరమన్నారు. జైకా నిధుల సహకారంతో చేపట్టిన పనులు కూడా ఇం కా పూర్తి చేయకపోవటంపై ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. పనులు పూర్తి కాకపోవటంతో రైతులు ఇబ్బం దులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. అలాంటి పరిస్థితి రాకుండా అధికారులు తమవంతు కృషి చేయాలని కోరారు. పెండింగ్ పనులన్నింటినీ వేగవంతం గా పూర్తిచేయాలన్నారు.

## బనగానపల్లెలో అభివృద్ధి పనులను పర్యవేక్షించిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి



బనగానపల్లె (చైతన్యరథం): పాత బస్టాండ్ సమీపంలో నూతనంగా నిర్మిస్తోన్న డ్రెయిన్ల అభివృద్ధి పనులను రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. పాత బస్టాండ్ సమీపంలో రోడ్డుకు ఆనుకుని ఉన్న విద్యుత్ స్తంభాల వల్ల ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆయా విద్యుత్ స్తంభాలను.. పక్కకు తరలించాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ముస్లిం మైనార్టీల కోసం నిర్మించ తలపెట్టిన షాదీఖానా భవన నిర్మాణ పనులను కూడా ప్రత్యేకంగా పరిశీలించిన మంత్రి... బనగానపల్లె పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులను సాధ్యమైనంత వేగంగా పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు.

**మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన భానుముక్కల వ్యవసాయ సొసైటీ కమిటీ ఛైర్మన్**

బనగానపల్లెలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రోడ్లు, మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్రెడ్డిని భానుముక్కల వ్యవసాయ సొసైటీ చైర్మన్గా ఇటీవల నియమితులైన అక్బర్ కలాం మర్యాదపూర్వకంగా కలిశారు. భానుముక్కల సొసైటీ చైర్మన్గా నియమితులైన క్రమంలో మంత్రిని కలిసి సంతోషం వ్యక్తం చేస్తూ.. కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సొసైటీ అభివృద్ధి కోసం కృషి చేయాలని సూచించిన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సూచించారు.

మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన బనగానపల్లె ఎస్సై

బనగానపల్లె పట్టణ నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన క్రమంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని ఎస్సై టి.కల్పన మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలో ప్రశాంత వాతావరణానికి విఘాతం కలగకుండా, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు రక్షణ కల్పించడం, బాధితులకు సత్వరన్యాయం అందించేందుకు కృషి చేయాలని మంత్రి ఈ సందర్భంగా సూచించారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై ప్రచారం విస్తృతం చేయాలి

- పార్టీలో కష్టపడి పనిచేసేవారికి సముచిత గౌరవం, పదవులు
- నేతలు, కార్యకర్తలకు ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు దిశానిర్దేశం



మడకశిర (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రచారాన్ని మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఉందని పార్టీ నాయకులు, కార్యకర్తలకు మడకశిర శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు ఎం.ఎస్.రాజు మరియు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి అన్నారు. మడకశిరలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ రాష్ట్రాభివృద్ధి కోసం సమన్వయంతో ముందుకు దూసుకెళుతున్నారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో 30ఏళ్లు వెనక్కి పోయిన రాష్ట్రాభివృద్ధిని తిరిగి పట్టాలెక్కించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, మంత్రివర్గం, అధికారులు అహర్నిశలు శ్రమిస్తున్నారు. ఈ క్రమంలో ప్రజలకు కూటమి ప్రభుత్వం వల్ల జరుగుతున్న మంచిని ప్రజలకు అర్థమయ్యేలా చెప్పే బాధ్యతను గ్రామాలు, పట్టణాల్లో కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు బాధ్యతగా తీసుకోవాల్సిన అవసరం ఉంది. పేదప్రజలకు ప్రభుత్వం చేసే మంచిని వక్రీకరించి ప్రజలను అబద్దాలతో తప్పుదారి పట్టించే సైకో జగన్మోహన్ రెడ్డి మరియు అతని సైకో మూఠాల కుట్రలను ధీటుగా ఎదుర్కోవాలి. ప్రజాసంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం పనిచేసే కూటమి ప్రభుత్వంపై జగన్మోహన్ రెడ్డి విషం చిమ్మడమే పనిగా పెట్టుకున్నాడు. ప్రజలకు జరుగుతున్న మంచి జగన్మోహన్ రెడ్డికి చెడుగా కనిపిస్తుంది. రాష్ట్ర ప్రజలకు జగన్మోహన్ రెడ్డి, వైసీపీ నేతలు అబద్దాలు చెప్పి నమ్మించాలనే ప్రయత్నాలు చేస్తున్నారు. వీటిని కూటమి పార్టీ నాయకులు ధీటుగా తిప్పికొట్టాలి. పార్టీలో కష్టపడి పనిచేసేవారికి అడగకుండానే పార్టీ అధిష్టానం తగిన గుర్తింపు, పదవులు దక్కుతున్నాయి. కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా పార్టీ ముందుకెళుతోంది. ఈ క్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్రకార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



## భారత్-చైనా సంబంధాల్లో మలుపు

### మోదీ-వాంగ్ యి సమావేశం

భారత్–చైనా సంబంధాలలో ఒక ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఇది దేశ రాజధాని న్యూ ఢిల్లీలో మంగళవారం జరిగింది. ఈ క్రమంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తన అధికారిక నివాసం 7 లోక్ కళ్యాణ్ మార్గ్‌లో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యిని సాదరంగా ఆహ్వానించారు. ఇది కేవలం ఒక సాధారణ భేటీ సమావేశం మాత్రమే కాదు. అత్యంత కీలకమైన దౌత్య సమావేశమని చెప్పవచ్చు. ఎందుకంటే రెండు దేశాల మధ్య గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ భేటీకి చాలా ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రధానం గా 2020లో లడఖ్ గాల్వాన్ లోయ వద్ద జరిగిన ఘర్షణ తర్వాత భారత్–చైనా సంబంధాలు మరింత ఉద్రిక్తంగా మారాయి. అలాంటి సమయంలో ఇద్దరు ప్రముఖ నేతలు ఒకే టేబుల్ వద్ద కలవడం ఆసక్తికరంగా మారింది.

## ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సుదర్శన్‌రెడ్డి

### ఆయన ఎవరో తెలుసా?



ఢిల్లీ: ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా బి.సుదర్శన్‌రెడ్డిని ప్రకటించింది. జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి భారత ప్రఖ్యాత న్యాయమూర్తుల్లో ఒకరు. ఆయన 1948లో తెలంగాణ రాష్ట్రంలోని నిజామాబాద్ జిల్లాలో జన్మించారు. ఆయన 1969లో న్యాయవాదిగా కెరీర్ ప్రారంభించారు. 1995లో ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అనంతరం 2005లో సుప్రీంకోర్ట్ న్యాయమూర్తిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. 2011లో పదవీ విరమణ పొందారు. తదుపరి 2013 మార్చిలో మొదటి గోవా లోకాయుక్తగా బాధ్యతలు స్వీకరించారు. అయితే ఆ పదవికి కూడా 2013 అక్టోబర్‌లో వ్యక్తిగత కారణాలతో పదవికి రాజీనామా చేశారు. ఆయన న్యాయపరమైన అంశాలలో న్యాయవ్యవస్థలో చెరిగిపోని ముద్ర వేశారు. పదవీ విరమణ అనంతరం కూడా ప్రజా ప్రయోజనాల కోసం ఆయన సేవలు కొనసాగిస్తున్నారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించడంతో ఆయన మళ్లీ వార్తల్లో నిలిచారు.

## రాహుల్‌ను ప్రధాని చేయడమే లక్ష్యం

### ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ వ్యాఖ్యలు

నవడా: రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో 'ఇండియా' కూటమి ప్రధానమంత్రి అభ్యర్థి ఎవరనే దానిపై ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ సంకేతాలిచ్చారు. రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా ప్రతిపక్షాలు కృషి చేస్తాయని చెప్పారు. తేజస్వి ఈ వ్యాఖ్యలు చేసినప్పుడు రాహుల్ గాంధీ ఆయన పక్కనే ఉన్నారు. రాహుల్ చేపట్టిన 'ఓటర్ అధికార్ యాత్ర' మంగళవారం బిహార్‌లోని నవడాలో సాగుతోంది. ఈ యాత్రలో తేజస్వి పాల్గొని మాట్లాడారు. 'ఇండియా' కూటమి 2024 లోక్‌సభ ఎన్నికల్లో ప్రధానమంత్రి అభ్యర్థిని ప్రకటించకుండానే ఎన్నికలకు వెళ్లింది.

**బిహార్ ప్రజలను ఫూల్స్ చేసేందుకు..**

నవడా ర్యాలీలో తేజస్వి యాదవ్ మాట్లాడుతూ ఓట్ల చోరీకి ఎలక్షన్ కమిషన్, బీజేపీ చేతులు కలిపాయని, బిహార్ ప్రజలను ఫూల్స్ చేయాలనుకుంటున్నాయని ఆరోపించారు. ఓటు హక్కును చోరీ చేయాలని బీజేపీ అనుకుంటోందని, ఎస్ఐఆర్ అనేది ఓట్ల దోపిడీ అని, ఇదెంతమాత్రం సాగనీయమని తెలిపారు. బిహార్‌లో ఓటర్ల తమ ఓటు హక్కు వినియోగించుకోకుండా కుట్ర జరుగుతోందని చెప్పారు. నితీష్‌కుమార్ సారథ్యం లోని 'పాతబడిన, చిరిగిపోయిన' ప్రభుత్వాన్ని యువత ఇంటికి సాగనంపాలని కోరారు. చిరిగిపోయిన వస్త్రువులను కొత్తవాటితో భర్తీ చేసినట్టే ఈ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు యువత పట్టుదలగా ఉందని చెప్పారు.

# నెహ్రూ రెండుసార్లు విభజించారు

**◆ సింధూజలాల ఒప్పందంతో 80 శాతం జలాలు పాక్‌కు.. ◆ ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యలు**

న్యూఢిల్లీ: పాకిస్థాన్‌తో సింధూ జలాల ఒప్పందం వల్ల భారత్‌కు ఒరిగిందేమీ లేదని మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అంగీకరించారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. భారతదేశాన్ని నెహ్రూ రెండుసార్లు విభజించారని ఆరోపించారు. ఒకసారి రాడ్‌క్లిఫ్ లైన్‌తో విభజిస్తే, 80 శాతం జలాలు పాకిస్థాన్‌కు ఇస్తూ సింధూ జలాల ఒప్పందంతో రెండోసారి విభజించారని, ఇది రైతు వ్యతిరేక ఒప్పందమని అన్నారు. జీఎంసీ బాలయోగి ఆడిటోరియంలో మంగళవారం జరిగిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధాని మాట్లాడారు. 'నెహ్రూ దేశాన్ని



ఒకసారి, మళ్లీ మరోసారి విభజించారు. సింధూ జలాల ఒప్పందం కింద 80 శాతం జలాలు పాక్‌కు ఇచ్చారు. ఆ తర్వాత ఈ ఒప్పందం వల్ల భారత్‌కు ఎలాంటి ప్రయోజనం చేకూర లేదంటూ తన సెక్రెటరీ ద్వారా పొరపాటును ఒప్పుకున్నారు' అని మోదీ అన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేక విధానాలకు ఇదే నిదర్శనమని చెప్పారు. కాగా, ఇదే సమావేశంలో ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌ను ఎంపీలకు మోదీ పరిచయం చేశారు. ఓబీసీ కమ్యూనిటీ నుంచి వచ్చిన సరళ స్వభావి, నిబద్ధత కలిగిన నేత అని రాధాకృష్ణన్‌ను ప్రశంసించారు. అనంతరం రాధాకృష్ణన్‌ను ప్రధాని, ఎంపీలు సన్మానించారు.

## ఉపరాష్ట్రపతి అభ్యర్థి నామినేషన్ తేదీ ఖరారు

ఎన్డీయే ఉప రాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ ఈ నెల 20వ తేదీ ఉదయం 11 గంటలకు నామినేషన్ దాఖలు చేయనున్నారు. రాధాకృష్ణన్ నామినేషన్ పేపర్లపై ఎన్డీఏ పక్ష నేతలు సంతకాలు చేయనున్నారు. ఆయనకు మద్దతుగా 20 సెట్ల నామినేషన్ పత్రాలు సమర్పించనున్నారు. ఎన్నిక సందర్భంగా అనుసరించాల్సిన వ్యూహంపై మంగళవారం ఉదయం ఎన్డీయే పక్ష నేతలు సమావేశం కాగా సాయంత్రం 4.30 గంటలకు మరోసారి సమావేశమవుతున్నారు.

**ప్రతిపక్షాల మద్దతు కోరిన మోదీ**

కాగా, ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌కు ప్రతిపక్షాలు మద్దతివ్వాలని ప్రధానమంత్రి మోదీ కోరారు. ఏకగ్రీవంగా ఆయనను ఎన్నుకునేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పార్లమెంటులోని బాలయోగి ఆడిటోరియం మంగళవారం ఉదయం ఎన్డీయే ఎంపీల సమావేశం జరిగింది. ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌ను ప్రధాని స్వయంగా ఎంపీలకు పరిచయం చేశారు. అనంతరం రాధాకృష్ణన్‌ను సన్మానించారు. కాగా, 20వ తేదీ ఉదయం 11 గంటలకు సీపీ రాధాకృష్ణన్ నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తారని



కిరణ్ రిజిజు చెప్పారు. ఎన్డీయే ఫ్లోర్ లీడర్లు, ఎంపీలు సంతకాలు చేస్తారని చెప్పారు. ప్రధాన మంత్రి మోదీ నేతృత్వంలోని ఎంపీలతో సహా ఎన్డీయే నేతలంతా నామినేషన్ల దాఖలు ప్రక్రియకు హాజరవుతారని తెలిపారు.

# ఆన్‌లైన్ బెట్టింగ్ ఇక నేరమే

**◆ మోదీ అధ్యక్షతన గేమింగ్ బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం**



న్యూఢిల్లీ: కేంద్ర మంత్రివర్గం మంగళవారం నాడు కీలక నిర్ణయాలు తీసుకుంది. రాజస్థాన్‌లోని కోటాకు గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ మంజూరు చేయడం సహా మరికొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఈ నిర్ణయాలు తీసుకుంది. రాజస్థాన్‌లోని కోటా-బుండి వద్ద గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయాన్ని రూ.1507.00 కోట్ల అంచనా వ్యయంతో అభివృద్ధి చేయడానికి ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఇచ్చిన ప్రతిపాదనను ఆమోదించింది. చంబల్ నది ఒడ్డున ఉన్న కోట.. రాజస్థాన్ పారిశ్రామిక రాజధానిగా గుర్తింపు పొందింది. అంతేకాకుండా, కోట నేషనల్ ఎడ్యుకేషన్ కోచింగ్ హబ్‌గానూ ప్రసిద్ధి చెందింది. అధికారిక ప్రకటన ప్రకారం.. రాజస్థాన్ ప్రభుత్వం ఏ-321 మోడల్ విమానాల నిర్వహణకు అనువైన గ్రీన్‌ఫీల్డ్ విమానా శ్రయ అభివృద్ధి కోసం 440.06 హెక్టార్ల భూమిని ఏఏఐకి బదిలీ చేసింది. ఈ ప్రాజెక్టులో భాగంగా 20,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో 1000 పీక్ అవర్ ప్యాసింజర్లను నిర్వహించగల సామర్థ్యం గల టెర్మినల్ భవనం నిర్మాణం, వార్షికంగా 2 మిలియన్ల మంది ప్రయాణీకుల సామర్థ్యం, 3200 మీటర్లx45 మీటర్ల రన్‌వే 11/29, ఏ-321 మోడల్ విమానాల కోసం 7 పార్కింగ్ బేలతో కూడిన ఆప్రాన్, రెండు లింక్ టాక్సీవేలు, ఏటీసీ కమ్ టెక్నికల్ బ్లాక్, ఫైర్ స్టేషన్, కార్ పార్క్ అనుబంధ పనులు చేపట్టనున్నారు.

**కేబినెట్ కీలక నిర్ణయాలు**

- రాజస్థాన్‌లో కోటాకు గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు
- రూ.1,507 కోట్లతో కోటాలో కొత్త ఎయిర్ పోర్టుకు ఆమోదం
- కటక్-భువనేశ్వర్ మధ్య 6 లైన్ల రింగ్‌రోడ్డు
- రింగ్‌రోడ్డుకు రూ.8,307 కోట్లు మంజూరు
- ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుకు ఆమోదం

# కానిస్టేబుల్‌ను ఢీకొన్న రాహుల్ కారు

**◆ వీడియో షేర్ చేసిన బీజేపీ**

పాట్నా: బిహార్‌లోని నవాదాలో రాహుల్ గాంధీ చేపట్టిన 'ఓటర్ అధికార్ యాత్ర'లో అపశ్రుతి చోటుచేసుకుంది. రద్దీగా ఉన్న రోడ్డులో ఓపెన్ టాప్ జీపులో రాహుల్ ప్రయాణిస్తుండగా ఆయన వాహనం ఒక పోలీసు కానిస్టేబుల్‌ను ఢీకొంది. వెంటనే పోలీసు సిబ్బంది, రాహుల్ గాంధీ మద్దతుదారులు ఆ వాహనాన్ని వెనక్కి నెట్టడం ద్వారా గాయపడిన కానిస్టేబుల్‌ను కాపాడారు. యాత్రకు భద్రత కల్పించే బాధ్యతల్లో పోలీసు కానిస్టేబుల్ ఉండగా ఈ ఘటన చోటు చేసుకుంది.

**వీడియో వైరల్**

పోలీసును రాహుల్ వాహనం ఢీకొన్న వీడియో ఇప్పుడు వైరల్ అవుతోంది. కారు వీల్స్ కింద నుంచి బయటపడగానే ఆ పోలీసు కుంటుతూ అక్కడి నుంచి వెళ్లడం వీడియోలో కనిపిస్తోంది. ఈ ఘటన జరిగిన వెంటనే ఓపెన్ టాప్ జీపుపై ఉన్న రాహుల్ గాంధీ ఒక వాటర్ బాటిల్‌ను తన మద్దతుదారులకు ఇచ్చి గాయపడిన వ్యక్తికి సాయపడాల్సిందిగా కోరారు. నేరుగా ఆయనను కలుసుకుని పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.

**క్రష్ జనతా యాత్ర.. బీజేపీ ఎద్దేవా**

రాహుల్‌గాంధీ తన వెహికల్‌తో పోలీసు కానిస్టేబుల్‌ను తొక్కించారంటూ బీజేపీ ఈ ఘటనపై విమర్శలు గుప్పించింది. ఇది 'క్రష్ జనతా యాత్ర' అని పార్టీ ప్రతినిధి షెహజాద్ పూనావాలా అన్నారు. పోలీసు కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడ్డారని, ఆయన పరిస్థితి ఏమిటో కూడా రాహుల్ కనుక్కోలేదని విమర్శించారు. రాహుల్ చేపట్టిన ఓటర్ అధికార్ యాత్ర వజీర్‌గంజ్‌లో ప్రారంభమై ప్రస్తుతం నవడా మీదుగా వెళ్తోంది. సెప్టెంబర్ 1న పాట్నాలో ఈ యాత్ర ముగియనుంది.

### 40 అంతస్తుల

## జంబో రాకెట్ నిర్మిస్తున్నాం

### ఇస్రో చైర్మన్ వి.నారాయణన్



భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో కీలక ముందడుగు వేసేందుకు సన్నాహాలు చేస్తోంది. ఏకంగా 40 అంతస్తుల భవనమంత భారీ రాకెట్ నిర్మించే పనిలో నిమగ్నమైనట్లు ఆ సంస్థ చైర్మన్ వి.నారాయణన్ వెల్లడించారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో ఆయన మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ ఏడాది నావిక్ ఉపగ్రహం, ఎన్1 రాకెట్ ప్రయోగం, అమెరికాకు చెందిన 6,500 కిలోల బరువైన కమ్యూనికేషన్ శాటిలైట్‌ను కక్ష్యలోకి చేర్చడం వంటి ప్రాజెక్టులు చేపట్టనుందన్నారు. "మీకు తెలుసా.. అబ్దుల్ కలామ్ జీ తయారు చేసిన తొలి రాకెట్ 17 టన్నుల లిఫ్టాఫ్ బరువుతో 35 కిలోల ఉపగ్రహాన్ని దిగువ భూకక్ష్యకు చేర్చింది. కానీ, నేడు 75,000 కిలోల బరువైన పేలోడ్‌ను దిగువ భూకక్ష్యకు చేర్చడంపై పనిచేస్తున్నాం. అందుకు అవసరమైన రాకెట్ 40 అంతస్తుల భవనం అంత ఎత్తు ఉంటుంది" అని పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్‌కు కక్ష్యలో 55 ఉప గ్రహాలు ఉన్నాయని చెప్పారు. వచ్చే మూడు లేదా నాలుగేళ్లలో వీటి సంఖ్య మూడు లేదా నాలుగు రెట్లు పెరగనుందన్నారు. ఇస్రో ప్రస్తుతం టెక్నాలజీ డెమానిస్ట్రేషన్ శాటిలైట్ (టీడీఎస్), నౌకాదళం కోసం సిద్ధం చేసిన జీశాట్-7ఆర్ ప్రయోగించనుంది. ఇది ఇప్పటికే కక్ష్యలో ఉన్న జీశాట్-7 (రుక్మిణి) స్థానాన్ని భర్తీ చేయనుంది. ఉస్మానియాలో జరిగిన స్నాతకో త్సవంలో నారాయణను గౌరవ డాక్టరేట్‌ను అందజేశారు. భారత అంతరిక్ష కార్యక్రమానికి ఆయన చేసిన సేవలకు గాను ఈ పురస్కారం లభించింది. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతులమీదుగా దీనిని అందుకున్నారు.

# అన్నీ.. అనుకున్నట్టే..!

- పుతిన్‌తో జెలెన్ స్కీ భేటీకి ఏర్పాట్లు మొదలు
- కీలక ప్రకటన చేసిన డొనాల్డ్ ట్రంప్
- సుమారు నాలుగేళ్ల యుద్ధానికి ముగింపు అడుగులు
- జెలెన్‌స్కీ, యూరప్ యూనియన్‌తో విస్తృత భేటీ



రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగిసే దిశగా ఒక్కో అడుగు ముందుకు పడుతోంది. వైట్ హౌస్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ, యూరోపియన్ దేశాల నేతలతో సమావేశం ముగిసిన అనంతరం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. త్వరలోనే రష్యా అధ్యక్షుడు పుతిన్, జెలెన్ స్కీ ఇరువురు సమావేశమయ్యేందుకు అమెరికా ఏర్పాట్లు చేస్తోందంటూ ప్రకటించారు. సుమారు నాలుగేళ్ల యుద్ధాన్ని ముగించేందుకు ఇది కీలక అడుగుగా అభివర్ణించారు. శాంతి ఒప్పంద చర్చలు మరింత మెరుగయ్యాయని పేర్కొన్నారు. జెలెన్‌స్కీతోపాటు వచ్చిన యూరప్ దేశాల అధినేతలు, ఈయూ, నాటో నేతలతో ఓవల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశం అద్భుతంగా జరిగిందంటూ పేర్కొన్నారు. ఈమేరకు తన సోషల్ మీడియా ట్రూత్‌లో పోస్టు చేశారు.

వైట్‌హౌస్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్, ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోని, యూకే ప్రధాని కీర్ స్టార్మర్, జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడిరిక్ మెర్జ్, యూరోపియన్ కమిషన్ ఉర్సులా వాండెర్ యన్, నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టెతో జరిగిన చర్చలు అద్భుతంగా ముగిశాయి. వాషింగ్టన్ సమన్వయంతో యూరోపియన్ దేశాలు ఉక్రెయిన్‌కు భద్రతా హామీలు అందించాలనే దానిపైనే చర్చలు ప్రధానంగా సాగాయి. రష్యా, ఉక్రెయిన్లతో శాంతి నెలకొనబోతుందనే విషయంపై నేతలందరూ సంతోషం వ్యక్తం చేశారు. చర్చల ముగింపులో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో నేను ఫోన్ కాల్‌లో మాట్లాడాను. జెలెన్ స్కీ, పుతిన్ మధ్య భేటీ నిర్వహించేందుకు ఏర్పాట్లు మొదలయ్యాయి. వీరి భేటీ ఎక్కడ జరగాలనేదానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. వీరి సమావేశం ముగిసిన తర్వాత వారితో కలిసి నేను భేటీ అవుతాను. సుమారు నాలుగేళ్ల యుద్ధం ముగించేందుకు ఇదొక మంచి ముందడుగు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ శాఖ మంత్రి మార్కో రూబియో, ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్ సమన్వయంతో రష్యా, ఉక్రెయిన్ల మధ్య సమావేశం జరగనుంది" అని ట్రంప్ పేర్కొన్నారు.

ట్రంప్‌తో జరిగిన చర్చలు చాలా నిర్మాణాత్మకంగా జరిగాయని అంతకుముందు జెలెన్ స్కీ పేర్కొన్నారు. భద్రతా హామీలతో సహా పలు సున్నిత విషయాలపై మాట్లాడినట్టు తెలిపారు. ట్రంప్‌తో కలిసి యూరోపియన్ నేతలు కీలక విషయాలపై చర్చించారు. రష్యా, ఉక్రెయిన్, అమెరికా మధ్య త్రైపాక్షిక సమావేశం, సెక్యూరిటీ గ్యారంటీలు చరిత్రలో నిలిచిపోయే కీలక ముందడుగుగా బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ అభివర్ణించారు. రష్యాతో సమావేశానికి ముందే కాల్పుల విరమణ జరగాలని జర్మన్ ఛాన్సలర్ ఫెడరిక్ మెర్జ్ పేర్కొన్నారు. కాల్పుల విరమణ ఒప్పుకునేందుకు రష్యాపై ఒత్తిడి తేవాలని పేర్కొన్నారు.

ఇక ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ మాట్లాడుతూ.. ట్రంప్ త్రైపాక్షిక సమావేశంపై చర్చించారని, అయితే దీన్ని విస్తృతం చేసి యూరోపియన్ నేతను ఆ భేటీకి అనుమతించాలని ప్రతిపాదించారు. ఇది యూరప్ మొత్తానికి సంబంధించిన విస్తృత భద్రతా హామీలను పరిష్కరించడానికి ఉపయోగపడుతుందన్నారు. ఇటలీ ప్రధాని జార్జియా మెలోని మాట్లాడుతూ ఈ వివాదం మళ్లీ తలెత్తకుండా ఎలా నిర్ధారించుకోవాలని ప్రశ్నించారు. శాంతి ఒప్పందానికి ఇది ముందస్తు షరతు అని పేర్కొన్నారు. ఉక్రెయిన్ మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసే దాడులను అడ్డుకోవాలని అందుకు మిత్రపక్షాలు కలిసిరావాలని నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టె పేర్కొన్నారు..

# మళ్లీ.. వీసా వేట!

**6వేలమంది విదేశీ విద్యార్థుల వీసాలు రద్దు - విద్యావ్యవస్థ పునర్వ్యవస్థీకరణ పనిలో ట్రంప్**




అమెరికాలో నిబంధనలు ఉల్లంఘించిన విద్యార్థులపై కఠిన చర్యలు తీసుకొంటున్నారు. తాజాగా 6,000 మంది అంతర్జాతీయ విద్యార్థుల వీసాలను రద్దు చేసినట్లు బీబీసీ రిపోర్టులో పేర్కొంది. అమెరికా విదేశాంగశాఖ ఈ విషయాన్ని వెల్లడించినట్లు తెలిపింది. 4,000మంది దేశ చట్టాలు ఉల్లంఘించడం, దాడులు, మత్తులో డ్రైవింగ్, దొంగిలిడీలకు పాల్పడటం వంటివి చేసినట్టు తెలుస్తోంది. అమెరికా చట్టాల్లోని ఐఎన్ఏ 3బీ కింద ఉగ్రవాదానికి పాల్పడిన దాదాపు 300మంది కూడా ఈ జాబితాలో ఉన్నారు. కొత్త విద్యాసంవత్సరం ప్రారంభంలో ఈ వీసాల రద్దు వ్యవహారం వెలుగులోకి రావడం గమనార్హం.

ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించాక దేశంలో ఉన్నత విద్యావ్యవస్థను పునర్ వ్యవస్థీకరించే పనిలో పడ్డారు. ప్రధాన వర్సిటీలను లక్ష్యంగా చేసుకొని తీవ్రస్థాయిలో పాలసీల మార్పులు చేపట్టారు. ఇవి అంతర్జాతీయ విద్యార్థులపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. తొలుత జనవరిలో యాంటీ సెమిటిజంను (యూదులపై వ్యతిరేకత) అరికట్టేలా బిల్లును పాస్ చేశారు. అంతర్జాతీయ విద్యార్థులు పాలస్తీనాకు మద్దతుగా ఆందోళనలు చేపడితే ఈ ఆదేశాల ప్రకారం వారిని దేశ బహిష్కరణ చేయవచ్చు. విదేశీ విద్యార్థులకు కొత్త ఇంటర్వ్యూల షెడ్యూల్‌ను నిలిపివేస్తూ జూన్‌లో ట్రంప్ కార్యవర్గం నిర్ణయం తీసుకొంది. అనంతరం సోషల్ మీడియా వెట్టింగ్‌ను కఠినతరం చేశారు. విదేశీ విద్యార్థులు కచ్చితంగా వారి సామాజిక మాధ్యమ ఖాతాలు బహిర్గతం చేయాలని ఆదేశించారు. విద్యార్థుల పోస్టులు, కామెంట్లు, లైక్‌లను అమెరికా అధికారులు పరిశీలించి.. వారు జాతీయ భద్రతకు ముప్పు కాదు అని భావిస్తే మాత్రమే వీసా ప్రక్రియలో ముందుకువెళతారు. ఇక కీలక విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలకు కేటాయించిన నిధుల్లో కోత విధించారు. క్యాంపస్‌లో పాలస్తీనా అనుకూల ఆందోళనల్లో పాల్గొన్న చాలామంది విదేశీ విద్యార్థులను అరెస్టు చేయించారు. హార్వర్డ్ విశ్వవిద్యాలయం అంతర్జాతీయ విద్యార్థులను నియమించుకోకుండా బ్లాక్ చేశారు. ఈక్రమంలో ట్రంప్ కార్యవర్గం, విశ్వవిద్యాలయం మధ్య న్యాయపోరాటం మొదలైంది. గతేడాది గణాంకాల ప్రకారం దాదాపు 10 లక్షల మందికి పైగా అంతర్జాతీయ విద్యార్థులు అమెరికాలో చదువుతున్నారు. వారినుంచి దాదాపు 43.8 బిలియన్ డాలర్లు అమెరికాకు లభించాయని ఎన్ఏఎఫ్ఎస్ఏ అసోసియేషన్ వెల్లడించింది. దేశంలోని మొత్తం విద్యార్థుల్లో వీరు 6 శాతం వరకు ఉంటారు.




## కాంగోలో ఊచకోత!

- 52మందిని కత్తులతో నరికిన వైనం
- ఇస్లామిక్ స్టేట్ మద్దతుదారుల ఘాతుకం

ఆఫ్రికా దేశమైన కాంగోలో ఇస్లామిక్ స్టేట్ మద్దతు కలిగిన తిరుగుబాటుదారులు రెచ్చిపోయారు. కత్తులు, గొడ్డళ్లతో 52 మందిని నరికి చంపేశారు. ఈవిషయాన్ని స్థానిక అధికారులు తెలిపారు. కాంగో దళాల చేతిలో ఓటమి పాలవడంతో రగిలిపోయిన అలైట్ డెమొక్రటిక్ ఫోర్సెస్ (ఏడీఎఫ్) సభ్యులు ఈ ఘాతుకానికి పాల్పడ్డారని అక్కడి అధికారి తెలిపారు. బెని, లుబెరో ప్రాంతాల్లోని పౌరులపై ఏడీఎఫ్ తిరుగుబాటుదారులు దాడికి పాల్పడినట్టు వెల్లడించారు. నిద్రపోతున్న ప్రజలను లేపి.. తాళ్లతో చేతులు కట్టి కత్తులు, గొడ్డళ్లతో అతికిరాతకంగా నరికి చంపారన్నారు. మెలియా గ్రామంలోనే దాదాపు 30మంది ప్రాణాలు తీశారన్నారు. ఎనిమిదిమంది మహిళలు, ఇద్దరు చిన్నారులతో సహా మొత్తం 52మంది ప్రాణాలు కోల్పోయినట్లు వివరించారు. ఇళ్లకు కూడా నిప్పంటించారని, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఇటీవల ఓ క్యాథలిక్ చర్చి ప్రాంగణంలో తిరుగుబాటుదారులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 38మంది ప్రాణాలు కోల్పోయారు. ఇస్లామిక్ స్టేట్‌తో ముడిపడి ఉన్న తిరుగుబాటు సంస్థ ఏడీఎఫ్. ఈ సంస్థ ఉగాండా, డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో సరిహద్దు ప్రాంతాల్లో కార్యకలాపాలను నిర్వహిస్తోంది. పౌరులే లక్ష్యంగా కొన్నేళ్లుగా దాడులకు పాల్పడుతోంది. 2013నుంచి ఇప్పటివరకు దాదాపు 6వేల మందికి పైగా బలిగొన్నట్లు నివేదికలు ఉన్నాయి. ఏడీఎఫ్‌పై అమెరికా, ఐరాస భద్రతామండలి ఆంక్షలు విధించాయి.

## అదీ.. జరిగింది!

**అలస్కా వివరాలను మోదీతో పంచుకున్న పుతిన్**

ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు అలాస్కా వేదికగా ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో జరిపిన చర్చల వివరాలను తెలిపేందుకు భారత ప్రధాని నరేంద్రమోదీకి సోమవారం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఫోన్ చేశారు. మాస్కో నుంచి చమురును కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై ఇటీవల అమెరికా సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. యుద్ధాన్ని ఆపేందుకు ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తే ఆ సుంకాలను అగ్రరాజ్యం తొలగించే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్‌తో జరిగిన చర్చల సారాంశాన్ని మోదీతో పుతిన్ పంచుకోవడం గమనార్హం. రష్యా అధ్యక్షుడు మాట్లాడిన విషయాన్ని ప్రధాని 'ఎక్స్' వేదికగా తెలిపారు. "నా స్నేహితుడు పుతిన్ ఫోన్ చేశారు. అలాస్కాలో ట్రంప్ జరిగిన సమావేశానికి సంబంధించిన వివరాలు పంచుకున్నారు" అని పేర్కొన్నారు.

## యూకేలో జాత్యహంకార దాడి

**ఇద్దరిపై దాడి.. ముగ్గురి అరెస్ట్**

యూకేలో ఇద్దరు వ్యక్తులపై జాత్యహంకార దాడి ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. ఈ ఘటనకు పాల్పడిన ముగ్గురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ దాడులకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. శిరోమణి అకాలీదళ్‌కు నాయకత్వం వహిస్తున్న సుఖ్బీర్ సింగ్ బాదల్ తెలిపిన వివరాల ప్రకారం.. యూకేలోని వోల్వర్‌హాంప్టన్ రైల్వేస్టేషన్ వద్ద ఈనెల 15న ఈ ఘటన జరిగింది. ఇద్దరు సిక్కు వృద్ధులపై ముగ్గురు యువకులు దాడి చేశారు. జాత్యహంకార దాడిని తాను పూర్తిగా ఖండిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా యూకేలోని సిక్కు ప్రవాసుల భద్రత గురించి అధికార ప్రభుత్వం వద్ద లేవనెత్తాలనీ విదేశాంగ మంత్రి జైశంకర్‌ను ఆయన కోరారు. బాధితులకు న్యాయం చేయాలని అక్కడి పోలీసులను అభ్యర్థించారు. ఇలాంటి ప్రవర్తనను సహించేది లేదని పోలీసులు హెచ్చరించారు. ఈ ఘటనకు సంబంధించిన ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నామని, దీనిపై విచారణ కొనసాగుతుందన్నారు. అయితే, ఆ తర్వాత బెయిల్‌పై నిందితులు విడుదలైనట్టు తెలుస్తోంది. యూకే ఎంపీ సురీనా బ్రాకెన్బ్రిడ్జ్ కూడా దాడిని ఖండించారు. ఘటనకు సంబంధించిన నివేదికలను తనకు అందజేయాలని పోలీసులను ఆదేశించారు. ఈ సందర్భంగా వోల్వర్‌హాంప్టన్‌లోని ప్రజలంతా ఐక్యంగా ఉండాలని ఎంపీ పిలుపునిచ్చారు.



# తొలివన్డేలో ఆసీస్ చిత్తు

## 98 పరుగుల తేడాతో సౌతాఫ్రికా ఘనవిజయం

ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో సౌతాఫ్రికా క్రికెట్ జట్టు శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన తొలి వన్డేలో ఆతిథ్య జట్టును ఏకంగా 98 పరుగుల తేడాతో చిత్తు చేసింది. తద్వారా యాభై ఓవర్ల ఫార్మాట్లో పరుగుల పరంగా ఆసీస్ పై తమ అతిపెద్ద విజయం సాధించింది. మూడు టీ20లు, మూడు వన్డేలు ఆడేందుకు సౌతాఫ్రికా జట్టు ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లింది. ఇందులో భాగంగా తొలుత టీ20 మ్యాచ్లు జరుగగా.. 2-1 తో సౌతాఫ్రికాను ఓడించి ఆసీస్ సిరీస్ కైవసం చేసుకుంది. ఈ క్రమంలో ఇరుజట్ల మధ్య మొదలైన వన్డే సిరీస్‌లో సౌతాఫ్రికా బోణీ కొట్టింది.




### మార్క్రమ్ మెరుపులు

కెర్న్స్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఆస్ట్రేలియా తొలుత బౌలింగ్ ఎంచుకుంది. సౌతాఫ్రికా ఓపెనర్లలో ఐడెన్ మార్క్రమ్ మెరుపు అర్ధ శతకం (81 బంతుల్లో 82) తో అదరగొట్టగా.. రియాన్ రికెల్టన్ (43 బంతుల్లో 33) కూడా ఫర్వాలేదనిపించాడు. ఇక ఈ మ్యాచ్లో రీఎంట్రీ ఇచ్చిన కెప్టెన్ టెంబా బవుమా వచ్చీ రాగానే బ్యాట్ ఝుళిపించాడు. 74 బంతులు ఎదుర్కొన్న ఈ కుడిచేతి వాటం బ్యాటర్ ఐదు ఫోర్ల సాయంతో 65 పరుగులు సాధించాడు. మరోవైపు.. మాథ్యూ బ్రీట్జ్కే సైతం అర్ధ శతకం (56 బంతుల్లో 57) తో ఆకట్టుకున్నాడు.

మిగిలిన వారిలో వియాన్ ముల్డర్ (26 బంతుల్లో 31, నాటౌట్) వేగంగా ఆడగా.. కేశవ్ మహరాజ్ 13 పరుగులు చేశాడు. ట్రిస్టన్ స్టబ్స్ (0)తో పాటు.. అరంగేట్ర బ్యాటర్ డెవాల్డ్ బ్రెవిస్ (6) నిరాశపరిచారు. అయితే, మార్క్రమ్, బవుమా, బ్రీట్జ్కే అద్భుత ప్రదర్శన కారణంగా నిర్ణీత 50 ఓవర్లలో సౌతాఫ్రికా ఎనిమిది వికెట్ల నష్టానికి 296 పరుగుల మేర భారీ స్కోరు సాధించింది. ఆస్ట్రేలియా గడ్డపై ఆసీస్‌పై సౌతాఫ్రికాకు ఇదే రెండో అతిపెద్ద స్కోరు.

కాగా ఆసీస్ బౌలర్లలో పార్ట్ టైమ్ స్పిన్నర్ ట్రావిస్ హెడ్ నాలుగు వికెట్లతో ఆశ్చర్యపరచగా.. డ్వార్షుయిస్ రెండు, ఆడం జంపా ఒక వికెట్ పడగొట్టారు.

### నిప్పులు చెరిగిన కేశవ్ మహరాజ్

ఇక లక్ష్య ఛేదనకు దిగిన ఆస్ట్రేలియా 40.5 ఓవర్లలో 198 పరుగులు మాత్రమే చేసి కుప్పకూలింది. లెఫ్టార్మ్ స్పిన్నర్ కేశవ్ మహరాజ్ ఐదు వికెట్లతో సత్తా చాటి.. ఆసీస్ బ్యాటింగ్ ఆర్డర్ పతనాన్ని శాసించాడు. మార్నస్ లబుషేన్ (1), కామెరాన్ గ్రీన్ (3), జోష్ ఇంగ్లిస్ (5), అలెక్స్ క్యారీ (0) రూపంలో నలుగురు కీలక బ్యాటర్లను అవుట్ చేసిన మహరాజ్.. ఆరోన్ హార్డీ (4) వికెట్‌ను కూడా తన ఖాతాలో వేసుకున్నాడు.

### ఘనంగా బ్రెవిస్ ఎంట్రీ

సౌతాఫ్రికా చిచ్చరపిడుగు డెవాల్డ్ బ్రెవిస్ వన్డే క్రికెట్‌లోకి ఘనంగా ఎంట్రీ ఇచ్చాడు. ఈ ఫార్మాట్లో తానెదుర్కొన్న తొలి బంతినే భారీ సిక్సర్‌గా మలిచి రికార్డుల్లోకెక్కాడు.

వన్డేల్లో ఈ ఘనతను అతి కొద్ది మంది (2002 తర్వాత) మాత్రమే సాధించారు. బ్రెవిస్ కు ముందు షమీమ్ హొస్సేన్ (బంగ్లాదేశ్), ఇషాన్ కిషన్ (భారత్), రిచర్డ్ నగరవ (జింబాబ్వే), క్రెయిగ్ వ్యాలెస్ (స్కాట్లాండ్), జవాద్ దావూద్ (కెనడా), జోహాన్ లవ్ (సౌతాఫ్రికా) వన్డేల్లో తొలి బంతిని సిక్సర్గా మలిచారు. జోహాన్ లవ్ తర్వాత ఈ ఘనత సాధించిన రెండో సౌతాఫ్రికా ఆటగాడిగా బ్రెవిస్ రికార్డు నెలకొల్పాడు. బాధాకరమేమిటంటే బ్రెవిస్ సిక్సర్ బాదిన మరుసటి బంతికే ఔటయ్యాడు.

# సూర్య కెప్టెన్.. గిల్ వైస్ కెప్టెన్

## ఆసియా కప్‌కు భారత క్రికెట్ జట్టు ఎంపిక





వచ్చే నెల 9వ తేదీ నుంచి దుబాయ్ వేదికగా ఆసియా కప్ జరగబోతోంది. ఈఆసియా కప్ పూర్తిగా టీ-20 ఫార్మాట్ లోనే జరుగుతోంది. ఈ ఆసియా కప్‌లో పాల్గొనే భారత జట్టును అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ మంగళ వారం ప్రకటించింది. అనుకున్నట్టుగానే సూర్యకుమార్ యాదవ్‌కు కెప్టెన్సీ బాధ్యత లను అప్పగించింది. అయితే జట్టులో చోటు దొరకడమే కష్టమనుకున్న శుభ మన్ గిల్‌కు అంచనాలకు భిన్నంగా ఏకం గా వైస్-కెప్టెన్‌బాధ్యతలను అప్పగించింది.

15 మందితో కూడిన భారత జట్టును తాజాగా సెలక్షన్ కమిటీ ప్రకటించింది. సీనియర్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రాను ఎంపిక చేశారు. అలాగే గాయంతో జట్టుకు దూరమైన రిషభ్ పంత్ స్థానంలో జితేష్ శర్మ వికెట్ కీపింగ్ బాధ్యతలను నిర్వహించనున్నాడు. వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ స్పిన్ బాధ్యతలను పంచుకోబోతున్నారు.

### ఆసియా కప్‌లో పాల్గొనే భారత జట్టు:

సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, అక్షర్ పటేల్, జితేశ్ శర్మ (వికెట్ కీపర్), బుమ్రా, అర్షదీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్, సంజు శాంసన్, హర్షిత్‌రాణా, రింకుసింగ్

### షెడ్యూల్ ఇదీ...

ఆసియా కప్ లో టీమిండియా లీగ్ దశ మొదటి మ్యాచ్‌ను సెప్టెంబర్ 10న యూఏఈతో ఆడనుంది. సెప్టెంబర్ 14న భారత్, పాకిస్థాన్ మధ్య మ్యాచ్ జరగనుంది. లీగ్ ఆఖరి మ్యాచ్ లో 19న ఒమన్‌తో భారత్ తలపడుతుంది.

# ఇక ఆర్చరీ ప్రీమియర్ లీగ్

ప్రధాన క్రీడల్లో మాదిరే ఆర్చరీలోనూ 'ఫ్రాంచైజీ' సంస్కృతి అడుగుపెట్టింది. మొట్టమొదటి ఆర్చరీ ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) అక్టోబరులో జరగనుంది. ఆరు జట్లు ఇందులో తలపడుతున్నట్టు జాతీయ ఆర్చరీ సంఘం (ఏఏఐ) వెల్లడించింది. జ్యోతి సురేఖ, దీపికా కుమారి, ధీరజ్ బొమ్మదేవర, అభిషేక్ వర్మలాంటి స్టార్లు ఏపీఎల్ బరిలో దిగనున్నారు. సురేఖ, ధీరజ్ సహా మరో ముగ్గురు తెలుగు ఆర్చర్లు చికితా రావు, జిగ్నేష్, హంస కూడా లీగ్‌లో పోటీపడతారు. ఫ్రాంచైజీల పేర్లను ఖరారు చేయాల్సి ఉంది. తొలి సీజన్‌కు వేలంలో కాకుండా డ్రాఫ్ట్ విధానంలో ఆర్చర్లను జట్లు ఎంపిక చేసుకోనున్నాయి. ఒక్కో జట్టులో 8 మంది ఆర్చర్లుంటారు. ఇందులో నలుగురు పురుషులు, నలుగురు మహిళా ఆర్చర్లుంటారు. ప్రతి జట్టు ఇద్దరు విదేశీ ఆర్చర్లను చేర్చుకోవచ్చు.

# కోహ్లి నిజంగా కింగే!

భారతక్రికెట్ చరిత్రలో విరాట్ కోహ్లి ఓ అద్భుతమని టీమ్ ఇండియా మాజీ క్రికెటర్ అంబటి రాయుడు ప్రశంసలు కురిపించాడు.కోహ్లికి నైపుణ్యంతోపాటు, ఫిట్‌నెస్ కూడా అదనపు బలమని అతడు కొనియాడాడు. ఓ పాడ్‌కాస్ట్‌లో అంబటి రాయుడు మాట్లాడుతూ కోహ్లి గొప్పదనం గురించి వివరించాడు. విరాట్ కోహ్లి టీమిండియాకోసం ఎంతో చేశాడు. భారత జట్టు రాబోయే వందేళ్లలో ఆధిపత్యం చెలాయించేలా బాటలు వేశాడు. అతడికి ఎంతో నైపుణ్యం ఉంది. దాంతోపాటు చక్కటి ఫిట్‌నెస్ అతడి సొంతం. ఫిజికల్‌గా ఫిట్‌గా ఉంటే, మానసికంగా కూడా బలంగా తయారవుతారు. ఇది క్రికెట్‌కు ఎంతో అవసరం. కోహ్లి కేవలం మంచి బ్యాటర్ మాత్రమే కాదు. ఫిట్‌నెస్ విషయంలో టీమ్ ఇండియాకు అతడో మార్గదర్శి. అతడి వల్లే ఫిట్‌నెస్‌లో భారత జట్టు అత్యున్నత ప్రమాణాలను అందుకుందని అంబటి రాయుడు విశ్లేషించాడు.

కోహ్లి ఇంకొంతకాలం టెస్ట్ క్రికెట్ ఆడి ఉండాల్సిందని అంబటి అభిప్రాయ పడ్డాడు. నా ఉద్దేశం ప్రకారం విరాట్ కోహ్లి కాస్త తొందరగానే టెస్ట్ క్రికెట్‌కు తన రిటైర్మెంట్ ప్రకటించాడు. అతడు ఇంగ్లాండ్ టూర్‌లో భాగమైఉంటే బాగుండేది. ఫిట్‌నెస్ పరంగా చూసుకుంటే.. అతడు ఇంకా చాలా ఏళ్లు క్రికెట్ ఆడగలడు. అయితే ప్రస్తుతం కోహ్లి సంతోషంగానే ఉన్నాడనుకొంటున్నానని అంబటి రాయుడు వివరించాడు.



ఇప్పటివరకు 123 టెస్ట్ మ్యాచ్లు ఆడిన కోహ్లి.. 9,230 రన్స్ చేశాడు. ఇందులో 30 సెంచరీలు, 31 హాఫ్ సెంచరీలున్నాయి. 254 నాటౌట్.. టెస్టుల్లో అతడి అత్యధిక స్కోర్. అలాగే 125 టీ20 మ్యాచ్‌ల్లో 4,188 రన్స్ సాధించాడు. ఇందులో ఒక శతకం, 38 అర్ధ శతకాలున్నాయి.122 నాటౌట్.. అతడి వ్యక్తిగత అత్యధిక స్కోర్. 302 వన్డేల్లో టీమ్ ఇండియాకు ప్రాతినిధ్యం వహించిన కోహ్లి.. 14,181 పరుగులు చేశాడు. ఇందులో 51 శతకాలు, 74 అర్ధశతకాలున్నాయి. ఇప్పటి వరకు వన్డేల్లో అతడి అత్యధిక స్కోరు 183.

### ఈసీ సభ్యుడిగా ఒకసారి పనిచేస్తే చాలు..

జాతీయ క్రీడా సమాఖ్యల అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి పదవులకు పోటీ చేయాలంటే..గతంలో ఆయా సమాఖ్యల ఎగ్జిక్యూటివ్ కమిటీలలో రెండుసార్లు సభ్యుడిగా ఉండాల్సి వచ్చేది. కానీ పార్లమెంట్ ఆమోదించిన నూతన జాతీయ క్రీడా పరిపాలన బిల్లు ప్రకారం ఒక్కసారి ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా వ్యవహరిస్తే చాలు. యువ క్రీడా పరిపాలకులు, నాయకత్వ లక్షణాలు కలిగిన అథ్లెట్లను ప్రోత్సహించేందుకే 'రెండు టర్మ్'లను ఒకటికి కుదించినట్టు కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవ్య వెల్లడించారు. జాతీయ క్రీడా పరిపాలన బిల్లును ప్రస్తుతం రాష్ట్రపతి ఆమోదం కోసం పంపారు. రాష్ట్రపతి సంతకం చేశాక 'కొత్త బిల్లు' చట్టంగా మారనుంది.

# బుచ్చిబాబు టోర్నీలో రమణ్‌దీప్ శతకం

ఐపీఎల్ తరువాతి సీజన్‌కు తనను వదిలించుకోవాలనే ఆలోచనలో ఉన్న కోల్‌కతా నైట్‌రైడర్స్ ఫ్రాంచైజీకి ఆ జట్టు ఆల్‌రౌండర్ రమణ్‌దీప్ సింగ్ పెద్ద సవాల్ విసిరాడి. బుచ్చిబాబు టోర్నీలో చెలరేగిపోయాడు. ఈటోర్నీలో పంజాబ్‌కు ఆడుతున్న అతను...హైదరాబాద్‌లో జరిగిన మ్యాచ్‌లో విధ్వంసకరశతకంతో విరుచుకుపడ్డాడు. 95బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకొని, 101 బంతుల్లో 111 పరుగులు చేసి ఔటయ్యాడు. రమణ్‌దీప్ సెంచరీతో ఈ మ్యాచ్‌లో పంజాబ్ భారీ స్కోర్ చేసింది. ఈ ఇన్నింగ్స్‌లో రమణ్‌దీప్ వీలు చిక్కినపుడల్లా భారీ షాట్లు ఆడి స్కోర్ బోర్డును పరుగులు పెట్టించాడు. పరిమిత ఓవర్ల ఆటగాడిగా ముద్రపడిన రమన్‌దీప్.. సుదీర్ఘ ఫార్మాట్లోనూ సత్తా చాటి ఆ ముద్రను చెరిపేసుకున్నాడు. భారత క్రికెట్లో అరుదుగా కనిపించే సీమ్ బౌలింగ్ ఆల్‌రౌండర్లలో రమణ్ దీప్ ఒకడు.పవర్ హిట్టింగ్‌కు పేరుగాంచిన ఇతను భారత్‌తరఫున 2 టీ20లు ఆడాడు.దేశవాళీ క్రికెట్లో మెరుపులు కారణంగా రమణ్‌దీప్‌కు ఐపీఎల్ అవకాశం దక్కింది. ఇతన్ని కేకేఆర్ యాజమాన్యం గత సీజన్‌కు ముందు రూ.4కోట్లకు రిటైన్ చేసుకొని అందరినీ ఆశ్చర్యపరిచింది. అయితే తనపై యాజమాన్యం పెట్టుకున్న నమ్మకాన్ని రమణ్‌దీప్ వమ్ము చేశాడు. అటు బ్యాట్‌తో, ఇటు బంతితో ఏమాత్రం ప్రభావం చూపించలేకపోయాడు. దీంతో తరువాతి సీజన్‌కు అతడిని వదిలించుకోవాలని కేకేఆర్ యాజమాన్యం యోచిస్తోంది. తాజా ప్రదర్శనతో కేకేఆర్ యాజమాన్యానికి రమణ్‌దీప్ సవాల్ విసిరాడు. తన సేవలను సద్వినియోగించుకోవాలని పరోక్ష హెచ్చరిక చేశాడు.



# టీజర్‌లో.. - లిటిల్ హార్ట్స్



యువ నటీనటులు మౌళి,శివానీ నాగారంతో దర్శకుడు సాయిమార్తాండ్ తెరకెక్కిస్తోన్న చిత్రం –'లిటిల్ హార్ట్స్'. ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్ నిర్మించిన చిత్రమిది. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న మూవీ సెప్టెంబరు 12న థియేటర్స్‌లో విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం టీజర్ విడుదలైంది. 'నాట్ టచింగ్.. ఓన్లీ హార్ట్ టచింగ్' అంటూ యువతను ఆకట్టుకునే అంశాలను మేళవించి మూవీని తీర్చిదిద్దుతున్నట్లు అర్థమవుతోంది. ముఖ్యంగా కోచింగ్ సెంటర్ల నేపథ్యంలో సినిమా సాగనున్నట్టు టీజర్‌ను చూస్తే అర్థమవుతుంది.

# 'దేశాన్ని మళ్లీ బళ్లో వేయాలి'

'యూనివర్సిటీ పేపర్ లీక్' టైటిల్‌తో ఆర్ నారాయణ మూర్తి ఓ సినిమా తెరకెక్కించారు. ఆగస్టు 22న ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో సినిమా టీమ్ మీడియా మీట్ నిర్వహించింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బ్రహ్మానందం.. ఆర్ నారాయణమూర్తితో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. "అప్పట్లో ఎక్కడెక్కడినుంచో మన దేశానికి వచ్చి చదువుకొనే వారు. ఈరోజు మన దేశ విద్యావ్యవస్థ మారిపోయింది. అదెలావుందీ అనే అంశంపై నారాయణమూర్తి రూపొందించిన గొప్ప చిత్రమిది. ఆయన తేనెటీగ లాంటి మనిషి. అన్ని ప్రాంతాలకూ తిరుగుతూ తేనె తీసుకొచ్చి అందరికీ పంచాలనే సంకల్పం ఉన్న మంచి మనిషి. అందమైన హీరో ఎవరని నన్ను అడిగితే నారాయణమూర్తి పేరు చెబుతాను. అందం అంటే గ్లామర్ కాదు.. మంచి మనసు. నాకు ఆయన 40 ఏళ్లుగా తెలుసు. నిరంతరం ప్రజల గురించే ఆలోచిస్తారు. ఈ సినిమా కూడా పేద ప్రజల కోసమే తీశారు" అన్నారు. "నారాయణమూర్తి ఎన్నో త్యాగాలు చేశారు. ఆయన జీవితం మీకు అంకితం. చివరిశ్వాస వరకూ మీకోసం కష్టపడుతూనే ఉండాలని కోరుకుంటున్నాను. ఇది ఎంతో అందమైన సినిమా. ఇందులో నిజాలుంటాయి.. బూతులుండవు. జీవితపు లోతులుంటాయి. 'పెద్ద వాళ్లకు కావాలంటే నాలో అమ్మదానికి చాలా ఉన్నాయి.. కిడ్నీ కూడా ఉంది' అంటూ సాగే కొన్ని డైలాగులు వింటే హృదయం కదిలిపోయింది. ఈ సినిమాను అందరూ చూడాలి. అర్థం చేసుకోవాలి. సమాజం బరువు మోసే వ్యక్తి నారాయణమూర్తి, ఆయన ఒక శక్తి" అన్నారు. "నారాయణమూర్తి చేసినన్ని మంచి పనులు నేను చేయలేదు. చేస్తానో లేదో కూడా తెలియదు. నాకు తెలిసినప్పటినుంచి ఆయన ఒకేలా ఉన్నారు. అవే చెప్పులు.. అదే ప్యాంటుషర్ట్.. అదే ఆటో. ఒక్క సినిమా హిట్ అయితే ఈ రోజుల్లో మనం ఎలా ప్రవర్తిస్తున్నామో అందరికీ తెలుసు. 40 ఏళ్ల కెరీర్లో ఎంతోమంది ఎన్నో ప్రలోభాలు పెట్టినా వాటికి తలొంచలేదు. నాకు వెంకటేశ్వరస్వామి అంటే ఇష్టం.. నారాయణమూర్తి అంటే ఇష్టం" అన్నారు. ఇక సినిమాను ఉద్దేశిస్తూ..ఈ దేశాన్ని మళ్లీ బడిలో వేయాలి అని బ్రహ్మానందం వ్యాఖ్యానించారు. నారాయణమూర్తి మాట్లాడుతూ.. "తెలుగు చిత్ర పరిశ్రమలో బ్రహ్మానందం మహానటుడు, మహా జ్ఞాని. అన్నిటికీ మించి మాస్టారు. అందుకే ఈ సినిమాను ఆయనకు చూపించాను. ఆయన వెంటనే నా విజ్ఞప్తిని మన్నించి యూనివర్సిటీ'ని చూశారు. నన్ను ఆశీర్వదించారు. ఆయన స్పీచ్ వింటుంటే నాకు ఆనందబాష్పాలు ఆగలేదు" అంటూ భావోద్వేగానికి గురయ్యారు.



## సోషల్ మీడియా.. మన విలువ పెంచదు

నటి ఐశ్వర్యారాయ్ అంటేనే తెలీని ఓ స్పెషల్ అట్రాక్షన్. తాజాగా ఆమె విశృంఖలమవుతున్న సోషల్ మీడియా విషయంలో ఆందోళన వ్యక్తం చేశారు. గుర్తింపు కోసం ప్రజలంతా ఆరాటపడుతున్నారన్నారు. ఆమె మాటలకు నెటిజన్లు ఫిదా అవుతున్నారు. సోషల్ మీడియా వినియోగం పెరిగిందన్న ఐశ్వర్యా.. వాటిలో వచ్చే లైక్స్, కామెంట్స్ మన జీవితాలను నిర్ణయించలేవని హెచ్చరించారు. "మన విలువను ఏదీ నిర్ణయించలేదు. సోషల్ మీడియాలో వచ్చే లైక్స్, కామెంట్స్, షేర్‌లు ఇవి మనలోని ఆత్మవిశ్వాసాన్ని బయట ప్రపంచానికి చూపవు. నిజమైన అందం మనలోనే ఉంటుంది. నా దృష్టిలో సోషల్ మీడియాకు, సామాజిక ఒత్తిడికి మధ్య పెద్ద తేడా లేదు. తల్లిగా నాకు ఈ విషయంలో ఆందోళన కలుగుతుంది. వయసుతో సంబంధం లేకుండా అందరూ దీనికి బానిసలవుతున్నారు. దాన్ని దాటి చూసినప్పుడే అసలైన ప్రపంచం కనిపిస్తుంది. ఆత్మగౌరవం కోసం సామాజిక మాధ్యమాల్లో వెతకొద్దు.. అది కచ్చితంగా అక్కడ దొరకదు" అని తెలిపారు. ఐశ్వర్యా వ్యాఖ్యలపై ప్రశంసలు వస్తున్నాయి. ప్రస్తుతం యువతకు కావాల్సిన మెసేజ్ ఇదేనని అభిప్రాయపడుతున్నారు. ఐశ్వర్యారాయ్ చివరిసారి 'పొన్నియిన్ సెల్వన్–2'లో కనిపించారు. మణిరత్నం దర్శకత్వంలో వచ్చిన సినిమాలో విక్రమ్, ఐశ్వర్య, జయం రవి, కార్తి, త్రిష కీలక పాత్రల్లో నటించారు. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద రూ.300 కోట్లకు పైగా కలెక్షన్లు రాబట్టింది.



## 'థామా'తో భయపెడుతుందా?



వరుస హిట్లుతో జోరుమీదున్న రష్మిక ప్రస్తుతం 'థామా'తో బిజీగా ఉంది. బాలీవుడ్ హీరో ఆయుష్మాన్ ఖురానాకు జోడీగా నటిస్తున్న చిత్రమిది. ఆదిత్య సర్పోర్దార్ దర్శకుడు. తాజాగా సినిమా టీజర్‌ను 'వరల్డ్ ఆఫ్ థామా' పేరిట టీమ్ విడుదల చేసింది. గతంలో రష్మిక చెప్పినట్టు అతీంద్రియ శక్తులతో కూడిన రొమాంటిక్ చిత్రంగా దీన్ని రూపొందించినట్లు టీజర్ ఆధారంగా తెలుస్తోంది. హారర్ నేపథ్యం ఉన్నప్పటికీ ప్రేమే ముఖ్య కథాంశంగా సినిమా ముస్తాబవుతోందట.

# 'మదరాశి' కథ.. మొదట షారూక్‌కు చెప్పా



హీరో శివ కార్తికేయన్ దర్శకుడు ఎఆర్ మురుగదాస్ కాంబోలో రానున్న సినిమా 'మదరాశి'. ఈ సినిమా కథను ఏడేళ్ల క్రితమే షారుక్‌కు చెప్పానంటున్నాడు దర్శకుడు. సెప్టెంబర్ 5న సినిమా విడుదల కానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా ఇంటర్వ్యూలో మురుగదాస్ మాట్లాడుతూ.. 'మదరాశి' కోసం మొదట షారుక్‌ను సంప్రదించానన్నాడు. "ఏడేనిమిదేళ్ల క్రితమే కథను షారుక్ ఖాన్‌కు చెప్పాను. లైన్ నచ్చింది. కాకపోతే అప్పటికి స్క్రిప్ట్ సిద్ధం చేయలేదు. దాంతో.. హీరో పాత్ర గురించి తక్కువ చెప్పాను. రెండువారాల తర్వాత ఆయనకు మెసేజ్ చేశాను. నచ్చినప్పటికీ ఆయననుంచి సరైన స్పందన రాలేదు. తర్వాత షారుక్‌ను ఎప్పుడూ సంప్రదించలేదు. అప్పుడే శివకార్తికేయన్‌తో ఈ సినిమా చేయాలని నిర్ణయించుకున్నాను. అతడికి తగినట్లుగానే స్క్రిప్ట్ రాశాను" అన్నారు. ఇక స్టార్ హీరోలతో షూటింగ్ అంత సులభం కాదంటున్నాడు మురుగదాస్. "మేం సికందర్ షూటింగ్ ఎక్కువగా రాత్రి సమయంలోనే చేశాం. పగటి సన్నివేశాలను కూడా నైట్ టైమ్ చిత్రీకరించాల్సి వచ్చేది. సల్మాన్ రాత్రి 8కి సెట్స్‌కు వచ్చేవారు. మేము తెల్లవారుజాము నుంచే షూటింగ్ చేస్తూ ఉండేవాళ్లం. స్టార్ హీరోలతో చిత్రీకరణ అంటే అన్నీ ప్రణాళిక ప్రకారం జరగవు. సికందర్ కథను అనుకున్నట్టుగా తీయలేకపోయాం. భావోద్వేగాలు ఉన్నప్పటికీ అనుకున్న విధంగా తెరకెక్కించడంలో విఫలమయ్యాం" అని మురుగదాస్ వివరించారు.

## టాక్సిక్ బోర్డులోకి రుక్మిణి



రుక్మిణీ వసంత్ వరుసగా భారీ సినిమాల్లో అవకాశాలు అందిపుచ్చుకుంటూ స్టార్ నాయికల లీగ్‌కు అతి చేరువైంది. ఆమె ప్రస్తుతం రిషబ్‌శెట్టితో 'కాంతారా: చాప్టర్ 1'లో, శివ కార్తికేయన్‌తో 'మదరాసి'లో నటించిన సంగతి తెలిసిందే. ఈ రెండూ త్వరలోనే థియేటర్లలోకి రానున్నాయి.మరోవైపు ఎన్టీఆర్– ప్రశాంత్ నీల్ చిత్రంతో పాటు మరో రెండు పెద్ద సినిమాల విషయంలోనూ ఆమె పేరు బలంగా వినిపిస్తుంది. ఈ క్రమంలోనే ఇప్పుడామె ఖాతాలోకి 'టాక్సిక్' చేరినట్టు తెలుస్తోంది. 'కేజీఎఫ్' విజయాల తర్వాత హీరో యశ్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రమిది. గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్నారు. కియారా అద్వానీ కథానాయిక. నయనతార, తారా సుతారియా, హ్యూమా ఖురేషీ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పుడీ సినిమాలో రుక్మిణి కూడా చేరినట్టు సమాచారం. ఆమె ఈ చిత్రంలో ఓ ముఖ్య పాత్రలో అలరించనున్నట్టు తెలిసింది. అలాగే కన్నడ నటుడు బాలాజీ మనోహర్ కూడా దీంట్లో ఓ కీలక పాత్రలో నటించనున్నట్లు తెలుస్తోంది. పీరియాడిక్ గ్యాంగ్ స్టర్ డ్రామాగా ముస్తాబవుతున్న ఈ చిత్రం వచ్చే ఏడాది మార్చి 19న రానుంది.